

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 24-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 234 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50





విజ్ఞాన చంద్రోదయం

ఇది సైన్స్ సాధించిన విజయం... భారత్‌కు గర్వకారణం

- జాబిలిపై సురక్షితంగా కాలుమోపిన ల్యాండర్ విక్రమ్
- 20 నిమిషాల్లో సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ పూర్తి
- దక్షిణధృవాన్ని చూసిన మొదటి దేశంగా చరిత్ర
- రెండు వారాలు పరిశోధనలు చేయనున్న రోవర్

చంద్రునిపై మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. అంతరిక్ష చరిత్రలో భారతావని సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. చందమామను ముద్దాడిన నాలుగో దేశంగా, ఇప్పటి వరకూ ఎవరూ కాలూనని దక్షిణ ధృవంపై సాఫ్ట్ లాండింగ్ చేసిన మొట్టమొదటి దేశంగా ఇండియా రికార్డు సృష్టించింది. తద్వారా చంద్రునిపై ఇప్పటికే కాలుమోపిన అమెరికా, రష్యా, చైనా సరసన చేరింది. నలభై ఒక్క రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం ల్యాండర్ విక్రమ్ బుధవారం సాయంత్రం 6.04 గంటలకు సురక్షితంగా జాబిలిపై కాలుమోపింది. ఆ వెంటనే దాని నుంచి ఆరు చక్రాల రోవర్ ప్రజ్ఞాన్ వేరుపడి సెకనుకు సెంటీమీటరు వేగంతో కదులుతూ చంద్రునిపై అడుగు పెట్టింది. మొత్తంమీద సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియకు 20 నిమిషాల సమయం పట్టింది. రోవర్ ప్రజ్ఞాన్ 14 రోజుల పాటు చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు చేస్తుంది. ప్రయోగం విజయవంతం కాగానే 'నా గమ్యాన్ని చేరుకున్నాను. నాతో పాటు మీరు కూడా...' అని ఇస్రో ట్వీట్ చేసింది. బెంగళూరులోని మిషన్ కంట్రోల్ కాంప్లెక్స్‌లో క్షణక్షణం ఉత్కంఠగా ఎదురు చూసిన శాస్త్రవేత్తలు కరతాళధ్వనులతో జయజయధ్వానాలు చేశారు. మరోవైపు దేశవ్యాప్తంగా అంబరాలు సంబరాన్ని అంటాయి. 2019లో చంద్రయాన్-2 వైఫల్యం మిగిల్చిన బాధాకరమైన జ్ఞాపకాలను జాతి యావత్తూ మరిచిపోయింది. ఇది సైన్స్ సాధించిన విజయంగా శాస్త్రవేత్తలు, అభిప్రాయపడ్డారు.

బెంగళూరు : చంద్రయాన్-3 ప్రయాణం జూలై 14న శ్రీహరికోటలో ప్రారంభమైంది. ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్‌ను ప్రయోగించారు. కక్ష్యను పెంచడం, తగ్గించడం వంటి ప్రక్రియలను దిగ్విజయంగా పూర్తి చేసుకొని సాయంత్రం 5.44 గంటలకు ల్యాండర్ మాడ్యూల్ నిర్దేశిత ప్రాంతానికి చేరుకుంది. చంద్రుడి ఉపరితలానికి 30 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నప్పుడు ఆటోమేటిక్ ల్యాండింగ్ సీక్వెన్స్ ప్రారంభమైంది. ఏఎల్‌ఎస్ కమాండ్‌ను స్వీకరించి, థ్రాటర్‌బుల్ ఇంజిన్ల వేగాన్ని తగ్గించుకుంటూ ముందుకు సాగింది. గంటకు సుమారు ఆరు వేల కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ల్యాండర్ విక్రమ్ కేవలం 17 నిమిషాలలోనే తన జోరుకు కళ్లెం వేసుకొని చందమామ దక్షిణ ధృవంపై సురక్షితంగా దిగింది. దక్షిణ ధృవానికి దగ్గరగా సుమారు 70 డిగ్రీల దక్షిణ అక్షాంశం వద్ద సాఫ్ట్ ల్యాండింగ్ జరిగింది. చంద్రయాన్-2 విఫలమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ల్యాండర్ విక్రమ్‌లో అదనపు సెన్సార్లు అమర్చారు. కీలక వ్యవస్థలు విఫలమైనా సాఫ్ట్ ల్యాండింగ్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. చంద్రుని పైన కాలు పెట్టడం అంత తేలిక కాదు. ఇప్పటి వరకూ 12 దేశాలు 141 సార్లు ప్రయత్నాలు చేయగా 69 సార్లు మాత్రమే విజయం సాధించాయి. అగ్రరాజ్యమైన అమెరికా సైతం పదిహేను వైఫల్యాలను చవిచూసింది.

వెల్లువెత్తుతున్న అభినందనలు

ఇస్రో కృషిని ప్రశంసిస్తూ దేశ విదేశాల నుండి ప్రశంసలు, హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. నూతన సాంకేతికతలను భారత్ ప్రదర్శించిన తీరు అమోఘమని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ వ్యాఖ్యానించారు. నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ కూడా ఇస్రోను అభినందించారు. మూన్ మిషన్‌కు అవసరమైన పరికరాలను, వస్తువులను సరఫరా చేసిన లార్సెన్ అండ్ టుబ్రో, గాద్రెజ్ అండ్ బాయిస్ కంపెనీలు కూడా అభినందనలు అందచేశాయి. పలు రాజకీయ పార్టీల నేతలు, మంత్రులు, అధికారులు, ప్రముఖులు ఇస్రోను ప్రశంసల్లో ముంచెత్తారు.

అనుకున్న సమయానికి అనుకున్నట్లుగా అన్నీ...

ల్యాండింగ్ ప్రక్రియకు రెండు గంటలు ముందుగా 3.45 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను, ల్యాండింగ్ పరిస్థితులను ఇస్రో నిశితంగా పరిశీలించింది. ఒకవేళ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే 27న ఈ ల్యాండింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కూడా నిర్ణయించింది. అయితే, సరిగ్గా నిర్దేశిత సమయం 5.44 గంటలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలైంది. తర్వాత వరుసగా నాలుగు దశలను విజయవంతంగా ...13లో

అద్భుత ప్రయాణం : సీతారాం ఏచూరి



చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి అభినందనలు తెలియచేశారు. దశాబ్దాల తరబడి శాస్త్రవేత్తలు చేసిన కృషికి ఈ విజయం నిదర్శనం. భారత్‌కు ఇది మహత్తరమైన రోజు, శాస్త్రీయ దృక్పథానికి, హేతుబద్ధతకు నిరాజనం అని కొనియాడారు. ఆరు దశాబ్దాలుగా నిబద్ధత, కఠోర శ్రమ, అంకిత భావంతో సాగిన ఈ ప్రయాణం ఈ దార్శనికతను సాకారం చేసిందని అన్నారు. ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

ఇక సూర్యుడే లక్ష్యం : ప్రధాని మోడీ



జాబిల్లిపై పెట్టుకున్న లక్ష్యాన్ని విజయవంతంగా సాధించిన ఇస్రో ఇక తన తర్వాతి ప్రాజెక్టులపై దృష్టి పెట్టనుంది. త్వరలోనే ఆదిత్య ఎల్1 పేరుతో ఇస్రో సోలార్ మిషన్‌ను ప్రారంభిస్తుందని ప్రధాని మోడీ ప్రకటించారు. సెప్టెంబరు మొదటి వారంలో బహుశా దీనిపై వివరాలు వెల్లడయ్యే అవకాశం వుంది. వాతావరణ పరిశీలనకు ఉపగ్రహాన్ని పంపించాలని కూడా ఇస్రో భావిస్తోంది. గగన్‌యాన్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రామ్‌లో భాగంగా టెస్ట్ వెహికల్‌ను పంపాలని చూస్తోంది. శుక్ర గ్రహంపైకి కూడా మిషన్ చేపట్టాలని ఇస్రో భావిస్తోంది.

వైఫల్యాల నుంచి విజయాల వైపు

చంద్రయాన్ 2 విఫలమైన నేపథ్యంలో కసిగా మరింత కఠినమైన కసరత్తు చేసి, వైఫల్యాల నుండే గుణపాఠాలు నేర్చుకుని మరింత పకడ్బందీగా చంద్రయాన్-3కి ఇస్రో సిద్ధమై విజయం సాధించింది.

- చంద్రయాన్-2లో లేని కొన్ని అంశాలను ఈసారి అదనంగా జోడించింది.
- గంటకు 10.8కిలోమీటర్ల వేగం వరకు సురక్షితంగా దిగగలిగేలా కొత్త విక్రమ్ ల్యాండర్ కాళ్ళను పటిష్టపరిచింది.
- అలాగే పెద్ద ఇంధన ట్యాంక్‌ను అమర్చారు. చివరి నిముషంలో మార్పులు జరిగి అవసరమైతే అనుకూల ప్రదేశం కోసం అన్వేషణ సాగించేవరకు ఇంధనం వుండేలా చంద్రయాన్- 3లో మరింత పెద్ద ట్యాంక్‌ను అమర్చారు.
- చంద్రయాన్-2లో కేవలం రెండువైపుల మాత్రమే సౌర ఫలకాలు పెట్టారు. ఈసారి ల్యాండర్‌కు నాలుగు వైపులా సోలార్ ప్యానెళ్ళు అమర్చారు.
- సాఫ్ట్ ల్యాండింగ్‌కు వెసులుబాటు కల్పించేలా మరింత మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను, అదనపు పరికరాలను ల్యాండర్‌లో అమర్చారు.

సేవ చేస్తున్నా గుర్తించండి...

కాంగ్రెసోడు 3 గంటలంటడు.. బీజేపోడు మీటర్లంటడు

- ధరణితో భూమిపై రైతుదే పెత్తనం
- మెదక్ జిల్లాకు వరాల జల్లు : ప్రగతి శంఖారావం సభలో సీఎం కేసీఆర్
- మెదక్ జిల్లా కలెక్టర్, ఎస్పీ నూతన భవనాలు ప్రారంభం
- విపక్ష నేతల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ - మెదక్ ప్రతీయ ప్రతినిధి

దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, కోటి మూడు లక్షల కుటుంబాలకు నల్లా పెట్టి రక్షిత మంచినీళ్లు ఇస్తున్నామని, ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి రోజుకి 24 గంటలు పాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నామని, ధాన్యం పండించడంలో నెంబర్ వన్ స్థానంలో తెలంగాణను నిలిపామని సీఎం కేసీఆర్ తెలిపారు. మెదక్ జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం, ...13లో

నేడు మంత్రివర్గ విస్తరణ

- క్యాబినెట్‌లోకి పట్నం మహేందర్ రెడ్డి వివరాలు 13లో..

మిజోరంలో ఘోరప్రమాదం

- నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలి 22 మంది మృతి

వివరాలు 6లో..

ఏడాదికి బోర్డు పరీక్షలు రెండు సార్లు

- 11, 12 తరగతుల విద్యార్థులకు రెండు భాషలు తప్పనిసరి
- అందులో ఒకటి దేశీయ, మరొకటి విదేశీ భాష : ఎన్‌సీఈఆర్‌టీ

వివరాలు 6లో..



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

వివరాలు 3లో..

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



పారితోషికాలూ పెంచాలి : ఆశా వర్కర్ల డిమాండ్..

వివరాలు 3లో..

కారు దిగు..'చెయ్యి' ఎత్తు

కాంగ్రెస్ వైపు అసంతృప్తుల చూపు

- రేవంత్‌తో మైనంపల్లి చర్చలు..!
- బీఆర్ఎస్‌కు వేముల వీరేశం, సంతోష్, జైపాల్‌రెడ్డి గుడ్‌బై
- కమలాన్ని వీడి కాంగ్రెస్‌లోకి వినయ్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డితో మల్లు రవి భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఆపార్టీలో అలకలు, అసంతృప్తులు పెరుగుతున్నాయి. సొంత పార్టీ నేతలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిష్టానంపై బాణాలు ఎక్కుపెడుతున్న అసంతృప్తులను దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు ఫలించడం లేదు. ఒకేరోజు ఏకంగా ముగ్గురు నేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. కారులో చోటు దక్కకపోవడం, అధిష్టానం తీరు నచ్చకపోవడం వంటి కారణాలతో ఆ పార్టీకి పలువురు రాజీనామా చేస్తున్నారు. అందుకే వారు కారు దిగి కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రెండు రోజులు క్రితం మంత్రి హరీశ్‌రావుపై చేసిన ఘాటు వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపై అధిష్టానం వేటుకు సిద్ధమవుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. మల్కాజిగిరి టికెట్‌తోపాటు కుమారుడికి మెదక్ టికెట్ ఇవ్వాలనే మైనంపల్లి విజ్ఞప్తిని బీఆర్ఎస్ అధిష్టానం పట్టించుకోకపోవడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మంత్రి హరీశ్‌రావు తన కుమారుడికి టికెటు రాకుండా అడ్డుకున్నారనే సమాచారంతో మైనంపల్లి రగిలిపోయినట్టు తెలుస్తోంది.


దీంతో ఆయన హస్తం వైపు చూస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే ఆయనతో రేవంత్‌రెడ్డి ఫోన్లో మాట్లాడినట్టు సమాచారం. మెదక్ పార్లమెంటు స్థానంతోపాటు మల్కాజిగిరి అసెంబ్లీస్థానాన్ని మైనంపల్లి అడిగినట్టు తెలుస్తోంది. దీనిపై కాంగ్రెస్ మాత్రం ఇంకా స్పష్టత ...13లో

మీడియా స్వేచ్ఛపై ఉక్కుపాదం

యూపీ బాటలో మరిన్ని రాష్ట్రాలు ?... ఎన్నికల వేళ పెత్తనం కోసం పాట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే పత్రికలు, ప్రసారం చేసే ఛానల్స్‌పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించిన విషయం విదితమే. ఇప్పుడు ఇతర రాష్ట్రాలు కూడా అదే బాటలో నడిచేందుకు సిద్ధమవుతున్నాయి. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంటే ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చడీచప్పుడు లేకుండా తన అధికారులకు ఓ ఆదేశం జారీ చేసింది. అదేమిటంటే... మీడియాలో వచ్చే ప్రభుత్వ వ్యతిరేక వార్తలపై కన్నేసి ఉంచాలని, ఆ సంస్థలకు నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని. అంటే మీడియాలో వచ్చే వార్తలలో నిజం ఎంత అనే విషయాన్ని ప్రభుత్వమే నిర్ధారించుకొని, తగిన చర్యలు తీసుకుంటుంది. తద్వారా రాజ్యాంగంలోని 19వ అధికరణ కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు





తూట్లు పొడుస్తుంది. ఐదు రాష్ట్రాల శాసనసభలకు, ఆ తర్వాత లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మీడియా సంస్థలపై ఆధిపత్యం చెలాయించేందుకు అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఇటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి.

ఇవేం నిబంధనలు?

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే వార్తలలో వాస్తవాన్ని ప్రశ్నించడం ఆదిత్యనాథ్ సర్కారుతోనే మొదలు కాలేదు. అది చివరిదీ కాబోదు. కేంద్ర ప్రభుత్వ నూతన ఐటీ నిబంధనలను, ...13లో

ద్వైపాక్షిక సంబంధాలను పరిపుష్టం చేస్తాం..

బ్రిక్స్ సదస్సులో మోడీ



జోహాన్నెస్‌బర్గ్ : 15వ బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన ప్రధాని మోడీ దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమాఫోసాతో భేటీ అయ్యారు. బ్రిక్స్ సదస్సుకు ముందుగానే వీరి సమావేశం జరిగింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లోని పురోగతి గురించి సమీక్షించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా గల పేద దేశాల వాణిని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పని ...13లో

గాలిలో దీపంలా రైల్వే భద్రత

మితిమీరుతున్న కన్సల్టెంట్ల జోక్యం

- దారి మళ్లుతున్న నిధులు

న్యూఢిల్లీ : బాలాసోర్ ప్రమాదం తర్వాత భారతీయ రైల్వేల ప్రతిష్ట కొంత మసకబారింది. అయితే గత దశాబ్ద కాలంగా చేపట్టిన భద్రతా చర్యల కారణంగా రైల్వే ప్రమాదాల సంఖ్య 131 నుండి 34కు తగ్గింది. కానీ కొంతకాలంగా రైల్వేలో ప్రయాణికుల భద్రతపై అధికారులకు శ్రద్ధాసక్తులు తగ్గినట్లే కన్పిస్తోంది. సాధారణంగా రైల్వే బోర్డు విధానపరమైన మార్గదర్శకాలు జారీ చేస్తే వాటిని అమలు చేయడంలో జోన్లు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. భద్రత, ఆపరేషన్స్ వంటి కార్యకలాపాలలో మాత్రం బోర్డు జోక్యం అనివార్యం. కేంద్ర ప్రభుత్వంతో పాటు రైల్వే మంత్రి కూడా సంస్థాగతమైన ప్రాధాన్యతలను నిర్దేశించుకుంటారు. ప్రభుత్వాలు మారినప్పుడు ఈ ప్రాధాన్యతలు పెరుగుతుంటాయి. అయితే ఇవన్నీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేవే అయినప్పటికీ అమలు విషయంలో మాత్రం అలసత్వం కన్పిస్తోంది.

2014కు ముందు రోజువారీ కార్యకలాపాలలో రైల్వే మంత్రి పెద్దగా జోక్యం చేసుకునే వారు కాదు. కానీ ఆ తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. అనుభవం లేని కన్సల్టెంట్లు రైల్వే మంత్రికి సలహాదారులుగా మారారు. అధికారులు ఇచ్చే సలహాలను సైతం పెడచెవిన పెట్టి విధానపరమైన నిర్ణయాలలో జోక్యం చేసుకుంటున్నారు. స్వేచ్ఛగా చర్చించే వాతావరణం కూడా కరువైంది. విధాన నిర్ణయాలన్నీ కేంద్రీకృతమయ్యాయి. ముందుగా బోర్డు స్థాయిలో ప్రారంభమైన జోక్యం ఆ తర్వాత జోన్లు, డివిజన్ల స్థాయికి విస్తరించింది. అధికారులను కించపరచడం, వారి మాటకు విలువ ఇవ్వకపోవడం నిత్యకృత్యమైంది. అధికారులను రైల్వే మంత్రి బహిరంగంగా మందలిస్తుంటే ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు సమీక్షా సమావేశాలలో భద్రతా పరమైన విషయాలకు కేటాయిస్తున్న సమయం బాగా తగ్గిపోతోంది. ఈ విమర్శలు, ఆరోపణలు అవాస్తవమని అనుకున్నా భద్రతకు కేటాయిస్తున్న నిధులు రానురానూ బక్కచిక్కి పోతున్నాయి.

నిధుల కేటాయింపును పెంచాలని రైల్వే శాఖ పదేపదే కోరుతున్నప్పటికీ ప్రభుత్వ గ్రాంట్లు చాలా తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఆ శాఖ రుణ సేకరణ జరుపుతోంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులు చేపట్టాలని సూచిస్తోంది. భద్రత కోసం రైల్వే శాఖ మూడు వేర్వేరు నిధులను నిర్వహిస్తోంది. అయితే వాటికి సరిపడినంతగా కేటాయింపులు జరపకపోవడం తో భద్రత గాలిలో దీపంలా మారింది. భద్రతకు కేటాయింపులు తగ్గించడంతో పాటు కేటాయించిన నిధులను సైతం ప్రాజెక్టుల అమలుకు మళ్లిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భద్రతా చర్యలపై తగినంత దృష్టి కేంద్రీకరించకపోతే రాబోయే రోజులలో మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది.


(ఫైల్)

చంద్రయాన్-3 విజయం యావద్భారతీయులది

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చంద్రుడి దక్షిణ ధృవం మీదకు ఇస్రో పంపించిన 'విక్రమ్'ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అవడం.. యావద్భారతం గర్వించే క్షణమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. దీంతో చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండ్ అయిన తొలి దేశంగా నిలిచిన ఘనత మనకు దక్కుతుందన్నారు. చంద్రయాన్-3 ల్యాండ్ అయిన అద్వితీయమైన ఘట్టాలను.. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఎల్ఈడీ స్క్రీన్‌పై ఆయన వీక్షించారు. అది విజయవంతం కాగానే నినాదాలు చేస్తూ సంబురాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇస్రో, చంద్రయాన్ టీమ్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. ఇస్రో శాస్త్రవేత్తలు భారత అంతరిక్ష ప్రయోగాలను మరింత ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. చంద్రునిపై భవిష్యత్‌లో చేయబోయే ప్రయోగాలకు మన ఇస్రో దిక్సూచిగా నిలుస్తుందన్నారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్‌లోకి కొత్తగా 137 మంది

బీజేపీ స్టేట్ కౌన్సిల్‌లోకి కొత్తగా 137 మందిని నియమిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు సజ్జనార్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చంద్రయాన్-3ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో సందేశం రాసారు."భారతదేశ చరిత్రలో ఇది మరుపురాని రోజు. 140 కోట్ల మంది కలల్ని, ఆశయాల్ని, నమ్మకాన్ని మోసుకెళ్లిన చంద్రయాన్-3 విజయవంతంగా జాబిల్లిపై ల్యాండవడం మనకెంతో గర్వకారణం. ఈ విజయం కోసం నిరంతరం శ్రమించిన ఇస్రో బృందానికి, శాస్త్రవేత్తలకు అభినందనలు. తరతరాలు గుర్తుంచుకునే అద్భుతమైన అంతరిక్ష చరిత్రను లిఖించారు.

హైదరాబాద్‌లో ప్రపంచ దిగ్గజ సంస్థ

గోల్డ్‌మెన్‌సాక్స్ భారీ విస్తరణ

- అదనంగా 2వేల మంది నిపుణులకు ఉద్యోగ అవకాశాలు
- న్యూయార్క్‌లో మంత్రి కేటీఆర్‌తో
- సమావేశం అనంతరం కంపెనీ నిర్ణయం
- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలు బలోపేతం : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చి చేరింది. అంతర్జాతీయ బ్యాంకింగ్, ఫైనాన్స్ దిగ్గజ సంస్థ గోల్డ్‌మెన్‌సాక్స్ తెలంగాణలో తన భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని కంపెనీ కేంద్ర కార్యాలయంలో సంస్థ చైర్మెన్, సీఈవో డేవిడ్ ఎం సోలమన్ బందంతో జరిగిన సమావేశం అనంతరం కంపెనీ ఈ మేరకు బుధవారం తన ప్రకటనను వెలువరించింది. గోల్డ్‌మెన్‌సాక్స్ సంస్థ హైదరాబాద్ నగరంలో తన కార్యకలాపాలను పెద్ద ఎత్తున విస్తరించేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపింది. తన విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న వెయ్యి మందిని మరో రెండు రెట్లు పెంచి రెండు వేల మంది నిపుణులకు అదనంగా ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. ఇందుకోసం సుమారు మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్యాలయాన్ని విస్తరించనుంది. బ్యాంకింగ్ సేవలు, బిజినెస్ అనలిటిక్స్, ఇంజనీరింగ్ వంటి వివిధ రంగాలలో గోల్డ్‌మెన్ సాక్స్ సంస్థ కార్యకలాపాల బలోపేతం కోసం ఈ నూతన కేంద్రం పనిచేయనున్నది. తమ సంస్థ కార్యకలాపాలకు అనుగుణంగా కావాల్సిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగాల్లోనూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న నూతన కార్యాలయం ప్రధానంగా దష్టి సారిస్తుందని గోల్డ్ మెన్ సాచ్ సంస్థ తెలిపింది. హైదరాబాద్ నగరంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల ఎకోసిస్టం బలంగా ఉన్నదని, దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహక పూరిత విధానాలు, హైదరాబాద్ నగరంలో ఉన్న పెట్టుబడుల అనుకూల వాతావరణం వల్ల తమ విస్తరణ ప్రణాళికలను ప్రకటిస్తున్నట్టు సంస్థ చైర్మెన్, సీఈవో డేవిడ్ ఎం సోలోమన్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో తమ నూతన కార్యాలయం, తమ ఇన్నోవేషన్ లక్ష్యాలకు, కార్యకలాపాలకు అనుగుణంగా పనిచేస్తుందని తెలిపారు. 2021 జులై నుంచి హైదరాబాద్ నగరంలో తన కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ, అప్పటి నుంచి వేగంగా తన విస్తరణ ప్రణాళికలకు సంబంధించిన అంశాన్ని పరిశీలిస్తూ వస్తుందన్నారు. పదేండ్లల్లో హైదరాబాద్ నగరం సాధించిన అద్భుతమైన ప్రగతి, ముఖ్యంగా పెట్టుబడుల అంశంలో స్నేహపూర్వక వాతావరణాన్ని దష్టిలో ఉంచుకుని విస్తరించనున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైదరాబాద్ కార్యాలయం సంస్థగతంగా అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్నదని ఆయన ప్రశంసించారు. ఈ విస్తరణతో తమ సంస్థ సిబ్బంది మొత్తం మూడు రెట్లు అవుతుందన్నారు. హైదరాబాద్ నగరాన్ని అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకింగ్ ఫైనాన్స్ సేవల్లో అత్యంత ప్రతిష్ట కలిగిన మాస్ మ్యూచువల్, హెచ్ఎస్‌బీసీ, స్టేట్ స్ట్రీట్, బెర్కాడియా వేల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ వంటి కంపెనీలు హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున తమ కార్యకలాపాలను విస్తరించిన విషయాన్ని గుర్తు చేశారు. గోల్డ్ మెన్ సాక్స్ సంస్థ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడం ద్వారా ఈ రంగంలో హైదరాబాద్ స్థానం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

నాస్కామ్‌లో ఆర్‌అండ్‌డీ సౌకర్యం

రెండు స్టార్టప్‌లు హైదరాబాద్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్(నాస్కామ్)లో తమ ఆర్‌అండ్‌డీ సౌకర్యాలను ఏర్పాటు చేశాయి. బుధవారం నుంచి తమ కార్యకలాపాలను అవి ప్రారంభించాయి.ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంక, నాస్కామ్ ఇండియా సీఇఓ జస్‌ప్రీత్‌సిద్ధు, స్కైరూట్ ఏరోస్పేస్ సీటీఓ డాక్టర్ సీపీఎస్ కిరణ్, హైదరాబాద్ ఐఐటీ మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ జీడీ.జానకిరామ్, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రముఖ సంకలిత తయారీ పరిశ్రమల ప్రతినిధులు లాంచ్‌లో పాల్గొన్నారు.

'దేశంలో స్థానిక పర్యావరణ వ్యవస్థ అభివద్ధిని లక్ష్యంగా చేసుకుని మరిన్ని పరిశ్రమ భాగస్వాములతో మరింత సహకరించడానికి నాస్కామ్ ప్రయత్నాలు చేస్తుంది. యాడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో భారతదేశాన్ని స్వావలంబనగా మార్చాలనే దష్టి ఇంకా ఉంది' అని ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంక అన్నారు.

పక్కదారి పడుతున్న సుంకాలు

- నిబంధనకు మోడీ సర్కార్ పాతర..కాగ్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ఖాతాపై (ఫైనాన్స్ అకౌంట్) కాగ్ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన నివేదిక ఆశ్చర్యకరమైన విషయాలను బయటపెట్టింది. ప్రజల నుంచి వసూలు చేసే ఆరోగ్య, విద్యా సుంకంలో 4 శాతం నిధులను ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా నిధికి జమ చేస్తామని 2018 బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం తెలిపింది. అయితే ఆ హామీని నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని కాగ్ వేలెత్తి చూపింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రజల నుండి సుంకాల రూపంలో వసూలు చేసిన రూ.23,874.85 కోట్ల రూపాయలను రిజర్వ్ ఫండ్‌కు బదిలీ చేయలేదని, దీంతో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా నిధి (పీఎంఎస్ఎస్ఎన్), మాధ్యమిక్ అండ్ ఉచత్తర్ శిక్షా కోశ్ (ఎంయూఎస్‌కే)కు సొమ్ము జమ కాలేదని తెలిపింది. నిర్దిష్ట రిజర్వ్ ఫండ్‌ను ఏర్పాటు చేయనప్పుడు ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును స్థూల బడ్జెటరీ మద్దతుకు ఉపయోగిస్తున్నారని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. 2018-19 నుండి దేశ పౌరులు తమ కర్తవ్యంగా ఆరోగ్య, విద్యా సుంకాలను చెల్లిస్తూనే ఉన్నారు. అయితే ప్రభుత్వం రిజర్వ్ ఫండ్‌ను ఏర్పాటు చేయకుండా ఆ మొత్తాన్ని తన వెసులుబాటును బట్టి కన్సాలిడేటెడ్ ఫండ్‌లోనే ఉంచుతోంది. కేంద్ర ప్రభుత్వం 2017లో ఎంయూఎస్‌కేను, 2021లో పీఎంఎస్ఎస్ఎన్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ రెండూ 2022 మార్చి నుండే అమలులో లేవు. దీనికి కారణం వాటికి సంబంధించిన ఖాతా ప్రక్రియలు ఖరారు కాకపోవడమే. 2021-22లో ఆరోగ్య, విద్యా సుంకం కింద రూ.52,732 కోట్లు వసూలు కాగా అందులో 60% మొత్తాన్ని ప్రాథమిక్ శిక్షా కోశ్‌కు బదిలీ చేశారు. సవరించిన అంచనాల ప్రకారం ఎంయూఎస్‌కేకు రూ.25 వేల కోట్లు, పీఎంఎస్ఎస్ఎన్‌కు రూ.21,499 కోట్లు బదిలీ చేసేందుకు అనుమతించారు. ప్రభుత్వ ఖాతాలలో ప్రత్యేక అకౌంటింగ్ పద్ధులను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోందని, సుంకం వసూళ్లను బదిలీ చేయడం లేదని కాగ్ విమర్శించింది. ప్రభుత్వ వ్యవహారాలలో ఆర్థిక జవాబుదారీతనం, పారదర్శకత అవసరమని నొక్కి చెప్పింది. ఏదేమైనా ప్రజల నుండి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్న ఆరోగ్య విద్యా సుంకాలు ఏమైపోతున్నాయో ఎవరికీ అర్థం కావడం లేదు.

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులకంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాలి

- విలీన కమిటీ చైర్మెన్‌కు టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఆర్టీసీ కార్మికులకు ఎక్కువ జీతాలు ఉండేలా చూడాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్టీసీ విలీన కమిటీ చైర్మెన్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు లేఖ రాసినట్టు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఇప్పటి వరకు ఆర్టీసి కార్మికులు పారిశ్రామిక కార్మికులుగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పని,ఆర్టీసి కార్మికుల పని పరిస్థితులకు పూర్తి తేడా వుంటుందని తెలిపారు.. ఆర్టీసీ కార్మికులకు స్థిరమైన పద్ధతిలో పని దినం వుండదనీ, ఒక రోజు తెల్లవారుఝామున వెళితే, మరో రోజు మరో సమయంలో డ్యూటీకి వెళ్ళవలసి వస్తుందనీ, ఇంటి భోజనం తినడం అనేది దాదాపు అసాధ్యమైన విషయమని వివరించారు. బయట హోటళ్లలోనే భోజనం చేయాలనీ, ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా ధైర్యంగా పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎదుటివారి తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారనీ, తమ ప్రాణానికి ముప్పు ఏర్పడిందని తెలుస్తున్న సందర్భాల్లో ప్రయాణీకులను సురక్షితంగా వుండేలా చూసి, స్టీరింగ్ పైనే తమ ప్రాణాలను విడిచిన ఘటనలు ఉన్నాయన్నారు. కార్మికుల క్రమ శిక్షణ, అంకిత భావానికి ఇవి నిదర్శనాలని వివరించారు. అలాంటి ఆర్టీసీ కార్మికుల వేతనాలు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా వుండాలని సూచించారు. వారికి రావల్సిన 2017, 2021 సంవత్సరాల వేతన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అలాగే అనేక కార్మికోద్యమాల ద్వారా సాధించుకున్న ఇతర అలవెన్సులు, సౌకర్యాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

'పీఎం శ్రీ' రెండోదశకు దరఖాస్తుల ఆహ్వానం

- తుది గడువు 26

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం రెండో దశకు ప్రభుత్వ పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వాటి సమర్పణకు ఈనెల 26 వరకు తుది గడువు ఉందని పేర్కొన్నారు. 2021-22 యూడైస్ గణాంకాల ప్రకారం మొత్తం 4,930 పాఠశాలలను విద్యాశాఖ ఎంపిక చేసింది. వాటిలో 400 నుంచి 500 వరకు రెండో దశలో ఎంపిక చేసే అవకాశమున్నది. అయితే మొదటి దశలో 543 పాఠశాలలను విద్యాశాఖ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ పాఠశాలల అభివృద్ధికి అయ్యే ఖర్చులో మెజార్టీగా కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

అసంతృప్తుల ఐక్యత

ఒక్కటవుతున్న బీఆర్ఎస్ టిక్కెట్ దక్కని నేతల అనుచరులు ఎక్కడికక్కడ సమావేశాలు పెట్టి భవిష్యత్ కార్యాచరణపై చర్చ

అసంతృప్తుల మధ్య ఐక్యత చిగురిస్తోంది. బీఆర్ఎస్ టిక్కెట్ దక్కని నేతల అనుచరులు ఏకమవుతున్నారు. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇచ్చి బీఆర్ఎస్‌నే నమ్ముకున్న నేతలకు మొండిచేయి చూపించడంపై మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ సమావేశాలు ఏర్పాటు చేసి బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేయాలని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి తుమ్మల, వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అనుచరులు రహస్య సమావేశం అయినట్టు తెలుస్తోంది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను బుజ్జగించేందుకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంతనాలు జరుపుతున్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో వేముల వీరేశం అనుచరులు కూడా తిరుగు'బాట'లో ఉన్నారు. టిక్కెట్ రాని నేతల స్పందన ఎలా ఉన్నా వారి అనుచరులు మాత్రం బీఆర్ఎస్ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఎక్కడికక్కడ సమావేశాలు ఏర్పాటు చేసి కేసీఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు



కరీంనగర్ శాసనసభకు పోటీ చేస్తా..

బీఆర్ఎస్‌లో గుర్తింపు, గౌరవం లేదు మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్

వచ్చే శాసనసభ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ తెలిపారు. సుమారు ఆరేండ్లపాటు బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆయన పార్టీకి, పార్టీ ప్రాథ మిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలంటూ ముఖ్య మంత్రి కె.చంద్రశేఖరరావు స్వయంగా ఆహ్వానించడంతో 2018లో కాంగ్రెస్‌ని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటి వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానని చెప్పారు. అయితే పార్టీలో తనకు గుర్తింపు, గౌరవం లేకపోవడం వల్ల అందులో ఇమడలేక రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షించే వారితో త్వరలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. 1981లో కౌన్సిలర్‌గా రాజ కీయ ప్రస్థానం ప్రారంభించిన తాను నీతి, నిజా యితీగా ప్రజాసేవలో కొనసాగుతున్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు.

వచ్చే శాసనసభ ఎన్ని కల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ నుంచి పోటీ చేసే అవ కాశం ఉందని, ఇప్పటికే రెండు పార్టీల నేతలు తనను సంప్రదించారని తెలిపారు.అయితే, తన శ్రేయోభిలాషుల సూచనలకు అను గుణంగానే రాజ కీయ భవిష్యత్తుపై నిర్ణయం ఉంటుందని చెప్పారు.

'తాటికొండ'ను కలిసేందుకు పల్లా ప్రయత్నం



స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు ముందు నుంచి రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గాడ్‌ఫాదర్‌గా వ్యవహరించారు. ఈసారి మాత్రం 'తాటికొండ'కు 'పల్లా' టికెట్ ఇప్పించలేకపోయారు. దీంతో ఎమ్మెల్యే రాజయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. రాజయ్యను ఓదార్చడానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తు న్నారు. బుధవారం 'తాటికొండ' అందుబాటులోకి రాకపోవడంతో 'పల్లా' ఎమ్మెల్యే అనచరులతో చర్చలు జరిపారు. త్వరలోనే సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే రాజయ్యతోపాటు కలవనున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు. 'పల్లా' తన ఇంటికి వచ్చినట్లు సమాచారం తెలిసినా, ఆయన్ను కలవడానికి 'తాటికొండ' నిరాకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

'నల్లగొండ' బీఆర్ఎస్‌లో అసంతృప్తి జ్వాలలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని కొన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తి తారాస్థాయిలో కొనసాగుతోంది. టికెట్ మాకు ఇవ్వకున్నా పర్లేదు కానీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇవొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కోదాడ, నల్లగొండ, నాగార్జునసాగర్, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల వ్యవహారమే ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. కోదాడ టికెట్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సీరియస్ అయ్యారు. కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డితోపాటు డీసీసీబీ చైర్మెన్ ముత్తవరపు పాండురంగారావు తదితరులంతా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేస్తూ వచ్చారు.

ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామని వేనేపల్లి చందర్‌రావు శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకట రత్నంబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ అన్నారు. కోదాడ పట్టణంలోని పెరిక భవన్‌లో నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కు టికెట్ ఇవ్వడాన్ని అక్కడి నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గ టికెట్ ఆశించిన యాదవ సామాజిక తరగతికి చెందిన కట్టెబోయిన అనిల్‌కుమార్, గురువయ్యయాదవ్, మన్నెం రంజిత్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అధిష్టానం మానసు మార్చుకుని వీరిలో ఎవరికి టికెట్ దక్కినా.. మిగిలిన వారంతా కలిసి పనిచేయాలని, లేనిపక్షంలో ఇతర పార్టీల్లోకి జంప్ చేస్తే ఎలా ఉంటుందనే అంశాలపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. నకిరేకల్ నియోజకవర్గ టికెట్‌ను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

బుధవారం నకిరేకల్‌లో పెద్దఎత్తున అనుచరులు, సన్నిహితులతో సమావేశమ య్యారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజకీయ భవిష్యత్‌పై వారం రోజుల తర్వాత చెబుతామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని నేతలు బహిరంగంగానే సభలు, సమావేశాలు పెడుతున్నారు. ఇప్పటికే ఆయనకు టికెట్ కేటాయించొద్దంటూ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి విన్నవించారు. అధిష్టానం రవీంద్రకుమార్‌కు టికెట్ కేటాయించినప్పటి నుంచి నియోజకవర్గంలో అసంతృప్తి స్వరం మరింత పెరిగింది.ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటం.. వారిపై భూకబ్జాలు, అవినీతి ఆరోపణలు రావడంతో టికెట్ తమకే దక్కుతుందని పలువురు నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు.

కానీ ఎవరూ ఊహించని విధంగా బీఆర్ఎస్ అధిష్టానం సిట్టింగ్‌లకే టికెట్లు ఇవ్వడంతో షాక్ తిన్నారు. అయితే ఆయా నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు లీడర్లు టికెట్ ఆశించారు. కానీ టికెట్ సిట్టింగ్‌కే దక్కడంతో ఇన్నాళ్లూ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేసిన అసంతృప్తులంతా ఏకమయ్యారు.

మాజీ మంత్రి తుమ్మలతో ఎంపీలు, ఎమ్మెల్యేలు భేటీ

అనారోగ్యంతో ఉన్నందుకే కలిశామంటున్న బీఆర్ఎస్ నేతలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టిక్కెట్ దక్కని నేతల అనుచరులు ఏకమవుతున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం బీఆర్ఎస్ టిక్కెట్‌పై ఆశలతో ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాదని ప్రస్తుత ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంపై తుమ్మల అనుచరులు బీఆర్ఎస్ అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు వైరా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన ప్రస్తుత ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కాదని గత ఎన్నికల్లో ఈయన చేతిలో ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు టిక్కెట్ ఇవ్వడం కూడా వివాదానికి దారితీసింది. దాంతో తుమ్మల, రాములునాయక్ అనుచరులు వైరాలోని ఓ రహస్య ప్రదేశంలో సమావేశం అయ్యారు. వైరాలో తుమ్మల అనుచరులు గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆ తర్వాత మాజీ మంత్రిని కలిసేందుకు హైదరాబాద్ వెళ్లనున్నట్టు సమాచారం. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఉండటంతో ఆయన్ను పలువురు వెళ్లి పరామర్శించి వస్తున్నారు. పనిలో పనిగా బీఆర్ఎస్ నేతలు సైతం వెళ్లి వస్తున్నారు. కానీ వీటిపై స్పందించేందుకు తుమ్మల సుముఖంగా లేరని ఆయన ప్రధాన అనుచరులు చెబుతున్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ మంగళవారం రాత్రి తుమ్మలను పరామర్శించారు.ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావుతో పాటు మిర్యాలగూడెం ఎమ్మెల్యే భాస్కర్‌రావు వెళ్లి తుమ్మలను పరామర్శించారు. ఈ భేటీలకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని సమాచారం. కేవలం అనారోగ్యంతో ఉన్న మాజీ మంత్రిని పరామర్శించేందుకే నేతలు వచ్చినట్టు తుమ్మల ప్రధాన అనుచరులు చెబుతున్నారు. వెళ్తూ వెళ్తూ నామ నాగేశ్వరరావు తమను కేసీఆర్ పంపించలేదని మరీ స్పష్టత ఇచ్చారు. ఈ విషయాల పైనేకాక, భవిష్యత్ కార్యాచరణపై అనుచరుల సమావేశాలపైనా ఆయన నుంచి ఎలాంటి స్పందనా లేదు. జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి తమనేత తదుపరి నిర్ణయం ఉంటుందని తుమ్మల వర్గీయుల మాట. బీఆర్ఎస్‌పై తిరుగుబాటు తప్పదని సైతం వారు హెచ్చరిస్తున్నారు.

ఉపాధ్యాయుడి దారుణ హత్య

- కలప వ్యాపారంలో శత్రువుల పనేనా..?



నవతెలంగాణ-కూసుమంచి

ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురైన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెం శివారులో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయకన్ గూడెం గ్రామానికి చెందిన బైరోజు వెంకటాచారి (58) నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో పీఈటీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా రోజు మాదిరిగానే బుధవారమూ బైక్‌పై పాఠశాలకు బయలుదేరారు. మార్గమధ్యలో మాటు వేసిన హంతకులు కారు, బైక్‌లపై ఆయన్ని వెంబడించారు. మండలంలోని మందడి నరసయ్య గూడెం గ్రామ శివారు ప్రాంతాల్లో ఉపాధ్యాయుడి బండిని కారుతో వెనుక నుండి ఢీకొట్టారు. దాంతో కింద పడిన ఉపాధ్యాయుడ్ని అత్యంత దారుణంగా గొడ్డలితో మెడపై నరికారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కంది జితేందర్ రెడ్డి, ఎస్ఐ రమేష్ కుమార్ హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. వివరాలు మాత్రం వెల్లడించలేదు. హత్యకు ముందు గ్రామంలోని ఓ బెల్ట్‌షాపులో హంతకులు మద్యం తాగినట్టు, అక్కడి నుంచి ప్లాన్ వేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా, మృతుడు వెంకటాచారి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం రాక ముందు.. సొంతగా కలప వ్యాపారం (టింబర్ డిపో) చేసేవారు. ఇప్పటికీ వ్యాపారం కొనసాగిస్తూనే ఉండగా, కొన్నేండ్లుగా ఆయనకి కలప వ్యాపారం చేస్తున్నవారితో గొడవలు ఉన్నట్టు సమాచారం. ఆ గొడవలే ఈ హత్యకు దారితీసిందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో ముందుకెళ్తాం

- ప్రజల మధ్య చిచ్చు పెట్టే మతోన్మాద బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనీయొద్దు
- కమ్యూనిస్టుల మద్దతు లేకుంటే మునుగోడులో బీఆర్ఎస్ గెలిచేదా? : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజల మధ్య చిచ్చు పెట్టే మతోన్మాద బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనీయబోమని, దానికోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో ముందుకెళ్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య స్పష్టంచేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీని గద్దె దింపడమే తమ లక్ష్యమన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో మేం దీనికి కట్టుబడే బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామని, కమ్యూనిస్టుల మద్దతు లేకుంటే మునుగోడులో బీఆర్ఎస్ గెలిచేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ బీజేపీని వ్యతిరేకిస్తున్నామని ప్రకటించడంతోనే కలిసి నడవాలని భావించామని, స్వయంగా సీఎం కేసీఆరే అనేక వేదికలపై కలిసే నడుస్తామని చెప్పారని గుర్తుచేశారు.

ఇప్పుడు బీఆర్ఎస్ వైఖరిలో ఎందుకు మార్పు వచ్చిందో, వామపక్షాలతో పొత్తు ఎందుకు వద్దనుకున్నారో కేసీఆర్.. ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో రానున్న కాలంలో తమదే అధికారమని విర్రవీగిన బీజేపీని నిలువరించింది ఎర్రజెండానే అని తెలిపారు. ఒకవేళ మునుగోడులో బీజేపీ గెలిస్తే రాష్ట్రంలో నేడు రాజకీయ వాతావరణం మరోలా ఉండేదన్నారు. మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీపై నిత్యపోరు కొనసాగిస్తూ వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో ముందుకెళతామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది ఎర్రజెండానే అన్నారు.

సమావేశంలో జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్,కె.రాజయ్య, ఎ.మాణిక్, బి.రాంచందర్, ఎన్.నర్సింహారెడ్డి, జి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- పారితోషికాలూ పెంచాలి
- ఆశా వర్కర్ల డిమాండ్.. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా

నవతెలంగాణ- విలేకరులు

పారితోషికాలను పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరుతూ బుధవారం ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తమ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లు కరోనా మహమ్మారి కాలంలో వైరస్‌ను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. అయితే, ఆశాలకు కేవలం రూ.9,750 పారితోషికం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. వారి పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని, పారితోషికాలను రూ.18,000కు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు టి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎం.అనిత పాల్గొన్నారు. ములుగు జిల్లాలో డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముట్టడి చేపట్టి ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క మద్దతు తెలిపారు. పారితోషికాలను పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ఆదిలాబాద్, నిర్మల్‌లో ఆశాలు ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్‌లో సీఐటీయు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నిర్మల్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు ఆశాలు ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఎంహెచ్ఓ ఆఫీస్ వరకు ప్రదర్శనగా వచ్చి డీఎంహెచ్ఓ కొండలరావుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రదర్శన అనంతరం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.మహేశ్వరి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18000, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- సమ్మెకు మద్దతు

నవ తెలంగాణ -సుల్తాన్ బజార్

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంల సమ్మె కొనసాగుతోంది. బుధవారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ఆధ్వర్యంలో బుధవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆవరణలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమ్మెకు సీపీఐ(ఎం) తరఫున మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గతంలో అనేక సభల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలోనే వైద్య ఆరోగ్యశాఖ నెంబర్ వన్‌గా ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పుడు.. అందులో ఏఎన్ఎంల భాగస్వామ్యం కూడా ఉందన్నారు. కరోనా సమయంలో ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆ సమయంలో కరోనాతో కొంతమంది ఏఎన్ఎంలు ప్రాణం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సేవలను గుర్తించి సీఎం కేసీఆర్ ఇప్పటికైనా యూనియన్ ప్రతినిధులను పిలిచి చర్చలు జరపాలని కోరారు. 20 ఏండ్లుగా వైద్య శాఖలో సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ మధ్యనే కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారని చెప్పారు. ఏఎన్ఎంలను ఎలాంటి రాత పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బలరాం, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జె.కుమారస్వామి, ఏఎన్ఎంలు కిరణ్మయి, రాజేశ్వరి, రమాదేవి, నీలిమ, స్వాతి, సంగీత, వివిధ జిల్లాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో సెకండ్ ఏఎన్ఎంలు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్యే సీతక్క పాల్గొని సంఘీభావం తెలిపారు. వరంగల్ జిల్లాలో మోకాళ్ళపై నిలబడ్డారు.రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని భద్రాచలం పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య శాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను భేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో కలెక్టరేట్ ఎదుట ఆందోళన కొనసాగింది. మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు.



మేడారంలో ఘనంగా పొట్ట పండుగ

నవతెలంగాణ- తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో బుధవారం సమ్మక్క పూజారులు పొట్ట పండుగ ఘనంగా నిర్వహించారు. మాఘ కార్తె సందర్భంగా మేడారం సమ్మక్క గుడి శుద్ధి చేసి పసుపు కుంకుమలతో అలంకరించారు. సమ్మక్క సారలమ్మ గద్దెలను అలికి ముగ్గులు వేసి పూజలు చేశారు. బుధవారం రాత్రి సమ్మక్క గుడిలో పొట్ట పండుగ పూజలు నిర్వహించి రాత్రంతా వనదేవత గద్దెల వద్ద పూజారులు డోలు వాయిద్యాలతో సంబరాలతో, జాగారాలు నిర్వహించారు. అనంతరం పొట్టకు వచ్చిన కూరగాయలు, ఈ సీజన్‌లో కాసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, మొక్కజొన్న కంకులు, ఆకుకూరలు నైవేద్యంగా సమర్పించారు. పొట్ట పండగ నాడు వనదేవతలకు మొదటి పంట సమర్పించనిదే ఏ కాయగూర, పండ్లను ముట్టబోమని పొట్ట దశలో ఉన్న పంటలను అమ్మవార్లకు సమర్పించడం సంప్రదాయమని ఆదివాసీ గిరిజనులు తెలిపారు. అన్నీ సమర్పించి పంటలు బాగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. పొట్ట పండుగతో మేడారంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు కొక్కెర కృష్ణయ్య, మునేందర్, మహేష్, అరుణ్, సిద్ధబోయిన స్వామి, బోజారావు, పాపారావు, మల్లెల ముత్తయ్య దీప దూప నైవేద్య పూజారి దోబె నాగేశ్వరరావు, సందీప్ తదితర పూజారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'రెరా' నిబంధనలు పాటించాలి

- లేకుంటే చర్యలు తప్పవు
- ఆ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ హెచ్చరిక
- పలు సంస్థలకు నోటీసులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బిల్డర్లు తప్పనిసరిగా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలు పాటించాలనీ, లేనిపక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ, కార్యదర్శి బాలకృష్ణ హెచ్చరించారు. అనేక సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి, చట్టవ్యతిరేకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందనీ, వాటిలో కొన్ని సంస్థలకు తక్షణం నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. సదరు సంస్థల యజమానులు 15 రోజుల్లోగా షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వాలని చెప్పారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, యూడీఏ, స్థానిక సంస్థలు, 'టీఎస్ రెరా' అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు ప్రీలాంచింగ్ కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. ఎనిమిది (8) అంతకుమించి ప్లాట్లు, నిర్మాణాలు, 500 చదరపు మీటర్లకు మించిన స్థలంలో చేపట్టే నిర్మాణాలకు 'రెరా' చట్టం వర్తిస్తుందని వివరించారు. సామాన్యుల కష్టార్జితానికి 'రెరా' భద్రతనిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించి 70 శాతం నిధులను ఆ ఖాతాలోనే ఉంచి, దానికోసమే ఖర్చు చేయాలనీ, ఒక ప్రాజెక్టు నిధులు మరో ప్రాజెక్టుకు మళ్ళించరాదని చెప్పారు. అలాంటి ప్రాజెక్టు కోసం నిధులు డ్రా చేసి వినియోగించడానికి సంబంధిత సివిల్ ఇంజనీర్, ఆర్కిటెక్ట్, చార్టెడ్ అకౌంటెంట్ ధ్రువీకరణ తప్పనిసరి అనీ, ప్రతి మూడు నెలలకు ఓసారి భవన నిర్మాణ వివరాలు, నిధుల వినియోగం, బుకింగ్స్ సహా ఇతర వివరాలన్నింటినీ విధిగా 'రెరా'కు సమర్పించాలన్నారు. తప్పుడు హామీలు ఇవ్వడం, ప్లాట్లు, ఇండ్లు, ఇతర భవనాలు బుక్ చేసుకున్న తర్వాత మాట మార్చటం, అనుమతించిన లేఔట్లలో ప్లాన్లు మార్చి నిర్మాణాలు చేపట్టడం 'రెరా' చట్టం ప్రకారం నేరాలని స్పష్టం చేశారు. మొత్తం ప్రాజెక్ట్ బుకింగ్స్‌లో మూడింట రెండు వంతుల కొనుగోలుదారుల ఆమోదంతో పాటు 'రెరా' రిజిస్ట్రేషన్ తర్వాతే మార్పులకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. కొనుగోలుదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మధ్య 'రెరా' వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేసే ఏజెంట్లు కూడా విధిగా 'రెరా'లో రిజిస్టర్ కావాలనీ, ప్రజలు అన్ని అనుమతులు పరిశీలించుకొనే ఆయా ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. అందమైన బ్రోచర్లు, ఏజెంట్ల మాటలు విని అనుమతులు లేని చోట్ల స్థలాలు, ఇండ్లు కొని మోసపోవద్దని హెచ్చరించారు.

'రెరా' ఉల్లంఘన సంస్థలు ఇవే..

1. రాధే గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థ ఎలాంటి 'రెరా' రిజిస్ట్రేషన్ పొందకుండా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని ఉస్మాన్ నగర్‌లో రాధే పనోరమా అనే ప్రాజెక్టును ప్రీ లాంచింగ్ పేరుతో అమ్మకానికి పెట్టింది. ఈ సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.
2. ఓం శ్రీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ ఓం శ్రీ సిగ్నెట్ పేరుతో ప్రాజెక్టు చేపట్టి 'రెరా' నుంచి ఏ,బీ,సీ,డీ బ్లాకులకు మాత్రమే రిజిస్ట్రేషన్ అనుమతి తీసుకుంది. కానీ ఎలాంటి అనుమతి లేకుండా 'ఈ' బ్లాక్ నిర్మాణం చేపట్టింది. దీనికీ షోకాజ్ నోటీసు జారీ చేశారు.
3. భువన తేజ ఇన్ఫ్రా ప్రాజెక్టు యాజమాన్యం తక్కువ రేట్లకే ప్లాట్లు అంటూ ప్రీలాంచ్ విక్రయాలు హైదరాబాదులోనే కాకుండా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ప్రీ లాంచ్ ఇవెంట్స్ నిర్వహిస్తూ అక్రమంగా అమ్మకాలు చేస్తోంది. దీనికీ షోకాజ్ నోటీసు ఇచ్చారు.
4. టీఎమ్ఆర్ నిర్మాణ సంస్థ 'రెరా' రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ నెంబర్ ప్రదర్శించకుండ కరపత్రాలు బ్రోచర్‌ల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడుతోంది. దీనికీ షోకాజ్ నోటీస్ జారీ చేశారు.
5. సువర్ణ భూమి ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ 'లేక్ వ్యూ' పేరుతో 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు సమీపంలోని ఎల్లాపూర్‌లో ప్లాట్లు విక్రయిస్తున్నది. దీనికి సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చారు. వీరంతా 15 రోజుల్లోగా తమ సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

'చేతి'కే వెన్నుపోటు పొడిచిన వనమా..

- ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకోవాలి
- బీసీ అభ్యర్థికి టికెట్ ఖాయం : జన చైతన్య సభలో మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి

నవతెలంగాణ-కొత్తగూడెం

అన్నం పెట్టిన 'చేతి'కే స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వెన్నుపోటు పొడిచారని, ఆయన కుటుంబం చేసిన దుర్మార్గానికి ఓ అమాయక కుటుంబం దారుణంగా బలైందని కాంగ్రెస్ నాయకులు, మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా ఆ అభ్యర్థిని గెలిపించుకోవాలని, బీసీ అభ్యర్థికే టికెట్ ఖాయమని చెప్పారు. బుధవారం కొత్తగూడెం పట్టణానికి ఆమెకు.. కాంగ్రెస్ అభిమానులు, ప్రజా ప్రతినిధులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం సూపర్ బజార్, రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా బస్టాండ్ సెంటర్ వద్దకు ర్యాలీగా వచ్చి.. అక్కడున్న అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అక్కడినుంచి ర్యాలీగా కొత్తగూడెం క్లబ్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన జన చైతన్య సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. యాభై ఏండ్ల రాజకీయ జీవితం అని చెప్పుకుంటున్న వనమా వెంకటేశ్వరరావుకి కాంగ్రెస్ పార్టీ రాజకీయ భవిష్యత్తు ఇచ్చిందని, కానీ అన్నం పెట్టిన చేతికే వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వనమా వెంకటేశ్వరరావు కుమారుడు చేసిన దుర్మార్గానికి ఒక కుటుంబం మూకుమ్మడిగా బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే ఎమ్మెల్యే ఇంటికి ధైర్యంగా వెళ్లగలరా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసరాల ధరలు పెరిగాయని, పేద ప్రజలకు చౌక దుకాణాల ద్వారా అందించే సరుకులు ఎత్తివేశారని విమర్శించారు.


సంపాదకీయం

ధరల మంట

నిన్న మొన్నటి వరకు టమాటాలు నింగినెక్కి కూర్చున్నాయి. ఇప్పుడు ఉల్లి తన ఘాటును మరింత పెంచింది. ఒక్క టమాటా, ఉల్లిగడ్డనే కాదు కూరగాయలు, పప్పులు, నూనెలు ఇలా అన్నింటి ధరలు చుక్కల్లో చేరి ఫక్కుమంటున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో ప్రజలు సతమతమవుతున్నారు. పేదలు ఖాళీ కడుపులతో మాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని స్వయానా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన నెలవారి రిపోర్ట్‌లో చెప్పింది. దాంతో సామన్యుల్లో మరింత ఆందోళన పెరిగింది.

> భారతదేశంలో 22శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. అంటే రోజుకు 32 రూపాయల ఆదాయం కూడా వారికి లేదని ఆర్థిక వేత్తల గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దేశంలో 40కోట్ల మంది నిత్యావసర సరుకులు కొనలేని స్థితిలో ఉన్నారు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల ఆదాయానికి అనుగుణంగా ధరలను ఎప్పటికప్పుడు నియంత్రించడానికి కేంద్ర క్యాబినెట్ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టాలి.

దేశీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితి కారణంగా రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగే అవకాశం ఉందని, దాని ఫలితంగానే ధరలు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సెలవిచ్చింది. అయితే ఈ పెరుగుదల తాత్కాలికమేనని, ప్రభుత్వం చేపట్టబోతున్న చర్యలు, రాబోయే తాజా పంటలతో ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని ప్రజలకు ధైర్యం చెబుతున్నది. కానీ గతకొన్ని ఏండ్లుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి తప్ప తగ్గింది లేదు. కేవలం రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రం ధరలపై ఈ సన్నాయి నొక్కులు నొక్కుతోంది.



ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసరాల ధరలతో ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందేమోనని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అందుకే మొన్నటి వరకు టమాటా ధరల మంటలకు భయపడిన మోడీ ఇప్పుడు ఉల్లి ఘాటుకు మరింత బెంబేలెత్తిపోతున్నాడు. ధరలు నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామనీ, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తామని అంటున్నారు. ఉల్లి ఎగుమతులపై 40శాతం పన్ను విధించడంతో పాటు సబ్సిడీ రేటుతో స్థానిక మార్కెట్లలో ఉల్లిని విక్రయించి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టబోతున్నారు.


అయితే దేశంలో ఈ తొమ్మిదేండ్ల కాలంలో పెరిగినంతగా ధరలు అంతకు ముందు ఎన్నడూ పెరగలేదు. ఉప్పులు, పప్పులతో పాటు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కొనసాగుతూనే ఉంది. ఈ భారం భరించలేక సామాన్యులు కన్నీళ్ళతో కాపురం చేస్తున్నారు. ఇన్నేండ్లు ధరలపై నోరు మెదపని పాలకులు ఇప్పుడు చర్యలు చేపట్టేందుకు హడావుడిగా సిద్ధమయ్యారు. అయితే ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని ఎవ్వరూ తప్పుపట్టరు. కానీ ఇదంతా ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న తాత్కాలిక చర్యలని స్పష్టంగా తెలిసిపోతున్నది. పెరిగిన ధరల ప్రభావం పాలక పార్టీలపై పడిన సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నాయి. ప్రజాగ్రహానికి గురైన పాలకులు ఎన్నికల్లో పరాజయం చవిచూసిన ఉదంతాలూ ఉన్నాయి. ఆ కంగారు ఇప్పుడు మోడీలో స్పష్టంగా కనబడుతున్నది.

నిజానికి మన పాలకులు కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టపెట్టడానికి నిత్యావసరాల ధరలు పెంచుతున్నారు. ధరలు పెరిగితేనే కార్పొరేట్లకు లాభాలు వస్తాయి. 5శాతం జీతాలు పెంచితే 10శాతం ధరలు పెంచుతున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థలకు మన దేశంలో 22 నుండి 25శాతం మాత్రమే సంపద పన్ను వేస్తున్నారు. అదే అమెరికా, జర్మనీ, జపాన్‌తో పాటు మిగిలిన దేశాల్లో సంపదపై 35శాతం పన్ను ఉంటుంది. అంటే మన దగ్గర సంపన్నుల ఆస్తులపై వేస్తున్న పన్ను మిగిలిన దేశాలతో పోలిస్తే 10శాతం తక్కువ. ఇదే సమయంలో నిత్యావసరాలపై వేసిన పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఈ ఏడాది ఆదాయం బాగా పెరిగింది. గతంలో నాలుగైదు శాతం మాత్రమే ఉండే ద్రవ్యోల్బణం ఇప్పుడు ఏకంగా రెండంకెలకు చేరుకుంది. ఇదే ధరల పెరుగుదలకు కారణం. అంటే మన పాలకులు పేదల కడుపు కాల్చి కార్పొరేట్లకు ఎంతగా దోచిపెడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఈ ధరల పెరుగుదల మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఒక కార్పొరేట్ అనుకూల విధానమే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ రోజు భారతదేశంలో 22శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. అంటే రోజుకు 32 రూపాయల ఆదాయం కూడా వారికి లేదని ఆర్థిక వేత్తల గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దేశంలో 40కోట్ల మంది నిత్యావసర సరుకులు కొనలేని స్థితిలో ఉన్నారు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల ఆదాయానికి అనుగుణంగా ధరలను ఎప్పటికప్పుడు నియంత్రించడానికి కేంద్ర క్యాబినెట్ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టాలి. ఉల్లి ధరలు నియంత్రించేందుకు ఎగుమతి టాక్స్ పెంచాము అంటున్నారు. అలాగే స్థానిక మార్కెట్ల ద్వారా సబ్సిడీకి ఉల్లి గడ్డలు ఇస్తామంటున్నారు. ఇలాంటి చర్యలు సరిపోవు. కేరళ రాష్ట్రం మాదిరిగా అన్ని రాష్ట్రాల్లో చౌక డిపోల ద్వారా ప్రజలకు అన్ని రకాల నిత్యావసరాలు అందించేలా కేంద్రం చర్యలు చేపట్టాలి.

అక్షరమే ఆయన ఆయుధం

ఆయన గొప్ప రచయిత, బహుభాషా కోవిదుడు. నిరంతరం పుస్తకాలతోనే గడిపేవారు. ముక్కు సూటిగా స్పష్టంగా మాట్లాడేవారు. తెలంగాణ పోరాటాన్ని కళ్ళారా చూసిన సాహితీ యోధుడు. ఆయనే డాక్టర్ దాశరథి రంగాచార్య. ఈ పేరు ప్రజలందరికీ సుపరిచితమే. ఇక్కడి ప్రజల జీవన పోరాటాన్ని, అస్తిత్వాన్ని తన రచనల ద్వారా ప్రతిఫలింపజేశాడు. 1928 ఆగస్ట్ 24న దాశరథి వెంకటాచార్యులు-వెంకటమ్మ దంపతులకు మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 12ఏళ్ల వయస్సులోనే నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ్ పోరాటాలకు ఆకర్శితులై వాటి తరపున ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం కూడా గడిపారు. వీరి అన్న దాశరథి కృష్ణమాచార్యుల నుంచి అభ్యుదయ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి సైనికులుగా పనిచేశారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి అభినవవ్యాసునిగా పేరుగాంచారు. "చిక్కుల్లోనే మనిషి ఎదుగుతాడు... ఆపదల్లోనే ఉన్నతుడవు తాడు... మనిషైనా జాతైనా అంతే..." అన్న డాక్టర్ దాశరథి రంగాచార్య తెలంగాణ రైతాంగ పోరాటం ఆయుధాలను చేతబూనడం వలన వారు పోలీసు యాక్షన్ తర్వాత బయటికి వచ్చారు.



రంగాచార్య మొత్తం తొమ్మిది నవలలు రాశారు. "చిల్లర దేవుళ్లు", మోదుగుపూలు", "మాయజలతారు", "జనపదం", "రానున్నది ఏది నిజం", "మానవత", "శరతల్పం", "పావని", "అమృతంగమయ". తెలంగాణ గురించి రాయబడిన దాశరథి రంగాచార్య తొలి నవల "చిల్లర దేవుళ్లు". ఐదువారాల్లోనే పూర్తి చేశారు. అక్షరమే ఆయన ఆయుధం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటం, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన అభ్యుదయవాది, తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన వీరుడు. సాహిత్య సాగరంలో ఆయన ఉరికే కెరటం. తన రచనలతో సమాజాన్ని చైతన్యం చేసిన అక్షర వాచస్పతి. వేదం జీవన నాదం అంటూ వేదాలను ప్రజాజీవితంలోకి తెచ్చి వచన రూపంలో అందించిన సాహితీ పిపాసి. నవ సమాజం కోసం తాపత్రయపడిన ఉద్యమశీలి. ప్రజా ఉద్యమంలో వేద భారతాన్ని అన్వేషించిన అక్షర తపస్వి. ఆయన శ్వాస, ధ్యాస అంతా మానవ శ్రేయస్సు గురించే. సమసమాజ ఆవిష్కరణ గురించే. సద్గుణ సంపన్ను డైన సద్గుణ మానవున్ని దర్శించాలన్నదే ఆయన మహా సంకల్పం. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్‌కు ముచ్చె మటలు పట్టించారు రంగాచార్య. తెలంగాణ మట్టి జీవితాన్ని, వెట్టి జీవితాన్ని అక్షరాల్లోకి ఎలుగెత్తిచాటాడు. తన రచనలతో పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారు.

1948లో పోలీస్ చర్య తర్వాత హైదరాబాద్‌కు విముక్తి లభించింది. సాయుధ పోరాటం విరమణ తర్వాత 1951లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి 1957లో అనువాదకులుగా సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో 32ఏళ్లు ఉద్యోగం చేసి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో రిటైరయ్యారు. తన 40ఏండ్ల జీవితంలో అక్షర ప్రస్థానం ప్రారంభించి ఎన్నో నవలలు, గ్రంథాలు రాశారు. శ్రీమద్రామాయణం, మహా భారతాలను సరళంగా తెలుగులో రాశారు రంగాచార్య. తన ఆత్మకథగా వచ్చిన జీవనయానం కూడా తెలంగాణ ఉద్యమం, ప్రజల జీవన స్థితిగతులను చాటి చెబుతోంది. వేదవ్మాయాన్ని ప్రజలందరికి చేర్చడానికి అభ్యుదయ దృక్పథమే తనను పురిగొల్పిందని ఆయన చెప్పుకున్నారు. వేదాలను స్త్రీలు, శూద్రులు చదవకూడదనే దృక్పథాన్ని ఆయన తోసిపుచ్చారు. దాశరథి రంగాచార్య జీవన యానం చదివితే మొత్తం ఆయన్ను చదివినట్టే. తెలంగాణ సమాజాన్ని అన్ని కోణాలలో సమగ్రంగా చదివినట్టు, ఒడ్డున కూర్చుని పుంఖాను పుంఖాలుగా రచనలు చేసిన వారికి పూర్తి భిన్నంగా, తెలంగాణ కవుల సంప్రదాయానికి అనుగుణంగా స్వయంగా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొని ప్రజలపక్షం నిలిచారు. తన నెత్తిపై నుంచి తుపాకి గుండు దూసుకుపోయినా చలించని ధీశాలి రంగాచార్య.

రంగాచార్య రచించిన చిల్లర దేవుళ్లు పలు భాషల్లోకి అనువాదమైంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా వచ్చింది. 'అభినవవ్యాసుడిగా' బిరుదు అందుకున్న రంగాచార్య 2015 జూన్ 8న కన్నుమూశారు.ఆయన స్మరణార్థం మహబూబాబాద్ జిల్లాకు దాశరథి జిల్లాగా పేరు పెట్టాలనే డిమాండ్ ఉన్నది. ఆయన కాంస్య విగ్రహాన్ని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక. జయంతిని అధికారికంగా జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

(నేడు దాశరథి రంగాచార్య జయంతి)

- కామిడి సతీష్ రెడ్డి, 9848445134

అమలుకు నోచని పథకాలు - అభివృద్ధికి తిలోదకాలు



సారంపల్లి మల్లారెడ్డి

ఆగస్టు 15, 2023న ఎర్రకోటపై మన ప్రధాని నరేంద్రమోడీ పదోసారి జెండా ఆవిష్కరిస్తూ వేయి సంవత్సరా లకు గుర్తుండే ప్రణాళికలు, పథకాలు అమలు చేశామని ప్రకటించారు. 2024 ఎన్నికల్లో గెలిచి ఎర్రకోటపై తానే జెండా ఆవిష్కరిస్తానని చెప్పుకొచ్చారు. ప్రయివేటీకరించిన ఎర్రకోటలో ఆగస్టు ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు కిరాయి చెల్లించింది. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్న మోడీ ప్రభుత్వం దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపానని, 2025 నాటికి మూడవ ఆర్థిక వ్యవస్థగా ఐదు ట్రిలియన్ డాలర్లకు పెంపుదల చేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం 3.72 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థలో ఉన్నాం. కరోనా నుండి దేశంలో పరిశ్రమలు, సేవారంగంలో కోట్ల ఉద్యోగాలు తగ్గి పోయాయి. ప్రపంచంలోని 195 దేశాలలో భారతదేశం అవినీతిలో 85వ స్థానంలో, సామాజిక పురోగతిలో 127వ స్థానం నిలిచింది. సులభతర వాణిజ్యంలో 63వ స్థానం, ప్రపంచ ఆవిష్కరణలలో 40వ స్థానం, మానవ అభివృద్ధి సూచికలో 132వ స్థానంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ ప్రకటించింది.

సంస్కరణల అమలుతో రైతుల ఆత్మహత్యలు

16 మే 2014లో అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం గడిచిన తొమ్మిది సంవత్సరాలలో 84పథకాలను ప్రకటించింది. వీటిని ప్రారంభించడమే తప్ప ఏ ఒక్క పథకం సమగ్రంగా అమలుకు పూనుకోలేదు. పట్టణ, గ్రామీణ ప్రజలకు ఆదాయాల పెంపు, బీమా సౌకర్యంతో పాటు ఉపాధి అవకాశాలు ఈ పథకాల ముఖ్య ఉద్దేశం. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి నిటిఅయోగ్ ఏర్పాటు ద్వారా దేశ అభివృద్ధికి ఆటంకం కల్పించారు. గత ప్రభుత్వాలు 1951 నుండి 2012 వరకు 12 ప్రణాళికా బోర్డులను ఏర్పాటు చేసి రూ.20లక్షల కోట్లు వ్యయం చేసి పరిశ్రమల స్థాపన, వ్యవసాయంలో స్వయం సమృద్ధి కల్పించారు. ఆహార ధాన్యాలను ఎగుమతులు చేసి ప్రపంచంలో అగ్రదేశాల సరసన నిలిపారు. ఎగుమతులు పెరుగు తుండటం గమనించిన జీ7 దేశాలు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధిని నిలవరించడానికి సంస్కరణలను అమలు చేస్తున్నారు. ఈ సంస్కరణల వలన దేశాభివృద్ధి నిలిచిపోవడమేకాక ఏటా12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతుకుటుంబాలకు తీరని వేదన. వ్యవసాయ రంగంలో పరిశోధనలు, మార్కెటింగ్ వ్యవస్థతో పాటు భూముల సేకరణ కార్పొరేట్‌లపరం చేశారు. దేశంలోని పరిశోధన కేంద్రాలన్నీ నిర్వీర్య మయ్యాయి. టెక్నాలజీని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడి వాతావరణానికి సరిపడక వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బ తిన్నాయి.ప్రధాని మోడీ కాలంలో ఏటా రూ.4లక్షల కోట్లు వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతులు చేసుకుంటున్నాం. ముతక ధాన్యాల ఉపఉత్పత్తులు, వంట నూనెలు, పప్పులు, పంచదార, పత్తితోపాటు మాంసం కూడా దిగుమతి చేసుకుంటున్నాం.

పథకాలు కాగితాలకే పరిమితం

ప్రణాళికా సంఘం రద్దుకావడంతో అభివృద్ధికి అటంకం ఏర్పడింది. దేశంలోని 7,935 పట్టణాలలో 37.70 కోట్ల ప్రజలను స్వచ్ఛ భారత్ పేరుతో అభివృద్ధి చేస్తామని అన్నారు. మేకిన్ ఇండియా పథకంతో దేశాన్ని మేన్యుఫాక్చరింగ్ హబ్‌గా రూపొందించడంతో పాటు, డిజిటల్ ఇండియా పథకంతో స్కిల్డ్, అన్‌స్కిల్డ్, శిక్షణ ద్వారా ఉపాధి కల్పన, సూపర్ కంప్యూటర్ల ఏర్పాటుకు ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఏటా రూ.3.5లక్షలకోట్ల విలువైన విద్యుత్ యంత్రాలు, విద్యుతేతర పరికరాలు దిగుమతులు చేసుకుంటున్నాం. వాస్తవానికి ఈ సరుకులు దేశంలో ఉత్పత్తి చేయడానికి తగినంత ముడిసరుకు, మానవ వనరులు ఉన్నాయి. వీటిని వినియోగించకుండా ఇతర దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలతో విదేశీ పెట్టుబడులు ఆకర్షించడానికి వనరులు కల్పిస్తున్నారు. దేశ పరిశ్రమలను మూసి వేస్తున్నారు. వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగంలో 100శాతం 'విదేశీ సంస్థాగత పెట్టుబడి' రాబట్టి వారు లాభాలు తరలించుకుపోయే విధంగా విధానాలు రూపొందించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రకటించి అందుకనుగుణంగా 15 పథకాలను ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి మౌలిక వసతుల కింద లక్ష కోట్ల పథకాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఎయిర్ ఇండియా, బిఎస్ఎన్ఎల్, షిప్పింగ్ కార్పొరేషన్‌ను లాభాల్లోకి తెస్తానన్న ప్రభుత్వం వాటిని అమ్మకానికి పెట్టింది. ఆహార అభివృద్ధిలో వెనుకబాటుతనం వలన దేశంలో 25కోట్లమంది దారిద్ర్యంలో మగ్గుతున్నారు.

ఆత్మనిర్భర్ భారత్ (స్వయం పోషకత్వ భారత్) అస్థిత్వాన్ని కోల్పోయే స్థితికి దిగజారుతున్నాయి. ఈ విషయం ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆర్థిక సంస్థ నివేదికలే చెబుతున్నాయి.

పార్లమెంట్‌లో చర్చించకుండానే చట్టాలు ఆమోదం

సాంఘికంగా దేశంలో హిందూమత ప్రచారాన్ని గావిస్తూ 1. ఏకరూప సంస్కృతి, 2. జాతీయ పౌరసత్వ రిజిస్ట్రేషన్, 3.ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి పేరుతో మత రాజకీయాలను కొనసాగిస్తూ జాతుల మధ్య తగాదాలను సృష్టిస్తున్నారు. దశాబ్దాల తరబడి నివాసం ఉంటున్నవారిలో కొన్ని మతాలకే పౌరసత్వం కల్పించటానికి చట్టాలు చేశారు. ఈ విధానం వలన ఈశాన్య రాష్ట్రాలలో శాంతిభద్రతలు కరువై లక్షలమంది వలసలు పోతున్నారు. బానిసత్వం రూపుమాపుతామని ప్రకటించిన కేంద్రం బానిస లక్షణాలనే కొనసాగిస్తున్నది. గోవధ నిషేధం పేరుతో ఆహార విధానాలపై దాడులు, హత్యలు సాగిస్తున్నారు. తన వ్యక్తిగత కమిట్‌మెంట్‌తో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మాణం చేశానని ఘనంగా చెప్పిన ప్రభుత్వం, మసీదులు, చర్చిలు, మైనార్టీల ప్రార్థనా స్థలాలను కూల్చడానికి హిందూమతం పేరుతో మూకదాడులు చేస్తున్నారు. చట్టాలలో మార్పులు తెస్తున్నారు. నాటి ఆంగ్లేయుల చట్టాలకు పేర్లు మార్చి శిక్షలను పెంచి పార్లమెంటులో చర్చించకుండానే ఆమోదిస్తున్నారు. 2047లో 100 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని 'అమృతకాల్' పేరుతో ప్రచారం చేసుస్తూ ప్రస్తుతం ప్రజలు అనుభవిస్తున్న స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తున్నారు.



నిత్యావసరాల ధరలను నిరోధించడంలో విఫలం

గత కరోనా కాలంలో పట్టణాలకు వలసలు వెళ్ళిన 19కోట్లమంది ప్రజలు ఉపాధి కోల్పోయి తిరిగి గ్రామాలకు వచ్చారు. వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేదు. రెండు కోట్లమందికి ఏటా ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం రైల్వే శాఖ, రవాణాశాఖ, రక్షణ శాఖలో ఉన్న కోట్ల ఖాళీలు భర్తీ చేయడంలేదు. గత 9సంవత్సరాల మోడీ పాలనలో దేశంలో నిరుద్యోగం 8శాతం నుండి 22శాతానికి పెరిగినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ వ్యయంపై కాగ్ నివేదిక అనేక అభ్యతరాలు చెప్పినప్పటికీ ఏ ఒక్కటీ పాటించలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆగస్టు జెండా ఆవిష్కరణ సందర్భంగా రానున్న ఐదు సంవత్సరాలలో 'విశ్వకర్మ పథకం' ద్వారా వృత్తిదారులకు రూ.13వేల కోట్లు కేటాయించ బోతున్నట్లు ప్రకటించారు. 169 పట్టణాలలో ప్రభుత్వ, ప్రయివేటు పథకం కింద రూ.57,613 కోట్లతో 10,000 విద్యుత్ బస్సులను సరఫరా చేస్తామని, 9 రాష్ట్రాలలోని 35జిల్లాలో రూ.32,500 కోట్లతో బహుళ రైల్వే ట్రాక్స్, మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, అమలుకాని పాత పథకాలతో పాటు కొత్త పథకాలను ప్రకటించారు. డిజిటల్ భారత్‌కు రూ.14,903 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ తెస్తానని ప్రకటించారు.

> ఈ తొమ్మిదేండ్ల కాలంలో అంతకు ముందున్న రూ.55 లక్షల కోట్లకు తోడుగా పెరిగిన అప్పులు రూ.155 లక్షల కోట్లకు పెరిగాయి. వీటికి రూ.12లక్షల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నాం. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టం, రైతులకు ఉపయోగపడే ఎరువుల సబ్సిడీలు పెద్ద ఎత్తున తగ్గించారు. దళిత, గిరిజన, మైనార్టీలే టార్గెట్‌గా వారిపై ఆర్థిక, సాంఘిక దాడులు చేస్తున్న కేంద్రం ప్రకటించే పథకాలు ప్రజలకు భ్రమలు కల్పించడానికే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదు. పథకాలు ప్రకటించడమే తప్ప వాటిని అమలు చేయాలని చిత్తశుద్ధి ప్రధాని మోడీకీ లేదు. అందుకే పథకాలన్నీ నీటిమూటలుగానే మారాయి.

ఇన్ని ప్రకటనలు చేసిన కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరల పెరుగుదలను నిరోధించడంలో విఫలమైంది. పరోక్ష పన్నులు 32శాతం నుండి 42.74శాతానికి పెంచారు. కార్పొరేట్‌లకు ప్రత్యక్ష పన్నులు ఇతరదేశాలలో 35శాతం ఉండగా, ఇక్కడ 25శాతానికి తగ్గించారు. ప్రభుత్వం ఈ తొమ్మిదేండ్ల కాలంలో అంతకు ముందున్న రూ.55 లక్షల కోట్లకు తోడుగా పెరిగిన అప్పులు రూ.155 లక్షల కోట్లకు పెరిగాయి. వీటికి రూ.12లక్షల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నాం. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టం, రైతులకు ఉపయోగపడే ఎరువుల సబ్సిడీలు పెద్ద ఎత్తున తగ్గించారు. దళిత, గిరిజన, మైనార్టీలే టార్గెట్‌గా వారిపై ఆర్థిక, సాంఘిక దాడులు చేస్తున్న కేంద్రం ప్రకటించే పథకాలు ప్రజలకు భ్రమలు కల్పించడానికే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదు. పథకాలు ప్రకటించడమే తప్ప వాటిని అమలు చేయాలని చిత్తశుద్ధి ప్రధాని మోడీకీ లేదు. అందుకే పథకాలన్నీ నీటిమూటలుగానే మారాయి.

సెల్:9490098666

'మిషన్ భగీరథ' కార్మికుల వెతలు పట్టవా?





గీట్ల ముకుందరెడ్డి
9490098857

రాష్ట్ర ప్రభుత్వ మానస పుత్రికగా చెప్పిన మిషన్‌భగీరథ కార్మికుల వెతల్ని సర్కార్ పట్టించుకోవడం లేదు. 'నీళ్ల కోసం ఆడబిడ్డలు మైళ్ల దూరం నడవాల్సిన పనిలేదు. ఇంటింటికీ నల్లా ద్వారా నీళ్లిస్తాం' అని చెప్పిన ముఖ్యమంత్రి అందులో పనిచేస్తున్నవారి సమస్యలపై దృష్టి సారించడం లేదు. ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న కార్మికులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో చేసిన పనికి సరైన వేతనంలేక, కుటుంబాన్ని పోషించు కోలేని స్థితిలో ఆత్మహత్యలు కూడా చేసుకున్నటు వంటి దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. అయినప్పటికీ వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉన్నాయి. మిషన్ భగీరథలో వివిధ ఏజెన్సీల కింద రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16వేలమంది వర్కర్స్ పనిచేస్తున్నారు. లైన్‌మెన్లుగా, పంప్ ఆపరేటర్లుగా, ఎలక్ట్రీషన్లుగా, మెయింటెనెన్స్ టెక్నీషియన్స్‌గా, సెక్యూరిటీ గార్డులుగా, హెల్పర్లుగా వివిధ క్యాటగిర్లలో వీరు పనిలో ఉన్నారు. ఆరు గ్రామాలకొక లైన్‌మెన్ చొప్పున మండలానికి ఆరు నుండి పది మంది పనిచేస్తున్న లైన్‌మెన్‌లు పనిగంటలతో నిమిత్తం లేకుండా సమస్య ఎప్పుడు వచ్చినా, ఎక్కడ వచ్చినా పైప్‌లైన్ల వెంట వెళ్లాలి. ప్రతిరోజు తనకు కేటాయించిన అన్ని గ్రామాలు తిరగాలి. వాల్వుల ద్వారా వాటర్ ట్యాంకులోకి నీళ్లు వదలాలి. జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ఫొటోలు, వీడియోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గ్రామ పంచాయతీలకు సరఫరా చేసిన వాటర్ రోజువారిగా రికార్డులు చేసి, వారానికి ఒకసారి గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్, గ్రామ పంచాయతీ పంపు డ్రైవర్‌తో సంతకాలు తీసుకొని, రికార్డులుపై బాధ్యులకు అప్పజెప్పాలి. ఈ రికార్డుల ఆధారంగానే కాంట్రాక్ట్ ఏజెన్సీలకు బిల్లులు వస్తాయి. నీటి సరఫరా తక్కువ క్వాంటిటీ చేసినప్పటికీ ఎక్కువ మొత్తంలో సరఫరా చేసినట్లుగా పంచాయతీ సిబ్బందితో సంతకాలు తీసుకోవాలని ఏజెన్సీ బాధ్యులు లైన్‌మెన్‌లపై ఒత్తిడి తెస్తూ ఉంటారు. లేదంటే ఇస్తున్న జీతంలో కోత పెడతామని అక్కడక్కడ బెదిరిస్తున్నారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పంప్‌హౌస్లు, సంపులు తదితర చోట్ల పనిచేస్తున్న ఆపరేటర్లు, ఎలక్ట్రిషన్లు, హెల్పర్లు, సెక్యూరిటీ గార్డులు మూడు షిఫ్టలలో డే టైంలో ఆరుగంటలు, రాత్రిపూట 12గంటలు పని చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పని స్థలాలు రవాణా సౌకర్యాలకు దూరంగా ఉండటమే. ఇంత చేసినా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఏజెన్సీలు వీరికి ఇస్తున్న జీతం రూ.8 వేలనుండి 12వేలు మాత్రమే. నెలకు 30రోజులు పని చేయాలి. వారంతపు సెలవులు లేవు. పండుగ సెలవులివ్వడం లేదు. సిక్ లీవులు, ఎర్నుడ్ లీవులు అంటే ఏంటో కూడా వీరికి తెలియని పరిస్థితి. బోనస్, పీఎఫ్., ఇ.ఎస్.ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలు కావడం లేదు. ప్రమాద బీమా సౌకర్యం కూడా లేదు. ప్రమాదాలకు గురై చనిపోయిన పట్టించుకున్న నాథుడే లేడు. లైన్‌మెన్‌లకు బైక్ పెట్రోల్ అలవెన్స్‌లు కూడా ఇవ్వడం లేదు. పథకం ప్రారంభం నుండి అనేక కష్టనష్టాలకు ఓర్చుకొని పని చేస్తున్న క్రమంలో వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ 3,372 మందిని హెల్పర్స్‌గా మిషన్ భగీరథకు కేటాయించడం జరిగింది. వీరిని గ్రిడ్‌కు కేటాయిస్తారా లేక ఇంట్రాకు కేటాయిస్తారా అనే ఆందోళన కార్మికుల్లో నెలకొన్నది. ఇక వాటర్ పైప్‌లైన్ కట్టింగులు, ఫిట్టింగులు, వెల్డింగులు, డిగింగులు తదితర పనులు నిర్వహిస్తున్నది అంతర్ రాష్ట్ర వలస కార్మికులు. వీరికి వసతి, భోజన సౌకర్యం కల్పించి గుండు గుత్తగా నామమాత్ర వేతనాలు ఇస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వ ఫ్లాగ్షిప్ ప్రోగ్రామ్ అయిన మిషన్ భగీరథ తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ (టిడిడబ్ల్యుఎస్‌సి) ద్వారా గ్రామీణ ప్రాంతాలకు రోజుకు తలసరి 100లీటర్లు (ఎల్.పి.సి.డి.), మున్సిపాలిటీలకు 135ఎల్.పి.సి.డి., మున్సిపల్ కార్పొరేషన్లకు 150ఎల్.పి.సి.డి., 10శాతం పారిశ్రామిక అవసరాలకు కేటాయించ బడింది. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించడం ద్వారా సురక్షితమైన, స్థిరమైన పైప్ తాగునీటి సరఫరాను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపరితల నీటి వనరులు గోదావరి బేసిన్ నుండి 53.68 టిఎంసీలు, కృష్ణా బేసిన్ నుండి 32.43శాతం టీఎంసీలు మొత్తం 86.11శాతం టీఎంసీలు అన్ని నీటిపారుదల వనరులలో 10శాతం నీరు తాగునీటి కోసం రిజర్వ్ చేశారు. నిర్మాణాలు ఇన్టేక్ స్ట్రక్చర్స్ ఇప్పటికే ఉన్న 48తో సహా 67, నీటి శుద్ధి కేంద్రాలు (డబ్ల్యూటీపీలు) ఇప్పటికే ఉన్న 103తో సహా మొత్తం 153, ప్రధాన నిర్మాణాలు ఇప్పటికే ఉన్న 505తో సహా మొత్తం 1674, ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, ఇప్పటికే ఉన్న 17,078తో సహ మొత్తం 35,514. కాగా 50శాతం పైగా మిషన్ భగీరథకు ముందున్న నిర్మాణాలే అయినప్పటికీ మొత్తం మిషన్ భగీరథ ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. వినియోగదారు హక్కు (ఆర్ఓయు) చట్టాన్ని ఉపయోగించి నష్ట పరిహారం చెల్లించకుండానే ప్రయివేటు భూమిలో పైపులైన్లు వేశారు. మెగా ప్రాజెక్ట కోసం అప్పుడు నడుస్తున్న ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్స్ట్రక్షన్స్ (ఈపీసీ) విధానానికి బదులుగా భగీరథ ప్రాజెక్ట్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ చేత డీపీఆర్ రూపొందించారు. 98శాతం ప్రసార, పంపిణీ వ్యవస్థలు గురుత్వాకర్షణ ద్వారా పనిచేస్తాయి. భగీరథ పనులు నిర్మాణం చేసిన కాంట్రాక్టు కంపెనీలు ఐదుసంవత్సరాల పాటు పైపులు, వాల్వులు, మోటార్లు, ఇతర వస్తువులు ఏవి చెడిపోయిన బాగుచేయవల్సిన, మార్చవల్సిన పూర్తి బాధ్యత కంపెనీలదే. పది సంవత్సరాల ఓ అండ్ ఎం బాధ్యత వారిదే. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అనేక జిల్లాలలో పైప్‌లైన్లు, వాల్వులు, పంపులు, మోటార్లు కొట్టుకు పోయాయి లేదా పాడైపోయాయి. గత 15రోజులుగా అనేక జిల్లాలోని పలు ఆవాసాలకు తాగు నీరందడం లేదు. పనులు నత్త నడకన నడుస్తున్నాయి. 30జిల్లాల్లోని 26విభాగాల ద్వారా 99నియోజకవర్గాలలోని 65పట్టణ స్థానిక సంస్థలు, 24,225 గ్రామీణ ఆవాసాలు కవర్ చేయబడతాయి (ఓఆర్ఆర్ వెలుపల). కవర్ చేయవలసిన మొత్తం భౌగోళిక ప్రాంతం లక్ష 11వేల చదరపు కిలోమీటర్లు. ప్రయోజనం పొందే జనాభా 2కోట్ల 72లక్షలు. కవర్ చేయబడిన లేదా కవర్ చేయబడే మొత్తం కుటుంబాలు 65,29,770. గ్రామీణ కుటుంబాలు 52,47,225, పట్టణ గృహాలు 12,82,545. మొత్తం పైప్‌లైన్ నెట్వర్క్ 1.697లక్షల కి.మీ. విద్యుత్ వినియోగం 235మెగా వాట్లు. ప్రాజెక్ట్ అంచనా విలువ రూ.43,791 కోట్లు కాగా 36,900 కోట్లు మాత్రమే ఖర్చు చేయబడిందని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ వివిధ కారణాల వలన ఇప్పటికీ 10 నుండి 15శాతం నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. క్యాపిటల్ ఫండ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది 10శాతం మాత్రమే. మిగతా డబ్బులు బ్యాంకులు, నాబార్డ్ నుండి లోన్లు తీసుకున్నారు. ఈ అప్పులు 12సంవత్సరాల లోపు రీపేమెంట్ 48ఇన్‌స్టాల్‌మెంటులో చెల్లించాలి. ఇప్పటికే ఆరు సంవత్సరాలు పూర్తయింది. ఇంకో రెండు సంవత్సరాల్లో ఇన్‌స్టాల్‌మెంట్లు, చెల్లింపులు ప్రారంభం కానున్నాయి. మిషన్ భగీరథకు కేంద్ర ప్రభుత్వం 19,205 కోట్ల రూపాయలను ఇవ్వాలని నిటి అయోగ్ రికమండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఇంత ఖర్చు చేసినప్పటికీ వివిధ జిల్లాలలోని మారుమూల గ్రామాలకు, కొండ ప్రాంతాల్లోని గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు అందడం లేదు. అనేక గ్రామాలకు పైప్‌లైన్లు కూడా వేయలేకపోయారు. మిషన్ భగీరథ ద్వారా అందుతున్న తాగు నీరు 40 నుండి 50శాతం మాత్రమే. మిగతా వాటర్ ఇదివరకే ప్రారంభించి నడుస్తున్న తాగునీటి పథకాలు, గ్రామ పంచాయతీ లోని బోర్లు, బావులు, పట్టణ ప్రాంతాలలో ఇతర సాగునీటి పథకాల ద్వారా అందుతున్నవే. కానీ రాష్ట్ర మొత్తంలో తాగునీరు మిషన్ భగీరథ ద్వారానే అందుతున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచార పొటాటోపం చేసుకుంటున్నది.

రాష్ట్ర ప్రభుత్వం తన మానస పుత్రికగా భావిస్తున్న మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించకుండా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించగలదా! ఇప్పటికే వివిధ జిల్లాల్లో ముఖ్యంగా నల్లగొండ, సంగారెడ్డి జిల్లాలో భగీరథ కార్మికులు ఐక్యమై సమ్మెలు, పలు ఆందోళనలు చేసి కొన్ని సమస్యలు పరిష్కరించు కున్నారు. పది సంవత్సరాల వరకు నిర్మాణ, నిర్వహణ బాధ్యత ఏజెన్సీలదే అయినప్పటికీ కార్మికుల వేతనాలు, సౌకర్యాల నిమిత్తం కె.ఎల్ (1000 లీటర్ల)కు రూ.1.50 పైసలు రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలకు ఇస్తున్నది. కానీ కార్మికులకు చట్టబద్ధ వేతనాలు, సౌకర్యాలు ఇప్పించడంలో విఫలమవు తున్నది. ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కార్మికులందరూ రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలకు సిద్ధమవుతున్నారు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాస

- మేయర్ ఛాంబర్ ముందు బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల ధర్నా
- పలువురు కార్పొరేటర్ల అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఏడో కౌన్సిల్ సమావేశం బుధవారం రసాభాసగా మారింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగా.. 9 ఏండ్లలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ కార్పొరేటర్లు వివరించసాగారు. ఈ క్రమంలో ప్రతిపక్ష కార్పొరేటర్లు వారిని అడ్డు కోవడంతో గందరగోళ పరిస్థితి నెల కొంది. ఎస్ఆర్డీపీ రెండోదశ, మున్సి పల్ కార్మికులను పర్మినెంట్ చేయా లని, జీహెచ్ఎంసీ బకాయిలను వెంట నే చెల్లించాలంటూ కాంగ్రెస్ కార్పొరే టర్లు నిరసన వ్యక్తం చేశారు. శానిటే షన్‌పై చర్చ జరపాలంటూ పట్టు బట్టారు. జీహెచ్ఎంసీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ప్రతిపక్ష కార్పొరేటర్లను మేయర్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, ప్రత్యేక తీర్మానం చేసి కార్మి కులకు న్యాయం చేయాలని ప్రతిపక్ష కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఇంకా చర్చించాల్సి అంశాలు ఎన్నో ఉన్నా యని కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు పట్టుబట్టినా కౌన్సిల్ సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. ఇదిలా వుండగా, కౌన్సిల్ సమావేశం అర్థాంతరంగా ముగియడంతో తిరిగి బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు మేయర్ ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

దొరల పాలనలో బహుజనులకు తీరని నష్టం

- జర్నలిస్టులపై సీఎం వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి :బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-అంబర్‌పేట

దొరల పాలనలో రాష్ట్రంలో బహుజనులకు తీరని నష్టం జరుగు తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ లక్డీకాపూల్ లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక శాతం ఉన్న అగ్ర వర్ణాలు అధికా రాన్ని చేపడుతుంటే.. 90 శాతం ఉన్న బహుజనులు ఏం చేయాలని ప్రశ్నించారు. బీసీ తరగతుల్లో 150 కులాలు ఉంటే.. 6 కులాలకే బీఆర్ఎస్‌లో టికెట్లు ఇచ్చారన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బహుజనులు బహుజన సమాజ్ వాజ్ పార్టీలోకి రావాలని కోరారు.

బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం చేసుకుందని ఆరోపించా రు. ఒక్కో నియోజకవర్గానికి రూ.50 కోట్ల వరకు పెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని తెలిపారు. కేసీఆర్ ఇప్పటికే ఓడినట్టు ఒప్పుకొని రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నార న్నారు. బహుజనులు ఓట్ల కోసం ఇతర పార్టీవాళ్లు ఇచ్చే తాయిలాలకు ఆశపడొద్దన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన కేసీఆర్‌ను మళ్లీ ఎన్నుకుంటే రాష్ట్రం ఆగమైతదన్నారు. డిసెంబర్ వరకు సమయం ఉన్నా ఇప్పుడే మద్యం టెండర్లు ఎందుకు వేలం వేస్తున్నారని ప్రశ్నించారు. ఆ డబ్బులు ఎలక్షన్స్ ఫండ్ కోసమే కదా అని నిలదీశారు. వంద కోట్ల లిక్కర్ స్కామ్‌లో నిందితురాలు ఎమ్మెల్సీ కవితను ముట్టుకోవడానికి భయపడు తున్నారని.. అదే బహుజన గిరిజన బంజారా లక్ష్మీ భాయ్‌ను చిత్రహింం లకు గురిచేస్తే ఎవరూ మాట్లాడర న్నారు. జర్నలిస్టులపై ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని.. జర్నలిస్టులకు బహు జనుల సమాజ్ వాజ్ పార్టీ మద్దతుగా ఉంటుందని తెలిపారు.

రుణమాఫీ అడిగితే నడ్డివిరిచేలా కొడతారా?

- సెప్టెంబర్ 7న చలో హైదరాబాద్ : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తే ప్రజల నడ్డి విరిగేలా కొడతారా?అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. కేసీఆర్ పోకడ లు నయా నిజాంలా ఉన్నా యని విమర్శించారు. బుధవారం హైదరా బాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసుల లాఠీచార్జిలో బీఆర్ఎస్ గుండాల దాడిలో వర్ధన్నపేటకు చెందిన దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌కు చేయి విరిగింద న్నారు. మహిళా మోర్చా నాయకులు కాసమ్మ, నాయకులు శ్రీనివాస్, వినోద్ రాథోడ్‌కు గాయాలయ్యాయని తెలిపారు. అన్ని సర్వేలూ బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని చెబుతున్నాయనీ, అందుకే విచక్షణ కోల్పోయి ప్రజల పైనా, ప్రతిపక్షాలపైనా దాడులకు తెగబడుతున్నదని విమర్శించారు. దళితబంధులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 30 శాతం మేర కమీషన్లు తీసుకుం టున్నారని స్వయంగా కేసీఆరే చెప్పా రనీ, వారికి సీట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగేండ్లలో దేశం లో 4 కోట్ల మందికి ఇండ్లు కట్టిస్తే.. 9 ఏండ్ల కేసీఆర్ పాలనలో కనీసం లక్ష ఇండ్లు కూడా కట్టించలేదని విమర్శిం చారు. బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో గురువారం మంత్రుల ఇండ్లను, 25న కలెక్టరేట్లను ముట్టడిస్తామ న్నారు. సెప్టెంబరు 7వ తేదీన చలో హైదరా బాద్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ప్రకటించారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 59,230	▲	100
22 క్యారెట్లు	- 54,300	▲	100
కిలో వెండి	- 78,500	▲	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 104
రిటైల్ (లైవ్)	రూ. 126
స్కిన్‌తో	రూ. 183
స్కిన్‌లెస్	రూ. 208

చంద్రయాన్ 1 నుంచి నేటి దాకా....

చంద్రుడుపైకి భారత్ పంపిన తొలి మిషన్ చంద్రయాన్ వన్ 2008లో పూర్తయింది. ఖర్చు రూ.386 కోట్లు. చంద్రయాన్-2 ప్రయోగం కోసం రూ.978 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు చంద్రయాన్-3కి రూ.615 కోట్లు ఖర్చు అయింది,.

- జులై 6: చంద్రయాన్-3ని జులై 14న శ్రీహరికోటలో లాంచ్ ప్యాడ్-2 నుంచి ప్రయోగించబోతున్నట్లు ఇస్రో ప్రకటించింది.

ఎన్నిసార్లు కక్ష్యను పెంచారు?

భూమి చుట్టూ తిరిగేటప్పుడు ఐదుసార్లు చంద్రయాన్-3 వ్యోమనౌక కక్ష్యను శాస్త్రవేత్తలు పెంచారు.

- జులై 15: తొలిసారి కక్ష్యను పెంచారు.
- జులై17: రెండోసారి చంద్రయాన్-3 ఎత్తును పెంచుతూ కక్ష్యను మార్చారు.
- జులై 18: మూడోసారి ఎత్తును పెంచుతూ కక్ష్యను మార్చారు.
- జులై 20: నాలుగోసారి చంద్రయాన్-3 కక్ష్యను మార్చారు.
- జులై 25: చివరిసారిగా ఐదోసారి కక్ష్యను పెంచారు.

చంద్రుడి వైపు పయనం ఎప్పుడు మొదలైంది?

- ఆగస్టు 1: భూమి చుట్టు తిరిగే చంద్రయాన్-3 రాత్రి 1 గంట సమయంలో చంద్రుడి వైపుగా పయనం మొదలుపెట్టింది.
- ఆగస్టు 5: విజయవంతంగా దీన్ని చంద్రుడి కక్ష్యలోకి పంపించారు. 164 కి.మీ. X 18074 కి.మీ. దగ్గర దీన్ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
- ఆగస్టు 6: చంద్రుడికి దగ్గరగా వెళ్లేందుకు మరోసారి కక్ష్యను తగ్గించారు. దీర్ఘవత్తాకార కక్ష్యలో 170 కి.మీ X 4313 కి.మీ. దగ్గర ప్రవేశపెట్టారు.
- ఆగస్టు 9: చంద్రయాన్-3ను 174 కి.మీ 1437 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.
- ఆగస్టు 14: చంద్రయాన్-3ను 151 కి.మీ. 179 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.
- ఆగస్టు 16: చంద్రయాన్-3ను 153 కి.మీ. 163 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.

ల్యాండర్ వేరుపడిందిలా

- ఆగస్టు 17: చంద్రయాన్-3 బూస్టర్ నుంచి విక్రమ్ ల్యాండర్ విజవంతంగా వేరుపడింది.
- ఆగస్టు 19: విక్రమ ల్యాండర్ దీర్ఘవత్తాకార కక్ష్యలో చంద్రుడి చుట్టూ తిరగడం మొదలుపెట్టింది.
- ఆగస్టు 20: విక్రమ్ ల్యాండర్ కక్ష్యను తగ్గించి 25 కి.మీ. క్ష్మీ 134 కి.మీ. వద్ద కక్ష్య మార్చారు.
- ఆగస్టు 23: చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ సాఫ్ట్ ల్యాండ్ అయింది.

చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ ఏం చేస్తుంది?

చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర 70 డిగ్రీల అక్షాంశం వద్ద విక్రమ్ ల్యాండ్ అయ్యింది. అక్కడ కొన్ని పరిశోధనలను విక్రమ్ చేపడుతుంది.

చంద్రుడి ఉపరితలంపై ఎలాంటి మార్పులు చేసుకుంటున్నాయి? ఇక్కడ ఎలాంటి ఖనిజాలు లభ్యమవుతాయి లాంటి వివరాలను విక్రమ్ సేకరిస్తుంది.

భూమి తరహాలో చంద్రుడిపైనా ప్రకంపనలు వస్తున్నాయో లేదో కూడా డేటా సేకరిస్తుంది.

విక్రమ్ ల్యాండర్ కిందకు దిగిన తర్వాత దాని నుంచి రోవర్ బయటకు వస్తుంది. ఇది చంద్రుడిపై మట్టి నమూనాలను పరీక్షిస్తుంది. సంబంధిత వివరాలను శాస్త్రవేత్తలకు పంపిస్తుంది.

బోర్డు పరీక్షలు ఏడాదికి రెండు సార్లు

11,12 తరగతుల విద్యార్థులకు రెండు భాషలు తప్పనిసరి

- అందులో ఒకటి దేశీయ, మరొకటి విదేశీ భాష
- ఎన్‌సీఈఆర్‌టీ తుది పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ విడుదల

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

11, 12 తరగతుల విద్యార్థులకు రెండు భాషలు తప్పనిసరి అని ఎన్‌సీఈఆర్‌టీ జాతీయ పాఠ్యప్రణాళిక స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్‌సిఈఆర్‌టి బుధవారం తుది జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) విడుదల చేసింది. ఎన్‌సీఎఫ్ బోర్డు పరీక్షలను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలని సిఫారసు చేసింది. సైన్స్, కామర్స్ వంటి స్ట్రీమ్‌లలోని సబ్జెక్టులను విద్యార్థులు ఎంచుకోవడానికి ఎటువంటి పరిమితి ఉండకూడదని పేర్కొంది.

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ చైర్మెన్ కె కస్తూరిరంగన్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన జాతీయ స్టీరింగ్ కమిటీ రూపొందించిన ఎన్‌సీఎఫ్ జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020కి అనుగుణంగా ఉంది. ఎన్‌ఈపీ భారతీయ భాషలు బోధనపై ఉద్ఘాటించింది. వాటిని పాఠశాల, ఉన్నత విద్యలో బోధనా మాధ్యమంగా అందిస్తోంది.

ఎన్‌సీఎఫ్ 3 నుంచి 12 తరగతులలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)కి అనుబంధంగా ఉన్న పాఠశాలల్లో బోధించే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల కోసం బెంచ్‌మార్క్ లను నిర్వచిస్తుంది. బోధన, అభ్యాస పద్ధతులు, పాఠశాలలు అనుసరించే మూల్యాంకన పద్ధతులను నిర్వచిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, విద్య అనేది రాష్ట్ర సబ్జెక్ట్ అయినందున రాష్ట్ర విద్యా బోర్డులకు సిఫారసుగా ఉంటాయి. ఎన్‌సీఎఫ్ చివరిగా 2005లో సవరించారు.

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రజా సంప్రదింపుల కోసం ఏప్రిల్‌లో ఎన్‌సీఎఫ్ ముందస్తు ముసాయిదాను విడుదల చేసింది. చివరి ఎన్‌సీఎఫ్ డ్రాఫ్ట్‌లో చేర్చిన చాలా సిఫారసులను ఉన్నాయి. కొన్ని మార్పులు కూడా ఉన్నాయి. 11, 12 తరగతుల విద్యార్థులకు కనీసం రెండు భాషలను అందించాలన్న ఎన్‌సీఎఫ్ సూచన, వాటిలో ఒకటి భారతీయ భాష తప్పని సరి అని పేర్కొంది.

అందించే భాష, సాహిత్య కోర్సుల నుంచి విద్యార్థులు భాషలను ఎంపిక చేసుకుంటారు. భాషల ఎంపికలలో సాంప్రదాయ తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒరియా, పాలీ, పర్షియన్, ప్రాకృతంతో సహా సంస్కృతం, ఇతర ఆధునిక, క్లాసికల్ భాషలు, భారతదేశ సాహిత్యం ఉంటాయి. దీనితో పాటు, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషలు కూడా అందించబడతాయి.

ప్రస్తుతం సీబీఎస్‌ఈ పాఠశాలల్లో 11, 12 తరగతుల విద్యార్థులకు ఒకే భాష బోధిస్తున్నారు. దీని అర్థం ఈ తరగతుల్లో ఒక భాష అదనంగా మరో సబ్జెక్ట్ పెరుగుతుంది. "ఈ భాషలు, సాహిత్యాలు సజీవంగా, చైతన్యవంతంగా ఉండేలా చూడటం కోసం, ప్రత్యేకించి ఉత్తమంగా బోధన, పెంపొందిస్తుంది" అని ఫ్రేమ్‌వర్క్ పేర్కొంది.

"12వ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరికీ బోధనా మాధ్యమం కోసం దేశానికి చెందిన కనీసం ఒక భాష ఎంపిక చేయబడుతుంది" అని కూడా ఫ్రేమ్‌వర్క్ నొక్కి చెప్పింది. ఇటీవల, సీబీఎస్‌ఈ పాఠశాలలను భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా అందించాలని కోరింది.

విద్యార్థులు మంచి పనితీరు కనబరిచేందుకు తగిన సమయం, అవకాశం ఉండేలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలను నిర్వహించాలని ముసాయిదాలో ప్రతిపాదించిన సిఫారసును కూడా ఫ్రేమ్‌వర్క్ నిర్ధారిస్తుంది. ఇది 11, 12 తరగతులకు సెమిస్టర్ విధానాన్ని సిఫారసు చేసింది. "కళలు, మానవీయ శాస్త్రాలు, శాస్త్రాల మధ్య ఎటువంటి విభజన లేదు" అని పేర్కొంది. "దీర్ఘకాలంలో", అన్ని (విద్య) బోర్డులు సెమిస్టర్ లేదా టర్మ్-ఆధారిత వ్యవస్థలకు మారాలి. విద్యార్థులు ఒక సబ్జెక్ట్‌ను పూర్తి చేసిన వెంటనే మరొక సబ్జెక్ట్‌లో పరీక్షించవచ్చు. ఇది ఏదైనా ఒక పరీక్షలో పరీక్షించబడే కంటెంట్ లోడ్‌ను మరింత తగ్గిస్తుంది" అని ఫ్రేమ్‌వర్క్ తెలిపింది.

మిజోరంలో ఘోరప్రమాదం

- నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలి..

22 మంది మృతి :దర్యాప్తునకు కేంద్రరైల్వేశాఖ ఆదేశం

ఐజ్వాల్ : మిజోరంలో ఘోరప్రమాదం సంభవించింది. నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలిపోవటంతో 22 మంది కార్మికులు చనిపోయారు. రాజధాని నగరం ఐజ్వాల్‌కు 21కి.మీ దూరంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సైరంగ్ వద్ద నిర్మాణ పనులు జరుగుతోన్న సమయంలో ఈ వంతెన కూలింది. ప్రమాద సమయంలో అక్కడ 35 నుంచి 40 మంది కూలీలు ఉన్నట్టు సమాచారం. వారిల 22 మంది చనిపోగా, మరి కొంతమంది శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని తెలుస్తోంది. ఈ ఘటనపై మిజోరం ముఖ్యమంత్రి జొరామ్‌థంగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు10లక్షల ఎక్స్‌గ్రేషియో: రైల్వే మంత్రి ప్రకటన

మిజోరంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలిన ఘటనలో మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు 10లక్షలు, తీవ్ర గాయాలైన వారికి 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించనున్నట్టు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. మిజోరం ఘటన దురదృష్టకరమన్న ఆయన.. కేంద్ర, రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో పాటు రాష్ట్ర అధికార యంత్రాంగం, రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో స్వల్ప గాయాలైన వారికి 50వేలు చొప్పున పరిహారం చెల్లించనున్నట్టు ట్వీట్ చేశారు. వంతెన దుర్ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే వారికి రెండు లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారి కుటుంబాలకు రూ.50వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు.భైరవి-సైరంగ్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులోని 13 వంతెనలలో ఇది ఒకటి. ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ కమిటీని నియమించినట్టు అధికారులు తెలిపారు.

ఐక్య పోరాటానికి విజయం

ఏఐపీడబ్ల్యూఎఫ్ అభినందన

- జియావుల్ ఆలంపై తప్పుడు అభియోగాలు మోపారని ఆరోపణ

న్యూఢిల్లీ : తన కార్యాలయం నుంచి ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ, కామ్రేడ్ జియావుల్ ఆలం సహా ట్రేడ్ యూనియన్ కార్యకర్తలను దురుద్దేశపూర్వకంగా అరెస్టు చేసి వారిపై దాడికి దిగడానికి వ్యతిరేకంగా నిరసనను, ప్రతిఘటనను చూపినందుకు దాని అన్ని విభాగాలను, మొత్తం టీ సొసైటీని ఆల్ ఇండియా ప్లాంటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐపీడబ్ల్యూఎఫ్) అభినందించింది. కామ్రేడ్ జియావుల్ ఆలంపై తప్పుడు అభియోగాలు మోపారని ఆరోపించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. ఉత్తర బెంగాల్‌లోని తోటల సంఘం, దేశంలోని ఇతర సంఘాలు కూడా దీనిపై స్పందించాయి. తమ వారిని బేషరతుగా విడుదల చేయాలంటూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన 30కి పైగా టీ ట్రేడ్ యూనియన్‌ల సమ్మేళనం పశ్చిమ బెంగాల్‌లోని టీ జిల్లాల్లోని అన్ని పోలీసు స్టేషన్‌లను డిమాండ్ చేసింది. ఈనెల 21న, త్రిపుర నుంచి కేరళ వరకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది తేయాకు కార్మికులు తమ తోటల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. తక్షణమే జోక్యం చేసుకుని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి, పశ్చిమ బెంగాల్ హోం మంత్రికి లేఖ పంపారు. సీఐటీయూ పిలుపు మేరకు ఇతర కేంద్ర, ప్రాంతీయ కార్మిక సంఘాలు కూడా సంఘీభావం, మద్దతును అందించాయి. పోరాటాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. అన్ని మూలల నుంచి విపరీతమైన ఒత్తిడి, దేశవ్యాప్తంగా ఒత్తిడితో కూడిన ఆందోళనల కారణంగా, కామ్రేడ్ జియావుల్ ఆలం, ఇతర సహచరులకు 21న జల్పాయిగురి కోర్టు నుంచి బెయిల్ మంజూరైంది. పోరాటం ద్వారా సాధించిన విజయానికి ఇది అసాధారణమైన, అద్భుతమైన ఉదాహరణ అని ఫెడరేషన్ పేర్కొన్నది. ఈ వీర పోరాటం, విజయం కోసం శ్రామిక ప్రజలందరికీ ఏఐపీడబ్ల్యూఎఫ్ శుభాకాంక్షలు తెలియజేసింది.

తెలంగాణ జడ్జిపై సుప్రీం వేటు

హైదరాబాద్: తెలంగాణ ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి జయకుమార్‌ను సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికపై జడ్జి జయ కుమార్ కీలక తీర్పును వెలువరించారు. శ్రీనివాస్ గౌడ్ సహా 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల అధికారులపై కూడా కేసు పెట్టాలని ఆయన ఆదేశించారు. ఈ విషయమై ఆయనపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కేసులు పెట్టాలని ఎలా ఆదేశిస్తారని ప్రశ్నించింది.

యువత ప్రపంచ పౌరులుగా ఆలోచించాలి

- పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు చంద్రబాబు పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లేందుకు యువత, ఇతర తరగతులు ప్రపంచ పౌరులుగా ఆలోచించాలనీ, ఆ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉండాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడి ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లోని అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో చంద్రబాబు నాయుడు యువత సాంకేతిక పరిజ్ఞాన ప్రదాతలుగా ఎదగాలని అభిప్రాయపడ్డారు. సైబరాబాద్‌ను ఎలా అభివద్ధి చేశారో, ఆర్థిక జిల్లాలో మౌలిక వసతులు కల్పించారో గుర్తుచేస్తూ పీ-4(పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ అండ్ పార్టనర్‌షిప్)ను ఇప్పుడు ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రాలు కానీ యావత్ జాతి అభివద్ధి కోసం దీన్ని మనం సాధించగలిగితే అది దేశానికి గొప్ప ఆస్తి అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశంలో కాల్స్ చేయడానికి బీఎస్ఎన్ఎల్, అంతర్జాతీయ కాల్స్ కోసం వీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరితోనైనా మాట్లాడేందుకు మెరుపు కాల్ చేస్తే ఎనిమిది గంటలు కాకపోయినా ఎనిమిది రోజులు పట్టేదని చంద్రబాబు గుర్తుచేశారు. "నా విజన్-2020తో నేను సాంకేతికతను ఆధునీకరించడంలో విజయం సాధించాను , మీరందరూ ఇప్పుడు దాన్ని ఆస్వాదిస్తున్నారు, దీని కోసం నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని చెప్పారు. మైక్రోసాఫ్ట్ యూనిట్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడానికి బిల్ గేట్స్‌ను కలవడానికి తాను ఎలా కష్టపడ్డానో వివరంగా చెప్పిన మాజీ ముఖ్యమంత్రి, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఐఆర్‌డీఏ) పొందడానికి అప్పటి ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయిని ఒప్పించగలిగానని చెప్పారు. భారతదేశం నుంచి హైదరాబాద్‌కు వెళ్లడం వల్ల అక్కడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పడింది. గచ్చిబౌలిని అభివద్ధి చేయడం వెనుక ఉన్న కథను వివరిస్తూ ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ పటంలో ఉందని అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లు చాలా ఇరుకుగా ఉన్నాయనీ, ఒకప్పుడు నగరాన్ని సెమీ అర్బన్ ప్రాంతంగా మాత్రమే పరిగణించేవారన్నారు. టీడీపీ ప్రభుత్వం రోడ్లను విస్తరించి, ఆ తర్వాత ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) రూపకల్పన కోసం పరిస్థితులతో పోరాడిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం, ఇతర ప్రాజెక్టులు పెట్టుబడిదారులను తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేసుకునేలా ఒప్పించామని వివరించారు. తెలుగువారు ప్రపంచానికి నాయకత్వం వహించాలనేదే నా మొదటి ప్రధాన ప్రాధాన్యత అని చంద్రబాబు అన్నారు. ఇండియన్ బిజినెస్ మేనేజ్‌మెంట్, నల్సార్ విశ్వవిద్యాలయం ఈ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఇక్కడ ఉన్నాయని వివరించారు. దేశానికి , ప్రపంచానికి నాయకత్వం ఉందన్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని నేను విశ్వసిస్తున్నానని వివరించారు. హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థ ఐఐఐటీ స్థాపన వెనుక తన మెదడు ఉందన్న మాజీ ముఖ్యమంత్రి, ఈ సంస్థ దేశంలోని టాప్ 10లో ఒకటిగా పరిగణించబడటం పట్ల సంతప్తి వ్యక్తం చేశారు.

చైనా అభ్యర్థనను పరిశీలిస్తున్నాం : శ్రీలంక

కొలంబో : శ్రీలంకలో పరిశోధనా నౌకను నిలిపేందుకు అనుమతించాలన్న చైనా అభ్యర్థనను పరిశీలిస్తున్నామని విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. ఏడాది అనంతరం చైనా గూఢచారి నౌక శ్రీలంకలో ప్రవేశిస్తుండటంపై భారత్ ఆందోళనలు లేవనెత్తింది. షి యాన్-6ను శ్రీలంకలో నిలిపేందుకు ఇక్కడ ఉన్న చైనా రాయబార కార్యాలయం దరఖాస్తు చేసిందని శ్రీలంక విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ప్రియాంగ్ విక్రమ సింఘే పేర్కొన్నారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తున్నామని అన్నారు. తేదీలను ఇంకా ఖరారు చేయలేదని ఆమె పేర్కొన్నారు. చైనా పరిశోధనా నౌక షియాన్ -6 సముద్రపరిశోధన కార్యకలాపాల కోసం అక్టోబర్‌లో శ్రీలంక చేరుకోనుందని అన్నారు.

చైనాకు చెందిన సిజిటిఎస్ ప్రకారం.. షియాన్ -6ని 1115 డిడబ్ల్యుటి మోసుకెళ్లే సామర్థ్యంతో పరిశోధన, సర్వే ఓడగా పేర్కొంది. ప్రస్తుతం డ్రాఫ్ట్ మొత్తం 90.6 మీటర్లు ఉండగా, 5.3 మీటర్ల పొడవు, 17.3 మీటర్ల వెడల్పుతో ఉన్నట్లు తెలిపింది. ఈ నౌకలో సుమారు 60 మంది సిబ్బంది ఉంటారు. ఈ నౌక ఓషనోగ్రఫీ, సముద్ర గర్భ పరిశోధనలు చేస్తుంది. గతేడాది శ్రీలంకలోని హంబన్‌టోట రేవులో చైనాకు చెందిన యువాన్ వాంగ్-5 నౌకకు లంగరేసిన సంగతి తెలిసిందే.

సెప్టెంబరులో భారత్‌లో బైడెన్ పర్యటన

- జి-20 సదస్సుకు హాజరు

వాషింగ్టన్ : సెప్టెంబరు 7 నుండి 10 వరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్‌లో పర్యటించనున్నారని వైట్‌హౌస్ ప్రకటించింది. 9, 10 తేదీల్లో భారత్‌లో జరిగే జి-20 దేశాల నేతల సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటూ పలు అంతర్జాతీయ అంశాలపైన నేతలు చర్చించనున్నారు. గతేడాది డిసెంబరు 1న జి-20 అధ్యక్ష బాధ్యతలను ఇండోనేషియా నుండి భారత్ చేపట్టింది. వచ్చే నెల జరగబోయే సదస్సులో పెద్ద సంఖ్యలో ప్రపంచ నేతలు పాల్గొంటారని భావిస్తున్నారు. పరిశుద్ధ ఇంధన వినియోగానికి మారడం, వాతావరణ మార్పులను ఎదుర్కొనడం వంటి కీలకాంశాలతో సహా పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి. అలాగే ఉక్రెయిన్‌లో రష్యా జరుపుతున్న యుద్ధంతో తలెత్తిన ఆర్థిక, సామాజిక పర్యవసానాలను కూడా నేతలు చర్చించనున్నారని వైట్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు 4-7 తేదీల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ జకార్తాలో పర్యటిస్తారు. అమెరికా-ఆసియాన్ సదస్సు, తూర్పు ఆసియా సదస్సులకు ఆమె హాజరవుతారు. ఇండో-పసిఫిక్ నేతలతో చర్చలు జరుపుతారు.

కొచ్చిన్‌లో 'పిట్టల' పర్యటన

- కేరళ మత్స్య పరిశ్రమపై అధ్యయనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్ పర్యటిస్తున్నారు. నాలుగు రోజుల ఈ పర్యటనలో ఆయన కేరళ మత్స్య పరిశ్రమపై అధ్యయనం చేస్తారు. ఈ సందర్భంగా 11 సంస్థలను ఆయన పరిశీలిస్తారని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో మత్స్య కారులు వినియోగిస్తున్న సాంప్రదాయ తెప్పలు, పుట్టీలకు బదులు సౌరశక్తి, జలశక్తి సంయుక్త వినియోగంతో నడిచే తేలికపాటి మర పడవలను ప్రవేశపెట్టేందుకు వీలున్న అవకాశాలను ఈ పర్యటనలో ప్రధానంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మత్స్య కారులకు శిక్షణ, చేపల వేటలో అనుసరించాల్సిన సురక్షిత విధానాలు, ప్రాసెసింగ్, చేపల ఆహార తయారీలో వస్తున్న మార్పులు, ఎగుమతులు, అదనపు ఆదాయ మార్గాలు తదితర అంశాలను అధ్యయనం చేస్తారని వివరించారు.

కొత్త కులాలు గుర్తించి.. మూడేండ్లవుతున్నా పట్టింపులేదు

రూ. లక్ష ఆర్థిక సహకారానికి దూరం

- ఎంబీసీ, ఓబీసీ జాబితాలో చేర్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఆత్మగౌరవ భవనాల ఊసే లేదు..

కలగానే కృతజ్ఞతా సభ

నవతెలంగాణ-నవీపేట్



రాష్ట్ర ప్రభుత్వం కరోనా కాలంలో 17 కులాలను గుర్తిస్తూ బీసీ జాబితాలో చేర్చడంతో తమ తలరాతలు మారాయని ఆయా కులాల వారు సంబురాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం సైతం చేశారు. అయితే కులాలను గుర్తించి మూడేండ్లవుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంబీసీ, ఓబీసీ జాబితాలో చేర్చలేదని లబ్దిదారులు వాపోతున్నారు. తమ సంక్షేమానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, పథకాలూ ప్రవేశ పెట్టలేదని, అన్ని కులాలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు సైతం తమకు అమలు కావడం లేదని 17 కులాల ప్రతినిధులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 9వ తేదీన 17 కులాలను గుర్తించి.. జీవో ఎమ్ఎస్ నెంబర్ 03 విడుదల చేసింది. వాటిలో 13 కులాలు ఓడ్, బైలు కమ్మర(గిసాడి), క్షత్రియ రామ జోగి, బాగోతుల, తెర చీరల, ఏనుటి, గంజికూటివారు, గౌడ జెట్టి, కాకి పడగల, పటం వారు, సన్నాయిలా, తోలుబొమ్మలాట వారు (బొప్పల) సంచార కులాలను బీసీ-ఏ జాబితాలో, గౌలి, అహిర్, యాదవ్ కులాలను బీసీ-డీలో బీసీ కమిషన్ ద్వారా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి చేర్చారు. కాగా, కుల వృత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ జాబితాలోని కుల వృత్తుల కుటుంబాలకు లక్ష రూపాయల సహకారాన్ని అందిస్తుంది. కానీ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఈ కులాలను చేర్చకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. 100 శాతం అర్హత ఉన్న కులాలను ఎందుకు మరిచిపోతున్నారని కులాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ కులాలను ఆర్థిక సహకారంలో చేర్చాలని కోరారు.

ఆత్మగౌరవ భవనాల ఊసేలేదు..

2018 ఎన్నికల కంటే ముందు గుర్తింపు లేని కులాలను గుర్తించి హైదరాబాద్ కేంద్రంగా ఆత్మగౌరవ భవనాలు నిర్మించి సమాజంలో ఆత్మగౌరవాన్ని కల్పిస్తామని అప్పటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ప్రకటించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ కులాలను గుర్తించి ఆత్మగౌరవ భవనాలను కేటాయించలేదన్నారు. అలాగే, 2022 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీడ్ పథకంలో, ఓబీసీ జాబితాలోనూ తమ కులాలను చేర్చాలని ఆయా కులాల ప్రతినిధులు కోరుతున్నారు.

రాజకీయ కృతజ్ఞతా సభ..

77 ఏండ్ల స్వతంత్ర్య భారతదేశంలో గుర్తించని అనేక కులాలను తెలంగాణ ప్రభుత్వం మూడేండ్ల కిందట గుర్తించింది. దాంతో తమకు సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కులాల ప్రతినిధులు కృతజ్ఞతా సభ ఏర్పాటు చేయాలని భావించారు. కానీ ఆ సమయంలో కరోనా కారణంగా జరగలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. మూడేండ్ల తర్వాత జీవో జారీ చేసిన తేదీ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో కృతజ్ఞతా సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ 17కులాల కింద రాష్ట్రంలో సుమారు 2 లక్షల జనాభా ఉండటంతో వీరి ప్రభావం 40 స్థానాలపై ఉందని తెలుస్తోంది. ఈ కులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతోనే న్యాయం జరుగుతుందని కులాల ప్రతినిధులు ఆశిస్తున్నారు.



ఐక్యతతో కృతజ్ఞతా సభను విజయవంతం చేస్తాం..

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, దశాబ్దల అలుపెరగని ప్రయత్నాలతో రాష్ట్ర ప్రభుత్వం తమ కులాలకు గుర్తింపు ఇచ్చి ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. దానికి కృతజ్ఞతగా హైదరాబాద్‌లో 17 కులాల ప్రతినిధుల ఐక్యతతో సభను ఏర్పాటుచేస్తున్నాం. దాన్ని విజయవంతం చేసి తమ న్యాయమైన కోరికలను సాధించుకునే దిశగా ముందడుగు వేస్తాం.


జాదవ్ శరత్, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నవీపేట్, నిజామాబాద్ జిల్లా

సామాజిక న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం



రాష్ట్ర ప్రభుత్వంతోనే తమకు విద్య, ఉపాధి, సామాజిక న్యాయం లభిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ప్రత్యేక పథకాలతో అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నాం.

కొంగల రాంప్రసాద్, కరీంనగర్



స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినం

లక్ష రూపాయల ఆర్థిక సహకారం లో ఎంపికైనప్పటికీ కులవృత్తుల జాబితాలో కులం పేరు లేదని శాంక్షన్ అయిన చెక్కును పక్కన పెట్టారు. ఈ విషయాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు న్యాయం జరగలేదు. దశాబ్దాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న మాలాంటి సంచార కులాలకు ప్రభుత్వ పెద్దలే న్యాయం చేయాలి.

రాస్మతి నగేష్, బైలు కమ్మర(గిసాడి), జాకోర, బాన్సువాడ

చంద్రయాన్ 3 ల్యాండింగ్ వీక్షించిన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చంద్రయాన్ 3 ల్యాండింగ్ బిర్లా ప్లానిటోరియం ప్రత్యక్ష ప్రసారం ద్వారా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది దేశమంతా కలిసి హర్షించదగ్గ ఘడియలని తెలిపారు. ప్రధాని మోడీకి, ఇస్రో టీంకు, ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

ఒసీఐ సదస్సు ప్రారంభం

హైదరాబాద్ :ఒసియన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎనిమిదవ జాతీయ సదస్సు హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)లో ప్రారంభమైంది. శాస్త్రీయ విజ్ఞానంపై అందరికి అవగాహన కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఇన్‌కాయిస్ వర్గాలు తెలిపాయి.

ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు సిఆర్ రావు కన్నుమూత



వాషింగ్టన్ : భారత్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త కల్యంపూడి రాధాకృష్ణారావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో బుధవారం తుదిశ్వాస విడిచారు. గణిత శాస్త్రంలో అందించిన సేవలకు గానూ స్టాటిస్టిక్స్ రంగంలో అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. భారత్ ప్రభుత్వం ఆయన్ను పద్మ విభూషణ్‌తో సత్కరించింది.

సిఆర్ రావు 1920 సెప్టెంబరు 10న బళ్లారి జిల్లా హడగళిలో తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నూజివీడు, నందిగామలో ఆయన బాల్యం గడిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సి గణితం చేసిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఎ స్టాటిస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని కింగ్స్ కాలేజీలో 1948లో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టరుగా ఎదిగారు. ఆయన 2020 సెప్టెంబరు 10న వందో పుట్టినరోజు జరుపుకున్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరుగా పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు.

సిఆర్ రావు తన పరిశోధనలో భాగంగా 1945లో మూడు ప్రాథమిక ఫలితాలను విశ్లేషించారు. ఇవి ఆధునిక గణాంక విధానానికి మార్గం సుగమం చేయడంతోపాటు సైన్స్‌లో ఈ గణాంక టూల్స్‌ను భారీగా వాడటానికి ఉపయోగపడ్డాయి. ఈ మూడింటిలో మొదటిది.. క్రామెర్-రావు లోయర్ బౌండ్. ఇది గణాంక పరిమాణాన్ని అంచనా వేయడంలో అత్యుత్తమ విధానాన్ని సూచించింది. రెండవది రావు-బ్లాక్‌వెల్ సిద్ధాంతం. ఒక అంచనాను మెరుగైనదిగా మార్చడానికి ఉపయోగపడుతుంది. మూడోది సమాచార జామెట్రీ విస్తృతికి కొత్త ఇంటర్ డిసిప్లినరీ ఫీల్డ్ అభివృద్ధి. ఇది డేటా నుంచి సమాచారాన్ని మరింత సమర్థవంతంగా సేకరించేందుకు సహాయపడుతుంది.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బాధిత కుటుంబాలకు మీడియా అకాడమీ చేయూత

నవతెలంగాణ-హైదరాబాద్

కుటుంబంలో అండగా ఉన్న మనిషిని కోల్పోవడం చాలా బాధాకరమని రాష్ట్ర ఎక్సైజ్ , టూరిజం శాఖామాత్యులు డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు చనిపోవడం , వారి కుటుంబాలను ఒకే చోట చూడటం ఆవేదన కలిగిస్తున్నదని చెప్పారు. మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమం కోసం అందజేసే ఆర్థిక సహాయానికై ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. . కష్ట కాలంలో కుటుంబానికి కావాల్సింది ఒక పలకరింపు, మీకు మేము ఉన్నామనే భరోసా, దాన్ని అకాడమీ ఇవ్వడం చాలా గొప్ప సహాయమన్నారు. అచ్చంపేట జర్నలిస్టు చికిత్స కోసం, ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద రూ. 40 లక్షలు ఆర్థిక సాయం చేసిన విషయం గుర్తు చేశారు. సందర్భంగా మంత్రి జర్నలిస్టుల కుటుంబాల కోసం, అకాడమీ చేసిన గుర్తింపు కార్డును ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్ర మాలు చేపట్టిందన్నారు. 2015లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రెస్ అకాడమీ సందర్శించి ఐదు గంటలు నిశితంగా చర్చించి, కార్యక్ర మాలు ఎలా ఉండాలో, దిశా నిర్దేశం చేశారని అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి రూ. 100 కోట్ల నిధిని ఏర్పాటుచేయాలని సూచించారు. వెంటనే 10 కోట్లు విడుదల చేశారు. గత ఎనిమిది ఏండ్లలో ప్రభుత్వం రూ. 42 కోట్లు విడుదల చేసింది. మీడియా అకాడమీ ఈ మొత్తాన్ని జాతీయ బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి దానిపై వచ్చిన వడ్డీతో జర్నలిస్టు సంక్షేమానికి కషి చేస్తున్నది. దీనిలో భాగంగా చనిపోయిన జర్నలిస్ట్ కుటుంబానికి లక్ష రూపాయలు, మూడు వేల రూపాయలు నెలవారి పెన్షన్ అందజేస్తున్నామని, వారి కుటుంబంలో ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు చదువుకునే పిల్లలకు ట్యూషన్ ఫీజు కోసం ప్రతి నెలా రూ. 1000 ఆర్థిక సాయం చేస్తున్నామని అన్నారు. అనా రోగ్యం లేదా ప్రమాద బారిన పడి, పని చేసుకోలేని నిస్సహాయ జర్నలిస్టులకు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజే స్తున్నదని తెలిపారు. కార్యక్రమ ంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సమా చార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమం అంటే ఎస్సి, ఎస్టీ ,బీసీ, మైనార్టీ కోసం చేసే కార్యక్రమాలని అనుకున్నానని అన్నారు, ఈరోజు మీడియా అకాడమీ ద్వారా ప్రభుత్వం చేస్తున్నజర్నలిస్టుల సంక్షేమం కార్యక్రమం ఇంత ప్రభావి తంగా ఉంటుందన్న విషయం ఈ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత తెలిసింద న్నారు. జర్నలిస్టు కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం క్రింద రూ. 3.5 కోట్లు, సీ ఎం ఆర్ ఎఫ్ ద్వారా రూ.2.5 కోట్లు సహా యం అందించిందని అన్నారు. జర్నలి స్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి మరో రూ. 10 నుంచి 15 కోట్లు కేటాయించ డానికి తన వంతు కషి చేస్తానని హామీఇచ్చారు. సమాచార పౌర సంబం ధాలశాఖ అదనపు సంచాల కులు కిషోర్ బాబు, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర రావు, మేనేజర్ పీసీ వెంకటేశం జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

బహుజనులు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్పీ

- ఎన్నికల్లో ఆధిపత్య పార్టీలతో పోటీపడి గెలవాలి
- భావసారూప్యత పార్టీలతో పొత్తుకు సిద్ధం
- కాంమేడ్లు కలిసి వస్తే పొత్తులపై ఆలోచిస్తామని ప్రకటన
- బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి, ఆధిపత్య కుల పార్టీల్లో జెండాలు మోసే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి బీఎస్పీలో చేరాలి' అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్పీ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుండాల మదన్‌కుమార్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బుధవారం బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆధిపత్య పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు జనాభాలో సింహ భాగం కలిగిన బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో, సంపదలో భాగస్వామ్యం చేయడంలో వివక్ష చూపుతున్నాయి. 99 శాతం ఉన్న బహుజనులు ఆధిపత్య వర్గాల పాలనలో తీవ్రంగా నష్టపోతున్నారు. సంపద, అధికారం కేవలం ఒక్క శాతం ఉన్న వర్గాల చేతుల్లోనే ఉంది. తెలంగాణలో 139 బీసీ కులాలకు కేవలం ఆరు కులాలకు మాత్రమే అసెంబ్లీ సీట్లు కేటాయించడం అన్యాయం. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ కేవలం 23 అసెంబ్లీ సీట్లు కేటాయించడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనం. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ బీసీలకు 60 సీట్లు కేటాయిస్తుంది. 5 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి బీఆర్ఎస్ పార్టీ 40 సీట్లు, ఒక్క శాతం కూడా లేని వెలమ సామాజిక వర్గానికి 11 అసెంబ్లీ సీట్లు కేటాయించడం ఏ రకమైన ప్రజాస్వామ్యం. మాజీ మంత్రి తాటికొండ రాజయ్య అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కన్నీళు పెట్టుకోవడం విచారకరం. ఆధిపత్య పార్టీల్లో పనిచేసే ఏ నాయకునికైనా రాబోయే రోజుల్లో ఇదే గతి పడుతుంది' అని అన్నారు. హైదరాబాద్ నగరంలో బస్సుకోసం అర్ధరాత్రి రోడ్డుపై నిలబడితే గిరిజన మహిళ లక్ష్మిని ఎల్బీనగర్ పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగించి, లాఠీలతో చితకబాదారన్నారు. లక్ష్మీబాయి గిరిజన మహిళని ఎమ్మెల్యేలెవరూ స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కూతురు కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో రూ.100 కోట్లు ముడుపులు చెల్లిస్తే ఈడీ అధికారులు ఆమె ఇంటికి వెళ్లి రాచమర్యాదలతో విచారించారని ఆరోపించారు.బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందం కుదిరిందన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అగౌరవపరుస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు నిజాయితీగా రాసే జర్నలిస్టులను బెదిరించి, వారిని భయభ్రాంతులకు గురిచేయడమేనని విమర్శించారు. భావసారూప్యత పార్టీలతో పొత్తుకు సిద్ధమని, కామ్రేడ్లు కలిసి వస్తే పొత్తులపై ఆలోచిస్తామని ప్రకటించారు.

పదేండ్లుగా మెజార్టీ ఉన్నా మహిళా బిల్లు ఎందుకు పెట్టలేదు

బీజేపీ సర్కార్‌పై కవిత ఫైర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



పదేండ్లుగా పూర్తి మెజార్టీ ఉన్నా మహిళా బిల్లు ఎందుకు పెట్టలేదని కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేస్తేనే చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. మహిళల హక్కులపై కాంగ్రెస్, బీజేపీ దొందు దొందేనని, ఆ రెండు పార్టీల వైఖరి ఒకటేనని మండిపడ్డారు. 2010 రాజ్యసభలో మహిళా బిల్లు ఆమోదించిన కాంగ్రెస్ పార్టీ 2014 వరకు అధికారంలో ఉన్న కూడా లోక్‌సభలో ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. పదేండ్ల కాలంలో మహిళా బిల్లుపై ప్రధాని నరేంద్ర మోడీని సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ ఎందుకు నిలదీయలేదని అడిగారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మరోసారి తాను జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తాననీ, ఆ ధర్నాకు సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలను ఆహ్వానిస్తానని ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మహిళా బిల్లు కోసం తాను ధర్నా చేసిన సమయంలో స్పందించని పార్టీలు, నాయకులు ప్రస్తుతం స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కానీ ఆ రాజకీయ పార్టీలు మహిళా బిల్లుపై శ్రద్ధ చూపించడం లేదని, మొన్నటితో స్పష్టమైందని చెప్పారు.

తనది వ్యక్తిగత పోరాటం కాదని, 140 కోట్ల మంది జనాభాలో 70 కోట్ల మంది ఆడబిడ్డలు ఉన్నారని, వారి భవిష్యత్తు ఏంటన్నది ప్రశ్నార్థకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడు మహిళలు రాజకీయ ప్రక్రియలో పెద్ద ఎత్తున పాల్గొన్నారని, ఇవాళ దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో 14 లక్షలకుపైగా మహిళా ప్రజాప్రతినిధులున్నారని ప్రస్తావించారు. అసెంబ్లీ, పార్లమెంటులో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎంత కాలం మహిళలు జడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా ఉండాలని ఆందోళన వ్యక్తంచేశారు.

మహిళా రిజర్వేషన్ల కోసం, మహిళలకు ఆస్తి హక్కు కోసం అంబేద్కర్ పోరాటం చేసినప్పుడు అవహేళన చేశారనీ, రాజీనామా చేసే పరిస్థితులు కల్పించారని, మహిళా హక్కుల గురించి మాట్లాడినప్పుడు ఎంత వ్యతిరేకత ఉంటుందన్నది కొత్త అంశంకాదని గుర్తుచేశారు. కానీ ఇప్పటికీ పార్టీలు సంకుచితంగా ఆలోచించడం, మరీ ముఖ్యంగా మహిళా నేతలు మాట్లాడటం శోచనీయమన్నారు.

గ్రౌండ్ వర్క్ ఎంతో ముఖ్యం : ఫిజికల్ డైరెక్టర్ నందు నాయక్



నవతెలంగాణ-చైతన్యపురి

ఎస్ఐ జాబ్ సాధించాలంటే నిరంతరం చదువుతోపాటు గ్రౌండ్ వర్కౌట్ కూడా ఎంతో ముఖ్యం అని ఫిజికల్ డైరెక్టర్ నందు నాయక్ అన్నారు. నందు ఆర్మీ అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థిని నవిత ఎస్ఐగా సెలెక్ట్ అవడంతో బుధవారం నందు నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ తమ అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థి, విద్యార్థులు ఎంతో మంది కేంద్ర, రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఉద్యోగాలను సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. నందు ఆర్మీ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల సమక్షంలో ఎస్ఐగా సెలెక్ట్ అయిన నవితను నందు ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందులాల్ సన్మానించారని తెలిపారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి అభినందనలు



నవతెలంగాణ -సంతోష్ నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డిని బుధవారం సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సైనికుల లాగా పనిచేయాలని కోరారు. అభినందించిన వారిలో డివిజన్ నియోజకవర్గం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, తదితరులు ఉన్నారు.

'మైనర్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలి'



నవతెలంగాణ - హస్తినాపురం

మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, ఐద్వా మహిళా సంఘాలు, సీపీఐ(ఎం) పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నందనవనంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు అవుతున్న నేటికీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15న ఎల్బీనగర్ లో రాత్రి బస్ కోసం ఎదురు చూస్తున్న గిరిజన మహిళను పోలీసులు చిత్రహింసలకు గురి చేసిన ఘటన మరువకముందే ఇలాం టి ఘటనలు జరగడం దారుణం అని అన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యేలు స్పందించి.. సీఎం దృష్టికి తీసుకెళ్లి, బాధితుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు, మూడెకరాల భూమి ఇప్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రజా, దళిత సంఘాలను కలుపుకొని ఆందోళన, పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసనలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మనోహర్, ఎమ్మార్పీఎస్ నాయకులు జీడి నరసింహ, ముత్యాలు ,మాల మహానాడు గద్ద శీను, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ, జయమ్మ కమార్, సంధ్య, సీపీఐ(ఎం) నాయకులు రవీందర్, యాదయ్య, సుజన్, రాధమ్మ, నరసమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు



- చైర్మెన్ కాచం సత్యనారాయణ గుప్త

నవతెలంగాణ - చైతన్యపురి

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. షాద్ నగర్ వైశ్య కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వలన పిల్లల్ని చదివించలేక పోతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాచం సత్యనారాయణ గుప్తా..శ్రీనివాస్ కూతురు మౌనిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు గాను పదివేల రూపాయలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేదరికంతో ఎవరు చదువును మధ్యలో ఆపేయొద్దని ఉద్దేశంతో ఆ విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 450 మార్కులు సాధించిందని తెలిపారు. వైశ్య వికాస వేదిక నుండి ఎంతోమంది పేద విద్యార్థిని, విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్‌లో కూడా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి రమేష్, రాంబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- సీఐ జలంధర్ రెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

బహిరంగ ప్రదేశాలు, పార్కుల్లో, కారు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి మద్యం సేవిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ జలంధర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాత్రి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న యువకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ చైతన్య నగర్‌కు చెందిన అశోక్ ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి టీవీ కాలనీలో కారులో వెళుతున్న ఎస్ కేడీ నగర్‌కు చెందిన గునుకొండ రామదాసు, బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన మాచర్ల మల్లేష్‌లు అతిగా మద్యం సేవించారు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతున్న కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు అప్పుడే వచ్చిన పోలీసులపై వాదనకు చేయటంతో వారి ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలియజేశారు.

దాతృత్వం ముసుగులో భిక్షాటన

- అమ్మ చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడితో సహా 10 మంది అరెస్టు



నవతెలంగాణ - సంతోష్ నగర్

దాతృత్వం ముసుగులో భిక్షాటన చేస్తున్న బెగ్గింగ్ మాఫియా ముఠాను మలక్ పేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ ఏవీఆర్ నర్సింహారావు, మలక్ పేట ఏసీపీ జి.శ్యాంసుందర్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చిట్టి బుర్ర, మలక్ పేట ఇన్ స్పెక్టర్ జి.శ్రీనివాస్, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఎస్.జయరామ్‌లతో కలిసి సౌత్ ఈస్ట్ డీసీపీ చెన్నూర్ రూపేశ్ వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన కేతావత్ రవి, కేతా వత్ మంగు అన్న దమ్ములు.. వీళ్ల మీర్‌పేటలో ఆటో డ్రైవ ర్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూ ర్ కు చెందిన గడ్డి గణేశ్ ఎల్బీనగర్ మన్సూరాబాద్ లో కామినేని ఆస్పత్రి వెనుక ప్రాంతంలో 'అమ్మ చేయూత ఫౌం డేషన్' పేరిట స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్నాడు. రవి, మంగు, గణేశ్‌లు కలిసి కలెక్షన్ బాక్సులు, గుర్తింపు కార్డులు, విజిటింగ్ కార్డులు తయారు చేశారు. ప్రతి కలెక్షన్ బాక్సుకు నెలకు రూ.2వేలు చొప్పున ఇవ్వాలని ఒప్పందం కుదుర్చు కున్నారు. అన్నదమ్ములు కలెక్షన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ భిక్షాటనకు 18-28 ఏళ్ల నిరుద్యోగులు, విద్యార్థులు, మహి ళలను నియమించుకున్నారు. వసూలైన మొత్తంలో 35 శాతం భిక్షాటన చేసిన వారికి ఇచ్చేవారు. ఇలా భిక్షాటన ముసుగులో చాలా సంపాదించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడితో సహా 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 1,38,262 నగదు, రూ.80లక్షల విలువైన స్థిరాస్తి పత్రాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

బీసీ బంధు పేదలకు వరం



సర్పంచ్ తుడుం మల్లేష్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

బీసీ బంధు పేదలకు ఓ వరం అని..ఇలాంటి పథకాలు దేశంలో ఎక్కడా లేవని గౌరెల్లి గ్రామ సర్పంచ్ తుడుం మల్లేష్ అన్నారు. గౌరెల్లి గ్రామానికి చెందిన బీసీ బంధు లబ్దిదారులు వట్టిపల్లి కృష్ణ, జక్కు కీర్తన, వేముల రమేష్ బాబు, సంపంగి యాదగిరి, రాజేష్ చారీలకు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీసీ బంధు పథకం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరాల జల్లులు కురిపిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డిల సహకారంతో గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, నాయకులు నిరుడు యాదగిరి, వేముల వెంకటేష్, రంగ శ్రీనివాస్, దోటి శంకర్ గ్యార వినోద్ కుమార్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

'పేదల పెన్నిధి సీఎంఆర్ఎఫ్'



నవతెలంగాణ - బడంగ్ పేట్

పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి పథకం అని మామిడిపల్లి శ్రీ వేంకటేశ్వర దేవాలయ మాజీ చైర్మన్ గోపాల్ యాదవ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి గ్రామానికి చెందిన ఈసంపల్లి అంజయ్యకు సీఎం సహాయ నిధి పథకం కింద రూ.60 వేలు విలువ గల చెక్కు మంజూరైంది. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం బుధవారం మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్ ఆ చెక్కును లబ్ధిదారుడి భార్య ఈసంపల్లి అండాలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు యాతం బాల్ రాజ్ యాదవ్, కిరణ్ కుమార్ ముదిరాజ్, బాలాజీ టెంపుల్ డైరెక్టర్ అశోక్ ముదిరాజ్, ఈసంపల్లి శంకర్, మంఖాల శ్రీశైలం, నాగరాజు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు



కౌన్సిలర్ ఓరుగంటి సుజాత

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

దశల వారీగా వార్డు అభివృద్ధి పనులు చేపడుతామని 21వ వార్డు కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్ గౌడ్ అన్నారు. పలు అభివృద్ధి పనులను బుధవారం చైర్ పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డిలతో కలిసి కౌన్సిలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సుజాత కిషన్ గౌడ్ మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలోని శ్రీపాదనగర్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీలో రూ.60 లక్షల నిధులతో రోడ్ నెం. 2, 3 ,4 లో సీసీ రోడ్లు, రోడ్డు నెం.5 లో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి..మౌలిక సదుపాయాల కల్పనకు, వార్డు సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు, పెద్ద అంబర్ పేట మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షులు ఓరుగంటి కొండల్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, కాలనీ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని దరఖాస్తు



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిం చాలని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి. కుమార్ రావుకు ఎల్మేటి అమరేందర్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, బొల్లు కిషన్, నగేష్ ముదిరాజ్, సెక్రటరీలు శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, జల్ పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, వంగేటి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ సరికొత్త చరిత్రను సువర్ణ అక్షరాలతో లిఖించింది

- బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

చందమామపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతం కావడం, భారత్ సరికొత్త చరిత్రను సువర్ణ అక్షరాలతో లిఖించిందని బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ అవతరించిందని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, చైనా, రష్యాలకు సైతం సాధ్యం కాని ప్రయోగాన్ని విజయవంతం చేసి ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. యావత్ భారతావని ఆకాంక్షలను నెరవేర్చిన ఇస్రో శాస్త్రవేత్తలకు, ఇందు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా గణాంక దర్శిని విడుదల చేసిన అర్థగణాంక శాఖ డైరెక్టర్ దయానందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని అర్థగణాంక శాఖ సంచాలకులు దయానందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బిజినెస్ రిజిస్టర్ అప్‌డేషన్ గురించి సూచనలు చేయడంతో పాటు హైదరాబాద్ జిల్లా గణాంక దర్శిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అర్థ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సురభి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్(ఈడీపీ), జాయింట్ డైరెక్టర్, సీపీవో డాక్టర్ ఎస్.సురేందర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ అసెంబ్లీ స్థానం గంగపుత్రులకు కేటాయించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిసిన నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గ స్థానాన్ని గంగాపుత్రులకు కేటాయించాలని గంగపుత్ర తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిశారు. కార్వాన్ అసెంబ్లీ సీట్‌ని బీజేపీ సీనియర్ నాయకులు గూడబోయిన రత్నంకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, ఉపాధ్యక్షులు గూడబోయిన శివ రత్నం, ఆర్కే భగవాన్, ప్రధాన కార్యదర్శి శరణార్థి చంద్రప్రకాష్, సహాయ కార్యదర్శి శంకర్, కట్ట నర్సింగ్, నిరంజన్ బాబు, బాధరాజ్ కుమార్, యువజన సంఘం అధ్యక్షులు అంబటి సుధాకర్, సికె.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ కొట్టు.. గిఫ్ట్ పట్టు..

- సైబర్ నేరగాళ్ల సరికొత్త మోసాలు



నవతెలంగాణ-హయత్ నగర్

యాప్‌ల ద్వారా యూరప్ నుండి గిఫ్ట్ వచ్చింది.. అది కావాలంటే అడ్వాన్స్ నగదు చెల్లించాలంటూ సైబర్ నేరగళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. అలా మోసాలు చేస్తున్న ఇద్దరు నైజీరియాన్లను రాచకొండ సైబర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ, మల్కాజిగిరి ఎస్‌వోటీ డీసీపీ గిరిధర్ రావులు నిందితుల వివరాలను వెల్లడించారు. నైజీరియా నుండి ఇండియాకి వచ్చిన ఓ గ్యాంగ్ సోషల్ మీడియాను వేదికగా సైబర్ నేరాలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. నైజీరియాకు చెందిన సిల్వెస్టార్, అలిమేక్ ఎందురన్స్ చువ్వక్కులు సైబర్ యాప్ ల ద్వారా యూరప్ నుండి గిఫ్ట్ వచ్చిందని.. అది మీకు దక్కాలి అంటే అడ్వాన్స్ గా నగదు చెల్లించాలని అమాయకులను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. వీరు యూరోపియన్ లాగా ఫేక్ ఐడీలతో యూరప్‌లో ఉన్నట్లు ప్రొఫైల్స్ పెట్టి..ఫ్రెండ్ షిప్ చేసి గిఫ్ట్ పేర్లతో మోసాలు చేస్తున్నారు. ఓ మహిళ నుండి రూ.3లక్షలా 63వేలు వసూలు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి ఆరు సెల్ ఫోన్లు, రెండు పాస్ పోర్ట్స్, రూ.1,78వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

లోన్ యాప్ క్లిక్ చేశారా.. ఇంకా అంతే..



లోన్ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు సైబర్ నేరగాళ్లను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన అశుతోష్ మిశ్రా, లవ్ మీత్ సైనీ, ప్రశాంత్ కుమార్ తన్ వార్, ప్రిన్స్ పాల్ వికాస్ శర్మాలు ఏజెంట్ లా వ్యవహరించారు. లోన్ యాప్ ద్వారా వారికి చైనాకు చెందిన జీనా అనే మహిళ అడక్కుండానే రుణాలు ఇచ్చి.. ఒక వారం దాటాక అధికంగా డబ్బులు వసూలు చేస్తుంది. ఈ యాప్‌పై రెండు నెలలుగా నిఘా పెట్టి లోన్ యాప్ ముఠాను అరెస్ట్ చేశారు. చిన్న చిన్న అమౌంట్‌లకు లోన్ యాప్‌లో డబ్బులు తీసుకొని చాలా మంది మోసపోతున్నారు. లోన్ యాప్ డౌన్ లోడ్ చేసుకొనే సమయంలో మీ మొబైల్ కాంటెక్ట్, గ్యాలరీ ఉన్న ఫొటోస్ అన్ని సైబర్ నేరగాళ్ల చేతిలోకి పోతాయని పోలీసులు తెలిపారు. డబ్బులు కట్టని పరిస్థితుల్లో బాధితుల ఫొటోస్ మార్ఫింగ్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. చైనాకి చెందిన మహిళ ఈ నెట్ వర్క్‌ను నడుపుతోంది. నిరుద్యోగులు, విద్యార్థులను టార్గెట్ చేసి వారికి లోన్ ఇచ్చి ఈ ఐదుగురితో డబ్బులు రికవరీ చేయాలని టాస్క్ ఇస్తుంది. రికవరీకి 20 శాతం ఇస్తానని చెప్పి రోజుకు 50 నుండి 60 కేసులను వారికి అప్పగిస్తుంది. అలా నియమించుకున్న వారితో లోన్ యాప్ తీసుకున్న వారిని బ్లాక్ మెయిల్ చేసే విధంగా టాస్క్ లు చేస్తున్నారు. భాదితులు ఫొటోస్ మార్ఫింగ్ చేసి, కాంటెక్ట్ లిస్ట్ లో ఉన్న వారికి పంపుతున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. దీంతో టెలికాలర్లుకు జీనా నుండి వచ్చిన సమాచారం మొత్తం సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మూడు లాప్ టాప్ లు, 6 మొబైల్ ఫోన్లు, 18 సిమ్ కార్డులు, డెబిట్ కార్డు, లక్ష యాభై వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి లోన్ యాప్ లను డౌన్ లోడ్ చేసుకోకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇందులో 78 మంది బాధితులను గుర్తించినట్టు తెలిపారు.

మంత్రిని కలిసిన బాలేష్ చారి, రైతు సంఘం సభ్యులు



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే.. ఈ మేరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈశ్వరోజు బాలేష్ చారి బుధవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి విజయం సాధించడం ఖాయమని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, విశాల్ తదితరులు ఉన్నారు.

రైతులకు రుణమాఫీ చేయడం హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని బుధవారం మంత్రి నివాసంలో నాదర్ గుల్ గ్రామంలోని భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కలసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు రుణమాఫీ పథకం కింద 70,54,000 రూపాయలను 120 మంది రైతులకు అకౌంట్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో భాగ్యనగర్ బ్యాంక్ చైర్మన్ మరి నర్సింహారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు ఎల్బల సుదర్శన్ రెడ్డి, చిగురింత నరసింహారెడ్డి, చప్పిడి కొండల్ రెడ్డి ఉన్నారు.

డిప్యూటీ మేయర్‌కు పితృ వియోగం



నవతెలంగాణ-మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి తండ్రి తీగల సత్యనారాయణ రెడ్డి గుండెపోటుతో మరణించారు. తీగల సత్యనారాయణ రెడ్డి జిల్లెలగూడ సర్పంచ్‌గా పని చేశారు. సత్యనారాయణ రెడ్డి మృతి పట్ల విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మీర్‌పేట్‌లో సత్యనారాయణ రెడ్డి భౌతిక కాయానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

గంజాయి స్మగ్లర్స్ అరెస్ట్...

- 100 కేజీల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ - హయత్ నగర్

ఒడిస్సా నుండి మహారాష్ట్రకు పొడి గంజాయిని సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌ను మల్కాజిగిరి ఎస్‌వోటీ, కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి ఎస్‌వోటీ డీసీపీ గిరిధర్ రావు నిందితుల వివరాలను వెల్లడించారు. ఒడిస్సాకు చెందిన భువన్ సబీర్, వరుణ్ కుమార్‌లు గంజాయిని సప్లై చేస్తున్నారు. వైజాగ్ కు చెందిన సురేష్, మహారాష్ట్ర కు చెందిన చోటు వారి వద్ద గంజాయి కొనుగులు చేసి సప్లై చేసేవారు. ఈ క్రమంలోనే క్రీటా కార్‌లో 100కేజీల గంజాయిని వైజాగ్ నుండి పూణేకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు కీసర ఓఆర్ఆర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో క్రీటా కారును ఆపి తనిఖీ చేయగా.. అందులో 100కేజీల గంజాయిని గుర్తించారు. దాంతో భువన్ సబీర్, వరుణ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొత్తం విలువ రూ.36లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వైజాగ్ కు చెందిన సురేష్, మహారాష్ట్ర కు చెందిన చోటులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చదువుతో ఏదైనా సాధించవచ్చు

- మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్
- స్కూలుకు 50 బెంచిలు విరాళం అందజేసిన రోటరీ క్లబ్



నవ తెలంగాణ-శామీర్‌పేట

చదువుతో ఏదైనా సాధించవచ్చని, శ్రద్ధగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ బి. చంద్రశేఖర్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు బుధవారం ప్రవీణ్ జైన్, శ్రీనివాస్ జీ సౌజన్యంతో రోటరీ క్లబ్ సికింద్రాబాద్ వారు 50 నూతన బెంచిలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వినోద్ జైన్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, కౌన్సిలర్ రాజు యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాగారం నేతలు



నవతెలంగాణ-కీసర

బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డిని సీఎం కేసీఆర్ మరోమారు ప్రకటించడంతో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు ,పార్టీ నాయకులు పెద్ద ఎత్తున్న మంత్రి నివాసానికి వెళ్లి మంత్రిని గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కషి చేయాలన్నారు. వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ ,కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , బీఅర్ఎస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాయకులు గూడూరు అంజనేయులు గౌడ్, గండి అంజయ్య గౌడ్, వరకల పెంటయ్య గౌడ్, నిమ్మల శ్రీనివాస్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ ,సుధాకర్ రెడ్డి , కౌకుంట్ల రాహుల్ రెడ్డి , శ్రీకాంత్ ,వామన్ ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

- ప్రొటోకాల్ పాటించడం లేదని, ఎమ్మెల్యేల పెత్తనం ఎక్కువైందన్న కార్పొరేటర్లు
- మేయర్‌పై ప్రతిపక్షాల మండిపాటు
- ఛాంబర్ ముందు కార్పొరేటర్లను అడ్డుకున్న పోలీసులు
- పలువురు కార్పొరేటర్లు అరెస్టు





నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం బుధవారం రసాభాసగా మారి అర్ధాంతరంగా ముగిసింది. ముందుగా 7వ కౌన్సిల్ సమావేశం మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభమైంది. అయితే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య పోటాపోటీ వాగ్వాదం నెలకొంది. ఒకరిపై ఒకరు తీవ్ర వ్యాఖ్యలు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష కార్పొరేటర్లను మేయర్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదిలాఉండగా ప్రత్యేక తీర్మానం ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం చేయాలని ప్రతిపక్ష కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఇంకా చర్చించాల్సి అంశాలు ఎన్నో ఉన్నాయని కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు పట్టుబడిట్టినా కౌన్సిల్ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు. అంతకుముందు బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూధన్ రెడ్డి, బీ.ఆర్.ఎస్ నుంచి మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, ఎం.ఐ.ఎం నుండి సలీం బేగ్, కాంగ్రెస్ నుంచి విజయారెడ్డి మాట్లాడారు.

70శాతం పనులు పూర్తి....

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మొట్టమొదటగా సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ఎన్ని స్లిప్, మిస్సింగ్ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రశ్నించగా దీనికి ప్రాజెక్ట్ సి.ఇ దేవానంద్ సమాధానం ఇస్తూ మిస్సింగ్ లింక్ ప్రాజెక్ట్ మొదటి దశలో రూ. 275.53 కోట్ల వ్యయంతో 22 పనులు చేపట్టగా 24.301 కిలోమీటర్ల పొడవు రోడ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. రెండో దశలో రూ. 216.79 కోట్ల వ్యయంతో 20.57 కిలోమీటర్ల పొడవు చేపట్టుటకు 13 పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నాయని తెలిపారు. మూడో దశలో రూ. 2410 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనుమతి లభించిందని, అందులో రూ. 1500 కోట్లతో 50 ప్రాధాన్యత రోడ్లను ప్రభుత్వం చేపట్టుటకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఎస్.ఆర్.డీ.పీ. ద్వారా 48 పనులలో 36 పనులు పూర్తయ్యాయని, ఇంకా 12 పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇ.ఎస్.సి జియా ఉద్దీన్ మాట్లాడుతూ సీ.ఆర్.ఎం.పీ ద్వారా 812 కిలోమీటర్ల పొడవు గల రోడ్డును 7 ప్యాకేజీలుగా చేపట్టడం జరిగిందని, అందులో 777.77 కిలోమీటర్ల రోడ్డును రీ కార్పెటింగ్ చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా 103 కిలోమీటర్ల పొడవు ఫుట్ పాత్ నిర్మించడం జరిగిందని తెలిపారు. నగరంలో వరదల నష్టాన్ని నివారించేందుకు ఎస్.ఎన్.డి.పి కార్యక్రమాన్ని 985 కోట్ల వ్యయంతో జీహెచ్ఎంసీ దాని చుట్టూ ఉన్న మున్సిపాల్టీలలో 57 పనులను చేపట్టడం జరిగిందని, జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 734 కోట్లతో 35 పనులు చేపట్టగా ఇప్పటి వరకు 25 పనులు పూర్తయ్యా యని, 5 పనులు త్వరలో పూర్తి అవుతాయని, మిగతా పనులు వివిధ సమస్యల వలన పనులు ప్రారంభించడం జాప్యం జరిగిందని తెలిపారు. ఈ వర్షాకాలంలో ఎస్.ఎన్. డీ.పీ ద్వారా చేపట్టిన పనుల మూలంగా 150 కాలనీలు వరద ముంపు లేకుండా చేయడమే కాకుండా 6,50,000 మంది ప్రయోజనం పొందారని, రెండో దశ ఎస్.ఎన్.డీ.పీ. కార్యక్రమం రూ. 2,141 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు.

కొత్త కాంట్రాక్టర్లను ప్రొత్సాహించాలి: కార్పొరేటర్లు

చేపట్టిన పనులు పూర్తిచేయాలని, సమస్యలను పర్కిషరించాలని పాత కాంట్రాకర్లను వేడుకోవాల్సి వస్తుందని, అయినా వారు స్పందించడం లేదని, కనీసం కార్పొరేటర్ల ఫోన్లు కూడా ఎత్తుడం లేదని పలువురు కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త కాంట్రాక్టర్లను ప్రొత్సాహించాలని కోరారు. కొత్త కాంట్రాక్టర్లకు ప్రస్తుతం రూ.5లక్ష రూపాయల కాంట్రాక్టు పనులను మాత్రమే అప్పగిస్తున్నారని, రూ.50లక్షల విలువగల కాంట్రాక్టు పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన సీఇ జీయాయోద్దీన్ నియమనిబంధనల ప్రకారమే, జీఓ ప్రకారం పనులను కేటాయిస్తున్నామని తెలిపారు.

వారిపై చర్యలు తప్పవు

అన్ని డివిజన్లలో వీధి దీపాల నిర్వహణ, మేయింటనెన్స్ సరిగాలేదని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. చార్మినార్, పాతబస్తీల్లో ఉదయం పూట లైట్లు వెలుగుతున్నాయని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సదురు కాంట్రాక్టర్‌ను కోరినా పట్టించుకోవడం లేదని కార్పొరేట్లర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన కమిషనర్ కాలనీల్లో వీధి దీపాలను సబ్ కాంట్రాక్టర్లు సరిగా ఏర్పాటు చేయకపోతే వారిపై చర్యలు ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ హెచ్చరిం చారు. ఈఎస్ఎస్ఎల్ సంస్థ వీధి దీపాల నిర్వహణ, స్ట్రీట్‌లైట్స్ మేయింటనెన్స్ చేస్తుందన్నారు. నగరంలో 5,26,136 లైట్ల కనెక్షన్లున్నాయని తెలిపారు. స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా స్థానిక కార్పొరేటర్‌ను సంప్రదిం చాలని వారితో సమన్వయం చేసుకోవాలని ఏఈ, డీసీలకు ఆదేశాలు జారీచేసినట్టు కమిషనర్ వివరించారు. ప్రతిరోజు వెయ్యి నుంచి 1500 ఫిర్యాదులు ఆయా కాలనీల నుంచి అందుతున్నట్లు చెప్పారు. గడిచిన వారంలో 60 వేల లైట్లు బిగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా ఆ సంఖ్య పెంచాలన్నారు. ఒక లైటు వెలగకుంటే 48 గంటల్లో రిపేర్ చేయాలన్నారు. ఈఎస్ఎల్‌పై గడిచిన ఆరు నెలల్లో ఆరున్నర కోట్ల రూపాయలు ఫైన్ వేశామన్నారు. పిన్ పాయింట్ ప్రోగ్రాం ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు అధికారులు ఫీల్డ్ పై ఉండేలా ఆదేశించారు. వారు కార్పొరేటర్ల దగ్గరకు వెళ్లి సమస్యలు కనుక్కోవాలని చెప్పారు.

కార్పొరేటర్ల ఆందోళన.. మేయర్ ఛాంబర్ వద్ద ఉద్రిక్తత...

జీహెచ్ఎంసీ 7వ కౌన్సిల్ సమావేశాన్ని మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం ప్రారంభమైంది. ఈ సమావేశం ప్రారంభానికి ముందే జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇదిలావుండగా కౌన్సిల్ సమావేశంలో అర్ధాం తరంగా ముగియడంతో తిరిగి బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలో మేయర్ ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు మేయర్ ఛాంబర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. జీహెచ్ఎంసీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ప్రొటోకాల్ పాటించాలి

నగరంలో ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిందని, ప్రారంభోత్సావాలకు పిలవడం లేదని, శంకుస్థాన శిలా పల్కాలపై సైతం తమ పేర్లు లేవని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ఈ క్రమంలో కౌన్సిల్ సమావేశంలో ప్రోటోకాల్ రగడ చోటుచేసుకుంది. అభివద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వడం లేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగినా కార్పొరేటర్లను లెక్కచేయడం లేదని, వార్డు కార్యాలయాలు, డివిజన్



కార్యాలయాల్లో కనీసం జాతీయ జెండా ఎగరేసే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ఇష్టానుసారం నడుచుకొంటున్నారని కాంగ్రెస్ కార్పొరేటర్లు మండిపడ్డారు. ఈ విషయంపై మేయర్ వివరణ ఇచ్చారు. ప్రోటోకాల్ వివాదం అన్ని పార్టీల కార్పొరేటర్లు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. వాటర్ బోర్డు ప్రతినిధులు స్పందించాలని మేయర్ కోరారు. ప్రొటో కాల్ పాటిస్తు న్నామని వాటర్‌బోర్డు డైరెక్టర్ ప్రాజెక్టు 2 స్వామీ సమాధానమిచ్చారు. ఏదైనా సమస్యలు తలెత్తితే పై అధికా రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు న్నామని చెప్పారు. ఇదిలావుండగా సమావేశం అర్ధాం తరంగా ముగిం చడంపై కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

భారీ బందోబస్తు

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. లిబర్టీ చౌరస్తా, ట్యాంక్‌బండ్ పరిసరాలతోపాటు జీహెచ్ఎంసీ ఇరువైపులా భద్రతను కట్టుదిట్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన గేట్‌తోపాటు మేయర్ వెళ్లేమార్గం, మేయర్ ఛాంబర్, కౌన్సిల్ సమావేశం హాల్ పరిసర ప్రాంతాల్లో అడుగడుగునా పోలీసులను మోహ రించారు. కౌన్సిల్ సమావేశంలోని మీడియాను అనుమతించక పోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



నవతెలంగాణ- మేడ్చల్

విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని సూర్యనగర్ కాలనీలో ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటున్న శ్రీవాణి(19) గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశా లలో సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువు తున్నది. బుధవారం ఉదయం తోటి స్నేహి తులు కాలేజ్‌కు వెళ్ళిన అనంతరం ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మతురాలి స్వస్థలం వనపర్తి జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన యువతిగా పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు కారణం తన బాయ్ ఫ్రెండ్ కారణమని ఉన్న సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

'దమ్మాయిగూడా' అభివృద్ధికి పెద్ద పీట

- మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్

నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడా మున్సిపాల్టీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని దమ్మాయిగూడా మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు.బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 7 ,16వ వార్డులల్లో



రూ. 6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రూ. 8లక్షల 60 వేలతో భూగర్భ మురికి కాలువ నిర్మాణం అభివద్ధి పనులకు చైర్మెన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దమ్మాయిగూడా మున్సిపా ల్టీలో దశల వారిగా అభివద్ధి పనులు చేపడతాం అన్నారు. మున్సిపల్ కమిష నర్ రాజమల్లయ్య, వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి పావనిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంపన్ బోల్ హరి గౌడ్, మోర నరహరి రెడ్డి, ఖాజామీయ పాల్గొన్నారు.

'డబుల్' దౌర్జన్యం..

- సర్కార్ పట్టా ఇచ్చింది.. కబ్జాదారులు పొమ్మంటున్నారు
- గూడు పిలిస్తున్నా.. గుమ్మంలోకి అడుగుపెట్టనివ్వని గూండాలు
- కన్నీరు కారుస్తున్న కళావతి.. దిక్కుతోచని స్థితిలో లబ్దిదారులు.



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల సొంతింటి కలను నిజం చేయాలానే సంకల్పంతో నిర్మించిన ఇండ్లను కొందరు తాళాలు పగుల గొట్టి ఆక్రమించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ నందు నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను మేడిపల్లి తహసీల్దార్ గత నెలలో లబ్దిదారులకు అందజేశారు. ఈ క్రమంలోనే లబ్దిదారుల పట్టాలు అందుకున్న సంతోషం అంతా ఇంతా కాదు.. మంచి ముహూర్తం చూసుకొని ఇంట్లోకి వెళ్దామని రెడీ అయ్యారు బ్లాక్ ఈ- మొదటి అంతస్తు లబ్దిదారు కోట్ల కళావతి ఇల్లు శుభ్రం చేసుకుందామని గుమ్మం లోకి అడుగుపెడదాం అనుకుని ఇంటికి చేరుకుంటే అప్పటికే తాళాలు పగులగొట్టి కొందరు అక్రమంగా నివాసం ఉండటం చూసి ఆమె అవాక్కయ్యారు. ఎవరు మీరు అని అడిగితే దౌర్జన్యానికి దిగటం, దుర్భషాలాడటం చేశారు. దిక్కుతూచని స్థితిలో ఆమె తిరిగి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొరపెట్టుకుంటే ఫలితం లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదంటూ విలేకరుల ముందు కన్నీటి పర్యాంతమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఇది నా ఒక్కరి సమస్య కాదని సుమారు 40 మంది లబ్దిదారులు ఇదే సమస్య ఎదురుకుంటున్నారన్నారు. ఎన్నో ఏండ్ల నిరీక్షణ నేటికీ నెరవేరిందనుకుంటే ఆ సంతోషం ఒక్కరోజు కూడా లేకుండా పోయిందని, తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆక్రమణ దారుల నుండి తమకు తిరిగి అందించాలని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి వేడుకుంటున్నారు. దీనిపై త్వరగా స్పందించి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆత్మహత్యే శరణ్యం అని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమ సమాజ సామ్యవాద భావకుడు ముగ్దుం మొయినుద్దీన్

- సీపీఐ(ఎం) నాయకులు నంద్యాల నరసింహారెడ్డి



నవతెలంగాణ-కల్చరల్

నైజాం నవాబ్ పాలనను భూస్వామ్య పెత్తందారులను వ్యతి రేకించి పోరాడిన ముగ్దుం మొయినుద్దీన్ సమసమాజ సామ్యవాద భావకుడు అని పూర్వ శాసన సభ్యులు, సీపీఐ(ఎం) నాయకులు నంద్యాల నరసింహారెడ్డి నివాళులు అర్పించారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై శతాబ్ది పూర్వ మహనీయులు యాది లో కార్యక్రమం పరంపరలో భాగంగా ముగ్దుం మొయినుద్దీన్ సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకునిగా వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన మొయినుద్దీన్ ఉర్దూ భాషలో గొప్ప కవి అన్నారు. ఆయన సాహిత్యం ఇతర భాషలలోకి అనువదించబడి గుర్తింపు పొందాయని వివరించారు. కమ్యూనిస్ట్ సిద్ధాంత బద్ధునిగా మొయినుద్దీన్ జీవితం నేటి తరాలకు ఆదర్శనీయం అన్నారు. ఆయన విగ్రహం గత ప్రభుత్వం టాంక్ బండ్ పై ప్రతిష్ట చేయడం, సీపీఐ భవనానికి ఆయన పెరుపెట్టటం సముచితంగా ఉందని, ఇట్టి మహనీయుల చరిత్ర మరుగు కాకుండా గాన సభ కార్యక్రమాలు జరపటం అభినందనీయం అన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ మొయినుద్దీన్ కలలు కన్న మత సామరస్యం సమత భావన సాకారం కావాలని ఆయన ఆలోచనలు కొన సాగిద్దామన్నారు. సాహితీవేత్త రమణ వెలమకన్ని మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన మొయినుద్దీన్ ఉన్నత విద్య అభ్యసించి కళాశాల ఉపన్యాసకునిగా కవిగా ట్రేడ్ యూనియన్ నాయకునిగా శాసనసభ్యునిగా ఎదిగారని వివరించారు. ఆయన కవిత్వం మెచ్చి దాశరథి తెలుగు లోకి అనువాదం చేశారని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన వేదికపై సూరి భగవంతం ట్రస్ట్ స్థాపకుడు ఎస్. బి. రామ్ పాల్గొన్నారు



ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి సందర్భంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి ప్రముఖులు ప్రకాశం అధ్యయనసంస్థ నిర్వహణలో నివకులర్పించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు కాసు కృష్ణారెడ్డి శాసన మండలి పూర్వ సభ్యుడు రామచంద్ర రావు,టంగుటూరి గోపాలకృష్ణ, సరోజులు మాట్లాడుతూ ధైర్యనికి త్యాగానికి ప్రతీక ప్రకాశం అని, నిస్వార్థ ప్రజా సేవకుడు అని కొని యాడారు. ప్రకాశం అధ్యయన సంస్థ సభ్యులు గంధం.సుబ్బారావు, టంగుటూరి శ్రీరాములు డాక్టర్ పీ.మోహనరావు, రాధా కృష్ణ, గాంధీ స్మారకనిధి జీ వీ.సుబ్బారావు, దేశాయి, గీత మూర్తి తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. నవతెలంగాణ-కల్చరల్

బండారి లక్ష్మారెడ్డిని కలిసిన మార్వాడి సంఘం ప్రతినిధులు



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని వారి కార్యాలయంలో మార్వాడి సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మార్వాడిల సంక్షేమ కోసం కషి చేస్తున్నారన్నారు. మీర్ పేట్ హౌసింగ్ బోర్డు కాలనీ మర్వాడి నాయకులు బాలు లాల్, కిషన్ సింగ్, నెమరాన్, మోతిజి పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోరుతూ దరఖాస్తు సమర్పించిన రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

రానున్న ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ బుధవారం నగరంలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి దరఖాస్తు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు సేవలు అందిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఏఐసీసీ, కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా, గ్రేట్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా, పీసీసీ సెక్రెటరీగా, పీసీసీ జనరల్ సెక్రటరీగా, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామ తెలియజేశారు అలాగే 20 సంవత్సరాలుగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ట్రస్టు ద్వారా వేలాది మందికి సహాయ సహకారాలు అందించడం జరుగుతున్నదని తెలియజేశారు. కావున ఈ ఎన్నికల్లో ఉప్పల్ అసెంబ్లీ సీట్లు తనకే కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాచారం డివిజన్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్ గౌడ్, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పులిపాక అంజయ్య, కాంగ్రెస్ రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు మహ్మద్ రఫీక్, టీపీసీసీ మైనారిటీస్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జైన్, టీపీసీసీ సభ్యులు వినోద్ ముదిరాజ్, టీపీసీసీ మైనారిటీ జనరల్ సెక్రెటరీ షేక్ మదర్ వలి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ పత్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

- బీఆర్ఎస్ పార్టీ 100 సీట్లతో అధికారంలోకి..
- మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ - మేడ్చల్

సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అర్కల్ గూడ, సుతారిగూడ, బాసిరేగడి, జ్ఞానపూర్ పలు వార్డులలో రూ.4కోట్ల నిధులతో వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, వైకుంఠ దామలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వచ్చాక సంక్షేమ పథకాలతో రాష్ట్రం అభివద్ధి పథంలో దూసుకెళ్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో దివాలా తీసిందని, రాష్ట్రంలో కూడా అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. బీజేపీ దేశాన్ని మొత్తం సర్వనాశనం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ 100 సీట్లు గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ ప్రభాకర్, కౌన్సిలర్లు లక్కీ రెడ్డి శ్రీలత శ్రీనివాస్ రెడ్డి, సాకరబోయిన రజిత వెంకటేష్, మారేపల్లి రాజకుమారి సుధాకర్, అంతోనమ్మ ఫీలోప్, కమిషనర్ రాములు, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్,కో అప్షన్ సభ్యులు,మాజీ సర్పంచ్ లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, జగన్ రెడ్డి,కాందాడి నరేందర్ రెడ్డి,మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ : రాబోయే ఎలక్షన్స్‌లో మేడ్చల్ నియోజక వర్గంలో మంత్రి మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని జవహర్ నగర్‌లోని తెలంగాణ ఉద్యమ కారులు అన్నారు. సీఎం కేసీఆర్ మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ టికెట్ కేటాయించినందుకు జవహర్ నగర్ తెలంగాణ ఉద్యమకారులు బుధవారం మంత్రిని కలిసి అభినందనలు తెలిపి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తున్నారని, సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే తెలంగాణ అన్నపూర్ణగా నిలిచిందన్నారు. 10 ఏండ్లలోనే 100 ఏండ్ల నాటి అభివద్ధి జరిగిందంటే అతిశయోక్తి కాదని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో జరిగిన అభివద్ధి పనులతో తనను మరోసారి ప్రజలు దీవిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జవహర్ నగర్ ఉద్యమకారులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే జవహర్ నగర్ లో పెద్ద ఎత్తున అభివద్ధి పనులు జరిగాయని, మంత్రి మల్లారెడ్డి జవహర్ నగర్ తన గుండె కాయా అంటూనే... గుండెయాకు అత్యధిక నిధులు కేటాయించడంతోనే ప్రగతి చెంది మోడల్ సీటిగా మారిందని అన్నారు. మంత్రి మల్లారెడ్డికి జవహర్ నగర్ ఉద్యమకారులం అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏకే మురుగేష్, ఉద్యమకారులు జిట్ట శ్రీనివాస్ రెడ్డి, సుధాకరాచారి, రమేశ్‌చారి, ప్రకాశ్, పరుశురాం, సోమయ్య, వెంకటేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో శాస్త్రవేత్తలకు సీపీఐ అభినందనలు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టిన చంద్రాయన్ 3 విజయవంతం కావడం చాలా సంతోషమని ఇది రానున్న రోజుల్లో ప్రజలకు సైన్స్ పై ఆసక్తి పెరిగి శాస్త్రవేతలుగా తయారు కావడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విజయం ఏ ఒక్కరిది కాదని దీని వెనుకాల ఎంతో మంది శాస్త్రవేత్తల కృషి ఉందని ముఖ్యంగా నాటి ప్రధాని నెహ్రూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి సైన్స్‌ను ప్రజలకు చేరువయ్యేలా నాడు స్థాపించిన సాటిలైట్ సెంటర్‌లే నేడు ఉపయోగపడుతుందని అన్నారు. ఇది కేవలం సైన్స్ వల్లే సాధ్యమని, మాటలు, మంత్రాలు, మహిమాలతో సాధ్యం కాదని ఈ విషయం అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కూడా సైన్స్ గురించే మాట్లాడుతుందని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-దుండిగల్

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ 22వ వార్డు జీఎల్‌ఎస్ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిశారు. మౌళిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారు లతో చర్చించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట్ హన్మంతరావు, అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా పాదచారుల వంతెనలు

- రద్దీ ప్రాంతాలను వదిలేసి అవసరం లేని చోట నిర్మాణాలు
- జీహెచ్‌ఎంసీ నిధులు దుర్వినియోగం
- శోభన సెంటర్ లో నిర్మించాలని ప్రజల డిమాండ్



నవతెలంగాణ-బాలానగర్

పెరుగుతున్న జనాభాకనుగుణంగా పెరిగిన రద్దీ వాహనాల సంఖ్య కారణంగా పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రజాభీష్టం మేరకు అధికారులు సర్వే నిరవహించి ప్రణాళికాబద్ధంగా రద్దీ ప్రాంతాలను గుర్తించి ఏర్పాటు చేయాల్సిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను అవసరమైన చోట ఏర్పాటు చేయకపోవడంతో అక్కడక్కడ అలంకార ప్రాయంగా మిగిలాయి. అయితే వాటిని ఏర్పాటు చేయాలని అనేక ప్రాంతాల్లో ప్రజల నుంచి డిమాండ్ ఉంది. కానీ ఎక్కడ అవసరమన్నదో మాత్రం అధికారులే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అవస రమైతే అధ్యయనం కూడా చేయాలి. కానీ ఇదేమీ లేకుండానే వినతి పత్రం వచ్చిందని అనవసరమైన చోట ఏర్పాటు చేయడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నది వాస్తవం. ఇవి ఎంతో ఖర్చుతో కూడుకున్న రూ. కోట్ల నిధులు వెచ్చిస్తేనే ఒక వంతెన అందుబాటులోకి వస్తుంది. అలాంటి వాటి ఏర్పాటు విషయంలో పక్కా ప్రణాళిక లేకపోవడం, కనీసం అధ్యయనం చేయకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగించే అంశంగా మారింది. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడ, ఐడీపీఎల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు రాకపోకలు సాగించే ప్రయాణికులకు అంకార ప్రాయంగా మిగిలాయి. సర్కిళ్ల పరిధిలో నిరుపయోగంగా మారిన పాదచారుల వంతెనలు బాలానగర్, ఫతేనగర్, ఐడీపీఎల్ కాలనీ, ప్రధాన రహదారులు నిత్యం అత్యంత రద్దీగా కనిపిస్తాయి. జాతీయ రహదారి దాటాలంటే జనం పడే అవస్థలు వర్ణనాతీతం. దీన్ని దృష్టిలో పెట్టుకుని అవసరంలేని చోట వీటిని నిర్మించారు. నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాలలో పరవాలేదు.

ఫిరోజ్ గూడ వద్ద అలంకారప్రాయం..

బాలానగర్ ప్రధాన రహదారి ఫిరోజ్ గూడ వద్ద కొన్ని మాసాల క్రితం వినియోగంలోకి తీసుకొచ్చిన రూ.3 కోట్లతో నిర్మించిన పైవంతెన ప్రారంభం నుంచి ఒక్కరు కూడా వినియోగించుకోవడంలేదు. ఒక్కరైనా ఎక్కకపోతారా? అంటూ ఇక్కడ నియమించిన సెక్యూరిటీ గార్డులు ప్రతిరోజు ఎదురు చూడడమేగాని.. ఒక్కరైనా వస్తే ఒట్టంటూ వారు పేర్కొనడం గమనార్హం. వాస్తవంగా ఇదే రోడ్డులో బాలానగర్ శోభన సెంటర్ వద్ద నిత్యం వందలాది మంది జనం ఫతేనగర్ నుంచి బాలానగర్‌కు విద్యార్థులు, వ్యాపారులు, కార్మికులు, ఉద్యో గులు, మహిళలు రోడ్డు దాటుతుం టారు. ఇక్కడ అవసరం ఉండగా ఎవరో వినతిపత్రం ఇచ్చారని ఫిరోజ్ గూడలో ఏర్పాటుచేసి రూ. 3 కోట్లు బూడిదలో పోశారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

శోభన సెంటర్‌లో ఏర్పాటు చేయండి...



రాజశేఖర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి

శోభన బస్టాప్‌లో ప్రమాదాలను అరికట్టేదెప్పుడు బాలానగర్ మండలంలోని శోభన్ సెంటర్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జీ లేక చాలా ప్రమా దాలు జరిగుతున్నాయి. ఇటీవల ముగ్గురు వరకు చనిపోయారు. మరికొంత మంది గాయాలపాలవుతున్నారు. రోజు రోజుకు ప్రమా దాలు జరుగుతూనే ఉన్నాయని సీపీఐ(ఎం) పోరాటాలు చేస్తున్నా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఏమి పట్టనట్లు వ్యవరిస్తున్నారు. ఫిరోజ్ గూడలో ఉపయోగం లేని దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి జీహెచ్‌ఎంసీ నిధులను దుర్వినియో గం చేశారు. శోభన బస్‌స్టాప్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక బాలానగర్ ప్రభుత్వ పాఠశాల లో చదువుకునే పిల్లలు ఫతేనగర్, వాల్మీకినగర్, శోభన కాలనీల నుండి పలువురు విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. రోడ్డు దాటే క్రమంలో ఏ క్షణమైనా ప్రమాదాల బారిన పడవచ్చని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే అందిస్తాం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళా సమైక్య గ్రూప్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో నిరుపేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను అసలైన లబ్ది దారులకు అందేలా చూడాలని అలాగే కూకట్‌పల్లిలో గతంలో రూ.10 వేల ఫించన్లు ఉంటే, ఈ 9 ఏండ్ల కాలంలో మరో 32 వేలు పెంచి మొత్తం 42 వేల మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నాం అని తెలిపారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులకై లబ్ది దారుల తనిఖీ జరుగుతుందని వాటిని విడతల వారీగా అందరికీ అందిస్తామని పేర్కొన్నారు. ఈ పథకాలను అందిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో రోడ్లు, డ్రయినేజ్, మంచి నీరు వంటి మౌలిక సదుపాయా లు గత పాలకుల పాలనలో ఎలా ఉండేవి ప్రస్తుత బీఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో ఎలా అభివృద్ధి చెందాయే వివరించారు.

పారిశుధ్య కార్మికులకు మద్దతుగా డా.సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసినట్టుగానే చివరకు పారిశుధ్య కార్మికులను సైతం మోసం చేసిన కేసీఆర్ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించాల్సి ఉంటుందని పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం అన్నారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతుగా కార్మికుల వారి వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో, అసెంబ్లీలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోమంటే మీ బాదేంటని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చినా ఇలాంటి సామాన్య కుటుంబాల జీవితాలు బాగుపడనపుడు ఇంకా బంగారు తెలంగాణ ఎలా అవుతుందన్నారు. అందరినీ మోసం చేసినట్టుగానే చివరకు పారిశుద్ధ్య కార్మికులను సైతం కేసీఆర్ మోసం చేశారని దుయ్యబట్టారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 27 వేల మంది పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. గాంధీ భవన్‌లో జరిగే సమావేశంలో ఏ నాయకులు మాట్లాడినా ఈ సమస్య గురించి మాట్లాడి రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజల సంక్షేమం, ఉద్యోగుల అభ్యున్నతి కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు క్రిష్ణా రాజ్ పుత్, మహేష్ గౌడ్, సూరి, నయీమ్, ప్రకాష్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

2024లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానుందని కుత్బుల్లాపూర్ కోటపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పునారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన "అప్లికేషన్", "డీడీ"ని నగరంలోని గాంధీభవన్‌కు గాజుల రామారం నుండి కాంగ్రెస్ శ్రేణులతో భారీ ర్యాలీగా తరలి వెళ్లి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్‌కు దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేద మధ్యతరగతి ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. వారి పాపాలు పండే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాల్ మహమ్మద్, మైనారిటీ ప్రెసిడెంట్ నాయబ్ రసూల్, డివిజన్ మెంబర్షిప్ ఇన్‌చార్జ్ రెహమాన్, ఏ. బ్లాక్ మహిళా వైస్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, సూరారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు మండవ శివకుమార్, అందే లోవా కుమార్, బేకరీ గడ్డ ప్రెసిడెంట్ గఫర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండే సతీష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దండే రాజు, నేషనల్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రజాక్, రాజ్, కుమార్ విశాల్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీలో శేరిలింగంపల్లి జోన్ హైటెక్ సిటీలో ఏండ్లుగా పని చేస్తున్న వెటర్నరీ కార్మికులను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని ఎరుకల సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు కుతాడి రవి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెటర్నరీ కార్మికులకు చాలీచాలని వేతనాలు వస్తుండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇల్లు లేని ప్రతీ వెటర్నరీ కార్మికునికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్, శాంతి కుమార్, నాగరాజు, బాలునాయక్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని షెడ్యుల్డ్ కలాల (ఎస్సీ) విద్యార్థులకు ప్రెషర్స్, రెన్యూవల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి జి.వినోద్ కుమార్ తెలిపారు. ఈ నెల 19-31వ తేదీ వరకు అవకాశం ఉన్నట్టు తెలిపారు. అర్హత గల విద్యార్థులు వెబ్‌సైట్ tsepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ప్రయివేటు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ తమ కళాశాలలో అర్హత గల విద్యార్థులందరినీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఫిషర్మెన్ చైర్మెన్‌గా ఆకుల నరేందర్



నవతెలంగాణ-బాలానగర్

మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సూచన మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్(120) డబుల్ బెడ్ రూమ్ సైట్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆకుల నరేందర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ వైస్ చైర్మెన్‌గా నియమిస్తూ రాష్ట్ర ఫిషేర్మన్ కమిటీ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ పత్రాన్ని బుధవారం ఆయన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల నరేందర్ మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ ఉపాధ్యక్షుడుగా పని చేస్తున్న నాకు ఏకంగా జిల్లా వైస్ చైర్మెన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఫిషేర్మన్ కమిటీ తరపున కష్టపడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ఫిషేర్మన్ డిపార్ట్మెంట్‌కి మంచిపేరు తెస్తానని అన్నారు. రెవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్ భట్టివిక్రమార్క, టీపీసీసీ రాష్ట్ర ఫిషేర్మన్ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్, మాజీ ఎంపీ మల్లు రవి,మాజీ ఎంపీ వి. హన్మంతరావు, డీసీసీ నందికంటి శ్రీధర్, గాలి బాలాజీ, మాదిరెడ్డి యుగంధర్, మిస్బుఉద్దీనకు తనకు వెన్నుదన్నుగా నిల్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏబ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డియుగంధర్ రెడ్డి బేగంపేట్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ షానూర్, యూత్ కాంగ్రెస్ నాయకులు అఖిల్, అరుణ్, మోహన్, సాయి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా బీసీ వర్గానికి టికెట్ ఇవ్వాలి

- కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి శ్యామ్ గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలే అత్యధికంగా ఉన్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా బీసీ వర్గానికి టికెట్ ఇవ్వాలని మల్కాజిగిరి పార్లమెంట్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి శ్యామ్ గౌడ్ అధిష్టానాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని గాంధీభవన్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు ఫారాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కుత్బులాపూర్ సర్కిల్ చింతల్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను మొదటి నుంచి కూడా కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకుని క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకొని కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యునిగా పనిచేస్తున్నానని ఈ ప్రాంత వ్యక్తిగా విద్యార్థి దశ నుంచి ఎన్.ఎస్.యు.ఐలో పనిచేస్తూ విద్యార్థుల హక్కులపై అనేక పోరాటాలు చేశానన్నారు. కుత్బుల్లాపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు, గ్రేటర్ హైదరాబాద్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రెండు సంవత్స రాలు, మల్కాజిగిరి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా రెండు సంవత్సరాలు పనిచేశానని తెలిపారు. ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, అగ్రనేత రాహుల్ గాంధీ ప్రవేశపెట్టి నటువంటి అంతర్గత ఎన్నికల ద్వారా 2015 లో మల్కాజిగిరి పార్లమెంట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అత్యధిక మెజారిటీతో గెలుపొందడం జరిగిందన్నారు. దాదాపు 5 సంవత్సరాలు ఆ పదవిలో ఉండి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో యువజన కాం గ్రెస్‌ని బలోపేతం చేస్తూ యువతలో చైతన్యం నింపానున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం జరిగిందన్నారు. తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఇప్పటివరకూ పనిచేస్తున్నామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పార్టీ తరపున పోటీ చేసేందుకు తనకు అన్ని రకాలుగా అర్హత ఉందని తనకు అవకాశం కల్పించాలని భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా కందాడి జ్యోత్స్నా శివారెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివారెడ్డి గాంధీభవన్‌లో బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. మొదట నుంచి కాంగ్రెస్ పార్టీ విధేయురాలుగా ఉంటూ ప్రస్తుతం తెలంగాణ పరదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా కొనసాగుతూ ప్రజల కష్టాలు తెలిసిన జ్యోత్స్నా శివారెడ్డికి అవకాశం వస్తుందని అభిమానులు, కార్యకర్తలు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వికలాంగుల పాలిట దీనబాంధవుడు కేసీఆర్ : ఎమ్మెల్యే



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని వికలాంగుల పాలిట దీనబాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం సాయంత్రం చింతల్ డివిజన్ పరిధి వైఎంఎస్ కాలనీలోని వైఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో దివ్యంగులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై దివ్యాంగులకు రూ.3016 పెన్షన్‌ను రూ.4016 కు పెంచిన సందర్భంగా వారికీ మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారని దివ్యాంగుల పాలిట దేవుడని అన్నారు. ఇటీవల కాలంలో కన్న బిడ్డలే చూసుకొని ఈ తరుణంలో నెల నెల పెన్షన్ ఇస్తూ.. రూ.1000 పెంచి వారికీ పెద్ద కొడుకుల సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని కొనియాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. గత పాలకులు తెలంగాణ రాకముందు నెలకు 500 చొప్పున మాత్రమే పెన్షన్ అందించేవారని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత స్వయంపాలనలో అర్హులైన వికలాంగులను గుర్తించి, గుర్తించేందుకు చర్యలు చేపట్టిందని తద్వారా వారి సంఖ్య 5 లక్షల 11వేల 656 పెరిగిందని తెలిపారు. నెలకు అందించే పింఛన్‌ను రూ. 3,016 నుంచి రూ. 4,016 కు పెంచిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వికలాంగులతో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కమిషనర్ నాగమణి, మల్లా రెడ్డి, ప్రాసెసింగ్ ఆఫీసర్ హరిప్రియా, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఉన్నాను బరిలోనూ ఉంటాను

- నిత్యం సేవ చేస్తూ ప్రజల్లో ఉన్నాను
- పార్టీ మీద గౌరవం ఉంది కానీ ప్రజాభిష్టం మేరకు రెబల్‌గా
- గొట్టిముక్కల వెంకటేశ్వర రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నన్ను నమ్ముకున్న ప్రజల కోసం తప్పని సరిగా శాసన సభ ఎన్నికల్లో పోటీలో ఉంటాను. ప్రజలకు న్యాయం చెయ్యాలంటే నేను ఎన్నికల్లో పోటీ చేసి గెలావాలంటున్న జి.వి.ఆర్, కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన వారిలో గొట్టి ముక్కల వేంగల్ రావు ఒకరు. కానీ ఈ సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కేటాయించడంతో జి.వి.ఆర్ రెబల్‌గా పోటీ చేయనున్నారు. కూకట్‌పల్లితో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గం పై సైతం ప్రభావం చూప గల నాయకుడిగా పేరున్న జి.వి.ఆర్ మొదటి నుండి పార్టీ నీ నమ్ముకుని పార్టీ కొరకు ఎంతో కృషి చేశారు. అయినప్పటికీ తనకు పార్టీ ఎలాంటి న్యాయం చేయలేదనీ ,బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానంపై తనకు ఎలాంటి ద్వేషం, బాధ లేదని కానీ నన్ను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయడం కోసం ఎన్నికల బరిలో ఉంటున్నానని జీవీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఉంటూ పని చేసేది తాను మాత్రమే అన్నారు. అలాగే ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి పది గంటల వరకు ప్రజా సేవలో ఉంటూ ప్రజల సాధక బాధకాలు చూసుకునే వారీగా పేరు తెచ్చు కున్న అన్నారు. సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ, డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తు లు తదితర పథకాల విషయంలో కూక ట్‌పల్లి ప్రజలకు, ఏ నాయకుడు చేయ ని సేవలు చేస్తూ ప్రజల మదిలో ఉన్నా నని, అలాగే ఉద్యమం సమయంలో చేసిన పోరాటంలో తనతో ఉన్న సహచర ఉద్యమ కారులు, తన ద్వారా లబ్ది పొందిన వారు, తాను పోటీ చేస్తా అని నమ్ముకున్న వారందరూ తనకు ఓటేస్తారనే నమ్మకం తనకుందని తెలిపారు. 35 వేల నుంచి 40 వేల ఓట్ల వరకు జీవీఆర్ అనుకూల ఓట్లు ఉన్నాయనేది ఒక సర్వే రిపోర్ట్ అన్నది వాస్తవమని.. అందరి సహాయ సహకారాలు ఉంటే గెలిచినా ఆశర్యం లేదని, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉందామనుకున్నప్పటికి కుదరలేదు కాబట్టి బీఆర్‌ఎస్ రెబెల్ అభ్య ర్థిగా పోటీలో ఉంటానని, అధిష్టానం సూచనల మేరకు ఇన్నాళ్లు సైలెంట్‌గానే ఉన్నానన్నారు. సీట్ల కేటాయింపులో మాత్రం పార్టీతోవలో పార్టీ ఉంది కాబట్టి, ప్రస్తుతం నమ్ముకున్న ప్రజలే నా అధిష్టానం కాబట్టి వారి కోసం ఎన్నికలకు తప్పకుండా వెళ్తానని, ఒక్క పిలుపుతో రూపాయి ఖర్చు పెట్టకున్నా తన కోసం వేలాది మంది తరలి వచ్చారన్నారు. పదహారు సంవత్సరాలుగా ఒకే పార్టీని నమ్ముకుని, పార్టీ గీత దాటకుండా సేవ చేసిన తన లాంటి నాయకుడికి న్యాయం జరగకపోతే, కార్యకర్తలు, ఉద్యమకారుల, అభిమానులు పార్టీని వ్యతిరేకిస్తారని, పార్టీ మీద మొదటి నుంచి ఉన్న గౌరవం ఈరోజు కూడా ఉందని, పోటీ చేయకుండా ఉండలేనని తప్పకుండా రెబెల్ అభ్యర్థి గా పోటీ చేస్తానని తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ బహదూర్‌పల్లి నివాసితులు కృష్ణ మూర్తి కూతురు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బుధవారం టీపీసీసీ ప్రతినిధి ని యోజకవర్గ నాయకులు కొలను హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-దుండిగల్

పెండ్లి మడుగుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ మున్సిపాల్టీ మల్లంపేట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పెండ్లిమడుగుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు మల్లంపేట గ్రామంలో బీజేపీ నాయకులు అభిమానులు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బండి సంజయ్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, శాసనసభ్యులు మాజీ శాసనసభ్యులు నందీశ్వర్ గౌడ్, బీజేపీ నాయకులు, సంగప్ప హాజరై శ్రీనివాస్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు కార్యకర్తలు భారీ కేక్‌లు కట్ చేసి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు వాసు, కృష్ణారెడ్డి,మాజీ ఎంపీటీసీ జంగారెడ్డి, సతీష్ సతీష్ బాబు, రాఘవేంద్ర గౌడ్, నీలం రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగులకు ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పింఛన్

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- మేడ్చల్ నియోజకవర్గంలో 6,461 మంది వికలాంగులకు రూ.4,016 చొప్పున ప్రొసీడింగ్స్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ విషయంలో వికలాంగులకు దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా పింఛన్లు అందచేస్తున్న రాష్ట్రం మనదేనని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి వాటిని సక్రమంగా అమలు జరిగేలా చూస్తున్నారని చెప్పారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికలాంగులకు రూ.3,016 నుంచి రూ.4,016లకు పెంచిన ఆసరా పెన్షన్ పంపిణీ ప్రారంభం కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అర్హులైన 6,461 మంది వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.4,016 ప్రొసీడింగ్స్‌ను అందజేసినట్టు తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పెన్షన్లు పొందుతున్న మొత్తం లబ్ధిదారులు లక్షా 46 వేలా 922 మంది ఉన్నారని, వీరికి ప్రతినెలా రూ.39 కోట్లా 63 లక్షలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వికలాంగులకు మేడ్చల్ నియోజకవర్గంలో గతంలో రూ.3,016 చొప్పున రూ.1,94,88,376 ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం రూ.1000 పెంచగా నియోజకవర్గంలో రూ.2,59,47,832 అందజేస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 21,863 మంది వికలాంగులకు రూ.3,016 పింఛన్ అందించిన సమయంలో రూ.6,59, 38,808 ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం రూ.4,016 అందజేస్తుందని, ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా వికలాంగులకు ప్రతినెలా పింఛన్ రూ.2,18,63,000లకు పెరిగిందని, దీంతో రూ.8,78,01,808 అందజేయాల్సి వస్తుందని తెలిపారు. వికలాంగులు ఎంతో ఆత్మస్థైర్యం, ధైర్యం కలిగి ఉంటారని తెలిపారు. ప్రభుత్వం తరపున వికలాంగులకు ఎంత చేసినా తక్కువే అన్నారు. ఇండ్లు లేని వికలాంగులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి మొదటి ప్రాధాన్యత కింద అలాట్ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వికలాంగుల శ్రేయస్సును దష్టిలో పెట్టుకుని ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి, దమ్మాయిగూడ, ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, రోబోటిక్ సర్జన్ జగదీష్ గౌడ్ ను హొటల్ ది ప్లాజాలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఘనంగా సన్మానించింది.
నవతెలంగాన-సిటీబ్యూరో

బాలికపై లైంగికదాడికి పాల్పడిన దోషులను శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ-సిటీబ్యూరో

మీర్‌పేటలో బాలికపై సామూహిక లైంగికదాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ పద్మ, కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విధమైన దారుణానికి పాల్పడిన సంఘటన మహిళలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు ఇంట్లోనే రక్షణ లేని పరిస్థితులను ఈ సంఘటన సూచిస్తోందని తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంలో గంజాయి, మద్యం బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మాదక పదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయని ప్రభుత్వం వీటిని నియంత్రించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రాష్ట్రంలో నిత్యం మహిళలపై ఎన్నో అకృత్యాలు వెలుగు చూస్తున్నా వాటి నివారణకు దోషులకు సత్వర శిక్షలు పడేందుకూ ప్రభుత్వం చొరవ చూపడంలేదని,అనేక పోరాటాల తరువాత ఏర్పరచిన మహిళా కమిషన్ బాధితులకు న్యాయం చేసే చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దోషులందరినీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు కింద సత్వర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ఐద్వా హైద్రాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

రికార్డు సృష్టించిన భారత్ : డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్), కార్యదర్శి విక్రమ్ కుమార్, కార్యవర్గ సభ్యులు వైదిక్ శస్త్ర, ముఖీమ్, శ్రీధర్ తదితరులతో కలిసి బుధవారం చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ అడుగుపెట్టిన సంతోషకరమైన క్షణాలను టీవీలో ప్రత్యక్ష ప్రసారని వీక్షించినారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష రంగంలో సాధించిన ఘన విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన తొలి దేశంగా చరిత్ర సృష్టించిన భారత దేశం ముున్ముందు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. చంద్రయాన్-3 ప్రాజెక్టులో పాల్గొని విజయవంతం చేసిన శాస్త్రజ్ఞులందరికి శుభాకాంక్షలు తెలిపారు 140కోట్ల మంది భారతీయుల ఆశలు ఫలించిన శుభ దినంగా చరిత్రపుటలలో నిలిచిపోతుందని ముజీబ్ వివరించారు.



విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఎస్‌ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ- మేడ్చల్

సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీవాణి బుధవారం మేడ్చల్ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సమగ్ర దర్యాప్తును చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ ఆఫీసు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ అమ్మాయిల మీద దాడులు, ప్రేమ పేరుతో వేధింపులు విపరీతంగా పెరిగిపో తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అమ్మాయిలు వేధింపులకు తట్టుకోలేక ఏదోఒక రూపంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని అమ్మాయిలకు అవగాహన సదస్సులు పెట్టాలని సూచించారు. విద్యార్థిని శ్రీవాణి మృతి బాధాకరంమని, మృతికి కారకులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్స్ పై అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. మహిళలు,అమ్మాయిల పైన విపరీతంగా దాడులు జరుగు తుంటే ప్రభుత్వం అనేక చట్టాలు తెచ్చినా చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయి తప్ప మహిళలపై దాడులు మాత్రం ఆగట్లేదని అన్నారు. శ్రీవాణి మృతి పట్ల న్యాయ విచారణ జరిపి వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తీగల అరుణ్,నాయకులు పవన్,ప్రసాద్,సురేందర్,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంపై శుభాకాంక్షలు తెలిపిన టీజీవో

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడంతో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధికారులు భారతీయులకు, ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బుధవారం నాంపల్లిలోని గెజిటెడ్ భవన్‌లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని లైవ్‌లో వీక్షించారు. చంద్రయాన్-3 ఘన విజయం కావడంతో సంబురాలు చేసుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి దేశంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. ఈ విజయం దేశం గర్వించే మహోన్నత ఘట్టమని పేర్కొన్నారు. ఈ ఘనతను సాధించిన ఏకైక అంతరిక్ష సంస్థగా ఇస్రో అవతరించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీజీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, టీజీవో నగరశాఖ అధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎమ్.బీ.కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యదర్శి బీ.వెంకటయ్య, నగర ఉపాధ్యక్షులు డీ.శివకుమార్, జిల్లా కార్యదర్శి ఖాదర్, డీ.ఏ.ఓ.అసోసియేషన్ సభ్యులు బండిరమేష్, రవి, సుజాత, కవితతోపాటు తదితరులు పాల్గొన్నారు.

‘శ్మశాన వాటిక అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వరా’



నవతెలంగాణ-అడిక్‌మెట్
రాంనగర్ బాకారం ధర్మచరణ సమితి శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వరా అని సమితి కార్యదర్శి రమేష్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... భోలక్‌పూర్ డివిజన్‌లోని బాకారం ధర్మచరణ సమితికి చెందిన శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి సభ్యులెవరికీ సమా చారం ఇవ్వకుండా సమితి అధ్యక్షుడు అనిల్ యాదవ్, కోశాధికారి ప్రవీణ్‌రెడ్డి ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. కమిటీలోని 60 మందిలో ఎవరికీ సమాచారం ఇవ్వలేదన్నారు. ధర్మచరణ సమితి ఏ ఒక్కరిది కాదని, ఏకపక్షంగా అధ్యక్షుడు, కోశాధికారి మాత్రమే అభివృద్ధి పనులకు ఎలా వెళ్తారన్నారు. ప్రొటోకాల్‌ను పాటించకుండా అధ్యక్షుడు అనిల్ యాదవ్ ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం పద్ధతి కాదన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

నవతెలంగాణ - అడిక్‌మెట్
మాదిగల విశ్వరూప మహాసభలు విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ కోరారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లో చింతల్ బస్తీ కమిటీహాల్లో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ, ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ హాజరై మాట్లాడుతూ. మందకృష్ణ మాదిగ ఆదేశాలనుసారం 30 లక్షల మంది మాదిగలతో చేపట్టబోయే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోడీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.కార్యక్రమంలో జొన్న రవి మాదిగ, మంథని సామెల్ మాదిగ , దుర్గాప్రసాద్ మాదిగ ,చిలక ఎల్లయ్య మాదిగ ,గిన్నారపు శ్యామ్ రావు మాదిగ, తాంద్ర మురళి మాదిగ, ఇందూరి నరేష్ మాదిగ, బుర్ర జగదీష్ మాదిగ, రోషిని వినయ్ మాదిగ, సి పెళ్లి అశోక్ మాదిగ ,బస్తీ అధ్యక్షులు విశ్వనాథ్ మాదిగ, అమ్ముగూడెం దశరథ్ మాదిగ, నంది జీవన్ మాదిగ. మహబూబ్ మలేష్ మాదిగ, రాజు మాదిగ, తదితరు నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ



నవతెలంగాణ-బేగంపేట్
రాష్ట్రంలో ఆశా వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ సీఐటీయూ కార్యదర్శి ఎం.వెంకటేష్, అధ్యక్షురాలు టి. యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎం. అనిత అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఆశావర్కర్లు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లో పాల్గొని రిజిస్టర్స్ నిర్వహణ, సర్వేలు నిర్వహించారని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీపీ, షుగర్స్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులను, గర్భిణీ, బాలింతలు, చిన్న పిల్లలకు గుర్తించి సేవలు అందించారని పేర్కొన్నారు. కరోనా కాలంలో ఆశా వర్కర్ల సేవకు డబ్ల్యూహెచ్‌వో హెల్త్ గ్లోబల్ లీడర్స్ అవార్డును ప్రకటించిందన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్ సెంటర్స్, బస్తీ దవాఖానాల్లో పని చేయాలని ఆశాలకు ప్రభుత్వం చెప్తున్నదని పేర్కొనారు. ఇంత చేస్తున్నా రూ.9,750 చెల్లిస్తూ చేతులు దుపుకుంటుందని తెలిపారు.

డిమాండ్స్..

1) పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేల ఇవ్వాలి.
2)పారితోషికం లేని అదనపు పనులు చేయించకూడదు.
3)టీబీ స్ఫూటమ్ డబ్బాలను మోపించే పనిని రద్దు చేయాలి.
4)టీబీ లెప్రాసీ, కంటి వెలుగు పెండింగ్ బిల్లులు చెల్లించాలి.
5)లెప్రాసీ సర్వేలో వాలంటీర్లను నియమించాలి.
6) పని భారం తగ్గించి, జాబ్ చార్టు విడుదల చేయాలి.
7) 2021 జూలై నుండి డిసెంబర్ వరకు పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలి.
8)కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బు చెల్లించాలి.
9)32 రకాల రిజిస్టర్‌ను ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలి.
10) క్వాలిటీతో కూడిన 5 ఏండ్ల పెండింగ్ యూనిఫామ్స్ ఇవ్వాలి.
11) ఆశాలకు ప్రసూతి సెలవులపైన సర్క్యూలర్ జారీ చేయాలి.
12) ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
13) ప్రతి ఆదివారం ఆశాలకు శెలవు ఇవ్వాలి.
14) ఏ.ఎన్.సీ.లు తగ్గాయని వేతనం తగ్గించి ఇవ్వడం ఆపాలి.
15) మరణించిన ఆశాలకు మట్టి ఖర్చులు కింద రూ.50వేలు ఇవ్వాలి.
16) ఆశాలకు హెల్త్ ఇన్సూరెన్స్' సౌకర్యం కల్పించాలి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-అంబర్‌పేట
సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ను లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్ లోని కార్పొరేటర్ క్యాంపు కార్యాల యంలో నల్లకుంట డివిజన్ చెందిన ఇలియాస్‌కు మంత్రి హరీశ్‌రావు సహకారంతో మంజూరైన రూ.45 వేల చెక్కును అందజేశా రు. పేదలు ఆరోగ్యంగా ఉండట మే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు.

సనత్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి కోట నీలిమ దరఖాస్తు



నవతెలంగాణ-బేగంపేట్
సనత్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికితెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ బుధవారం దరఖాస్తు చేశారు. అనంతరం మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఓడించే సత్తా తనకే ఉందన్నారు. నాలుగేండ్లుగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. తనకు మద్దతు తెలిపిన ప్రజలకు, ధన్యవాదాలు తెలిపారు.

మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన సత్యనారాయణ

నవతెలంగాణ-కంటోన్మెంట్
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మూడోసారి నియోజకవర్గం టికెట్ ఖరారు కావడంతో బోయిన్‌పల్లి రిటైల్ మార్కెట్ చైర్మెన్ మక్కల సత్యనారాయణ బుధవారం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈసారి కూడా భారీ మెజార్టీతో గెపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైల్ మార్కెట్ సంబంధించిన పలు ప్రతినిధులు ఉన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఆర్. వి. మహేందర్ కుమార్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్
గోషామాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు ఆర్.వి మహేందర్ కుమార్ మంత్రి హరీశ్‌రావును కోరారు. బుధవారం మంత్రి నివాసంలో కలిసి బయోడేటా అందించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. 2001 నుంచి ఇప్పటివరకు ఎలాంటి పదవి ఆశించకుండా పార్టీ అభివృద్ధికికృషి చేశానని తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే ప్రజలు, నాయకులు, కార్యకర్తలను కలుపుకొని బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తానన్నారు. దీనిపై హరీష్ రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

బీసీ బంధు కుల వృత్తుల వారికి వరం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్,
- బీసీ బంధు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-అడిక్‌మెట్
బీసీ బంధు పథకం కులవృత్తుల వారికి వరం లాంటిదని పశు సంవర్ధక సినిమాటోగ్రఫీ శాఖమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోలక్‌పూర్ డివిజన్ కసిస్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి మంత్రి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని, ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు అసత్య ప్రచారాలు చేస్తే వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పాటుపడే బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో 24 గల ఉచిత కరెంటు, వృద్ధులకు రూ.2వేల పెన్షన్, వికలాంగులకు రూ.3వేల పెన్షన్ అందిస్తూ ప్రతి ఇంటికీ పెద్దదిక్కుగా నిలుస్తున్నారని చెప్పారు. గృహలక్ష్మీ పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతుందన్నారు. దళిత బంధుతో పేదలను లక్షాధికారులను చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. ఎన్నికలు రాగానే కులాలు, మతాలు మధ్య పంచాయతీ పెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే నాయకులను నమ్మొద్దని సూచించారు. బీజేపీ ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూంలు కట్టింది మేమే.. ఇచ్చేది మేమే అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ముషీరాబాద్ ఎమ్మార్వో వెంకటలక్ష్మి, నాయకులు ముఠా జయసింహ, డీపీవో సుధాకర్ రావు ముషీరాబాద్ నియోజకవర్గ ప్రెసిడెంట్లు, వై శ్రీనివాస్, వల్లాల శ్యామ్ యాదవ్, రావులపాటి మోజస్, రాకేష్ కుమార్, నర్సింగ్ ప్రసాద్ తదితరులున్నారు.



అంబర్‌పేటలో..

దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వారం రోజుల్లో అభ్యర్థులను ప్రకటించాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ సవాల్ చేశారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని కాచిగూడలో గల తుల్జాభవానీ ట్రస్ట్‌లో బీసీ కులవృత్తి దారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారని గుర్తుచేశారు. బీజేపీ అభ్యర్థులు లేరని, కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలకే పరిమితమైందని విమర్శిం చారు. మీకు దమ్ముంటే వారం రోజుల్లో అభ్యర్థులను ప్రకటించాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పే ధైర్యం తమకు ఉందని, మీరు ఏం చేశారో చెప్పే ధైర్యం అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలే గెలిపిస్తాయ న్నారు. కార్యక్రమంలో నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, ఎర్రబోలు నరసింహారెడ్డి , ఎర్ర భీష్మ దేవ్, చంద్రమోహన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. బీసీబంధునాలుగు నియోజకర్గాలకే కాకుండా ప్రతి నియోజకర్గంలోనూ అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఆర్థిక సాయం చేస్తామన్నారు.

జూబ్లీహిల్స్‌లో..

బీసీ బంధు పథకం నిరంతరం ప్రకియ అని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో 300 మందికి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీవెల్ఫేర్ ఆఫీసర్ ఆశన్న, నోడల్ ఆఫీసర్ పద్మ, స్థానిక కార్పొరేటర్లు రాజకుమార్ పటేల్, దేదీప్య రావు, సంగీత యాదవ్, డివిజన్ అధ్యక్షులు సంజీవ, ప్రదీప్, అప్పు ఖాన్, సంతోష్, కృష్ణమోహన్, నాయకులు విజయకుమార్, నజీర్, విజయసింహ, సిరాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సాహిత్యానికి సముచిత గౌరవం

- రాష్ట్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్
తెలంగాణ సాహిత్య వికాసానికి దోహదం చేసే రచనలకు సారస్వత పరిషత్తు సముచిత గౌరవం కల్పిస్తుంద ని రాష్ట్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. బుధవారం పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో 6 మంది ప్రముఖులకు ధర్మనిధి సాహిత్య పురస్కారాలు ప్రదానం చేశారు. ఒక్కొక్క రికి రూ.5వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ..పరిషత్తు 80 ఏండ్లుగా తెలంగాణ కు పెద్ద పీట వేస్తుందన్నారు. 2015 ఏడాదిలో తెలంగాణ సారస్వత పరిషత్తుగా పేరు మార్పుతో సంపూర్ణంగా తెలంగాణ సాంస్కృతిక వికాసానికి అంకితమైందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతో పన్యాసం చేస్తూ గతంలో అనేక సందర్భాల్లో పెద్దల పేర్లతో ఏర్పాటు చేసిన నిధి నుంచి వివిధ ప్రక్రియల్లో కృషి చేసిన వారికి పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు డాక్టర్ సుజాతారెడ్డి దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమతీ నరేంద్ర కుటుంబం నెలకొల్పిన ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి కాసుల ప్రతాపరెడ్డికి, ఆలూరి అజయ్ కుమార్ నెలకొల్పిన ఆలూరి బైరాగి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి సిద్ధార్థకు, డాక్టర్ ఆర్. లక్ష్మీ రెడ్డి నెలకొల్పిన తెలంగాణ తొలి తరం రచయిత్రి ఆచార్య పాకాల యశోదా రెడ్డి పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి డాక్టర్ తంగెళ్ల శ్రీదేవి రెడ్డికి, ఆచార్య రావికంటి వసునందన్ నెలకొల్పిన సాహిత్యపు రస్కారాన్ని ప్రముఖ కవి వి.పి. చందన్‌రావుకు, ప్రముఖ కవి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య నెలకొల్పిన మహాకవి వానమామలై వరదాచార్యుల పురస్కారం డాక్టర్ ఆచార్య ఫణీంద్రకు, జానపద విజ్ఞాన వేత్త డాక్టర్ చింతపల్లి వసుంధరా రెడ్డి నెలకొల్పిన జానపద విజ్ఞాన పురస్కారాన్ని ఆచార్య పాకనాటి జ్యోతి కి ప్రదానం చేశారు.

బీసీలకు రూ.10 లక్షల బీసీ బంధు ప్రవేశపెట్టాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజీ



నవతెలంగాణ-అడిక్‌మెట్
దళిత బంధు లాగా బీసీలకు కూడా రూ.10 లక్షల బీసీ బంధు పథకాన్ని అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జలపల్లి అంజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఎంబీసీ కులాల వాళ్లందరికీ రూ.10 రుణాలు ఇవ్వాలని బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని కోరారు. వచ్చే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 54 శాతం టికెట్లు కేటాయిస్తేనే బీసీల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

అవకాశవాదాన్ని ఆమడ దూరం ఉంచండి



- లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె రమేష్

నవతెలంగాణ-బంజారాహిల్స్
రాజకీయ అవకాశవాదులను ఆమడ దూరంలో ఉంచుతామని, కేసీఆర్‌ను వచ్చే ఎన్నికలలో చిత్తుగా ఓడించి శంకరగిరి మాన్యాలకు పంపిస్తామని లేబర్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె రమేష్ కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నిక ల్లో లేబర్ పార్టీ నుంచి జిల్లాకి 2 చొప్పున 66 ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల పేర్లను సెప్టెంబర్ 30వ తేదీన ప్రకటిస్తామన్నారు.పార్టీకి కామన్ సింబల్ కోసం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ఇండియాకు దరఖాస్తు చేశామన్నారు.

గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి సీకే మూర్తి దరఖాస్తు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
గోషామహల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సీకే.మూర్తి బుధవారం దరఖాస్తు చేశారు. కార్యకర్తలతో కలిసి గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డికి తన కుమార్తె రమ్య చేతుల మీదుగా దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. గోషామహల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానన్నారు. ఆయన వెంట బండాఅశోక్, గోవర్ధన్, జంబాగ్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్, కైలాష్ సింగ్, అశోక్ యాదవ్, బుచ్చి కాక, అరవిం ద్, ఆకాష్, పాండు, అరుణ్ సింగ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిరాభివృద్ధి



నవతెలంగాణ-ధూల్‌పేట్
పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థికవృద్ధి సాధించగలమని పర్యావరణ వేత్త ఆచార్య పురుషోత్తం రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్రం, పరిపాలనా విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న అంత ర్జాతీయ సదస్సులో మాట్లాడుతూ.. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పర్యావరణ పరిరక్షణ ప్రధానమైనదన్నారు. ప్రపంచ యుద్ధాలు నాటి నుండి నేటి వరకు పర్యావరణంలో ఏర్పడుతున్న మార్పులు జీవవైవిధ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయన్నారు. డాక్టర్ వనమాల మాట్లాడుతూ.. మానవ సమాజ అభివృద్ధికి శాస్త్రవేత్తలు నిర్మాణాత్మక సూచన లు చేయాలన్నారు. ఆచార్య శ్రీనివాసరెడ్డి జీవనంలో ఏర్పడుతున్న సంక్షోభాన్ని నివారించేందుకు చర్చించాలన్నారు. న్యూజిలాండ్ నుంచి సీనియర్ ప్రొఫెసర్ డెబలీన జూమ్ ద్వారా మాట్లాడారు. వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, కళాశాలల అధ్యాపకులు పత్ర సమర్పణ చేసిన ఈ సదస్సు నిర్వహణలో డాక్టర్. అయిజాజ్ సుల్తానా, డాక్టర్. తిరుపతి, డాక్టర్, భాస్కర్, డాక్టర్.శంకర్ పాలు పంచుకున్నారు.

వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించండి

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - అడిక్ మెట్
స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం ద్వారా వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ కౌన్సిలింగ్ సమావేశంలో మాట్లాడుతూ..స్టీల్ బ్రిడ్జి ప్రారంభించాక అశోక్ నగర్ నుంచి ఆర్ టీసీ క్రాస్ రోడ్‌లోని వ్యాపారస్తుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, పాదాచారులదారి (ఫుట్ పాత్) 6 చోట్ల యూటర్న్ కోరుతూ పలు మార్లు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని సమర్పించామన్నారు. కేవలం నాలుగు యూ టర్న్‌లు ఏర్పాటు చేశారని వివరించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడానికి అసలు బ్రిడ్జి అవసరమే లేని చోట, కేవలం కమీషన్ల దండుకోవడానికే స్టీల్ బ్రిడ్జి నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమస్యను పరిష్కరించడమే మా లక్ష్యం



నవతెలంగాణ-బేగంపేట్
ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే నా కర్తవమని, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో కలిసి మాతాజీ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మంచినీరు తక్కువ సమయం వస్తుందని మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకురాగా వెంటనే నీటి సరఫరా సమయం పెంచాలని, డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీచ్చారు.

మర్రి సరళాదేవి మృతి సంతాపం తెలిపిన కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ
మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తనయుడు మర్రి రవీందర్ రెడ్డి భార్య మర్రి సరళ దేవి మంగళవారం రాత్రి తార్నాకలోని వారి నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెన్నారెడ్డి నివాసంలో సరళాదేవి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బండ చంద్రారెడ్డి, శ్యామ్ సుందర్, నాగేశ్వర్ రెడ్డి, వీరన్న, పోచయ్య ఉన్నారు.

నాంపల్లి టికెట్ ముదిరాజ్‌లకు ఇవ్వాలి

- కేసీఆర్‌కు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమల రవి విజ్ఞప్తి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
నాంపల్లి నియోజకవర్గ అసెంబ్లీ స్థానంలో పోటీ చేసేందుకు ముదిరాజ్ కులస్తులకు అవకాశం ఇవ్వాలని ముదిరాజ్ (చింతల్ బస్తీ) సంఘం అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు కోమల రవి ముదిరా జ్ కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయ న మాట్లాడుతూ రాష్ట్రంలో 34 శాతం ముదిరాజ్ కులస్తులు ఉన్నారని, జనాభా దమాషా ప్రకారం ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా జనగాం, నర్సాపూర్, గోషామహల్, నాంపల్లి నియోజకవర్గా ల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ప్రకటించిన 115 స్థానాలలో ముదిరాజ్ అభ్యర్థులు లేరని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నాలుగు స్థానాలను ముదిరాజ్ కులస్తులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్‌లు ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిపిస్తున్నాం న్నారు. ప్రతిసారి ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతుందని, న్యాయం జరగాలంటే నాంపల్లి నియోజకవర్గాన్ని కేటాయించాలని కోరారు. పార్టీ ఆవిర్భావం నుండి సేవ చేస్తున్న తనకు ఈ స్థానాన్ని కేటాయించాలని రవి ముదిరాజ్ విన్నవించారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన 2001 నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. అయినా ఇప్పటి వరకు పార్టీ తనను గుర్తించి కనీసం కౌన్సిలర్, చైర్మెన్ పదవులు కూడా ఇవ్వలేదని వాపోయారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు నరేందర్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, అవినాష్ ముదిరాజ్, వినోద్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, శాంతి ప్రియ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెరైటీ విందు

శ్రావణమాసం.. అందులోనూ ఈ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం... ఇంట్లో పిండి వంటలు ఘుమఘుమలాడటం ఖాయం.. అయితే ఎప్పుడు చేసేలా కాకుండా కొంచెం వెరైటీగా స్వీట్స్, హాట్స్ చేసుకుంటే చాలా బాగుంటుంది. తినడానికి కూడా ఇంట్లో వాళ్లు ఇంట్రెస్ట్ చూపిస్తారు. అందుకే ఈ వారం స్వీటు హాటు వెరైటీగా ట్రై చేద్దాం...

పిల్లల విషయంలో ఇవి తప్పనిసరి..



పిల్లల చదువు, ఆరోగ్యం, వస్త్రధారణ విషయంలో ఏ లోటు రాకుండా చూసుకుంటాం. ఆహారపు అలవాట్లు, కుటుంబ పద్ధతులతో పాటు, కుటుంబంలోని మనుషుల మధ్య ఉండే అనుబంధాల విషయంలో జాగ్రత్త తీసుకుంటాం. అయితే స్కూల్‌కి వెళ్తున్న పిల్లల్లో తన తోటి పిల్లల ప్రభావం కూడా పడుతూ ఉంటుంది. అలాంటి వాటిల్లో కొన్ని విషయాలు చూసీ చూడనట్టుగా వదిలేస్తాం. అవే వారు ఎదిగాక వారి వ్యక్తిత్వాన్ని శాసిస్తాయి. తర్వాత వాటిని మార్చాలన్నా వినే స్థాయిలో పిల్లలు ఉండరు. అందుకే పిల్లల్లో మంచి గుణాలు అలవర్చడానికి పసితనం నుండే మంచి లక్షణాలు అలవడేలా జాగ్రత్త పడాలి. దాని కోసం కొన్ని నియమాలను కచ్చితంగా పెట్టాల్సిందే అంటున్నారు పిల్లల నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...


ప్లీజ్, థాంక్స్ : పిల్లలకు ఏదైనా పని చెప్పాలనుకున్నప్పుడు ప్లీజ్ అనడం, ఆ పని చేశాక థాంక్స్ చెప్పడం మరిచిపోకండి. ఆటోమేటిక్‌గా వాళ్ళకూ అలవాటవుతుంది. వాళ్ళు కూడా థాంక్స్ గాని ప్లీజ్ గానీ చెప్పినప్పుడు మీరు హ్యాపీగా ఫీల్ అవుతారన్న విషయం వారికి అర్థమయ్యేలా ప్రవర్తించండి.

భోజనం చేసేటప్పుడు : భోజనం చేసేటప్పుడు ఎలా మసలుకోవాలో పిల్లలకు వారు సొంతంగా తినడం మొదలు పెట్టినప్పటి నుండే చెప్పాలి. కొందరు పిల్లలు నోరు తెరిచి పెట్టి తింటుంటారు. తిన్న ప్రతీసారి ప్లేట్ చుట్టూరా అన్నం పడేయడం, అన్నం తింటున్న చేతితోనే గ్లాసుల్ని పట్టుకోవడం చేస్తుంటారు. అలాగని అంత చిన్న వయసు నుండే వాళ్ళు అన్ని పద్ధతులు నేర్చుకోవడం కుదరదు, కానీ అలా చేయడం కరెక్ట్ కాదన్న విషయాన్ని మాత్రం వారికి తెలియజేయాలి.

పార్టీలకు వెళ్ళినప్పుడు : పిల్లలు ఏదైనా బర్త్‌డే పార్టీకి వెళ్ళినప్పుడు అక్కడ ఎలా మసలుకోవాలో చెప్పి పంపించండి. ఫ్రెండ్స్‌తో ఎలా ఉండాలి, వారి పేరెంట్స్‌తో ఎలా ఉండాలి, తినేటప్పుడు తోటివారితో ఎలా మసలుకోవాలి ఒకటికి రెండు సార్లు చెప్పండి. ముఖ్యంగా పిల్లలు, స్వీట్స్, చాక్లెట్స్ విషయంలో అవగాహన లేకుండా ప్రవర్తిస్తుంటారు. వాళ్ళు వెళ్ళేది ఫ్రెండ్ పార్టీకి కాబట్టి అలా ప్రవర్తించకూడదని చెప్పి పంపించండి.

చులకన చేయడం : పిల్లల్లో సర్వ సాధారణంగా ఉండే అలవాటు. తోటివారిని వారి పేర్లతో కాకుండా ఫన్నీగా ఉండే పేర్లతో పిలుస్తుంటారు. క్లాస్ మేట్స్, ఫ్రెండ్స్‌నే కాదు ఒక్కోసారి టీచర్స్‌ని కూడా చులకన చేస్తుంటారు. ఇలాంటి అలవాట్లను మొగ్గలోనే తుంచేయాలి, వీలయితే ఎవరినైతే వారు కించపరుస్తున్నారో వారిలో ఉన్న గొప్పను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి, ఎదుటి వారిని కించపరిస్తే మనం లోకువైపోతామన్న విషయం వారికి తెలియజేయాలి.

పులిహోర



కావాల్సిన పదార్థాలు : బియ్యం- అరకిలో, చింతపండు - వంద గ్రా॥, ఉప్పు - తగినంత, పసుపు - రెండు చెంచాలు, బెల్లం తురుము - చెంచా, నువ్వుల నూనె - నూటయాభై గ్రా॥, ఇంగువ - చెంచా, దనియాలు - రెండు చెంచాలు, నువ్వులు - చెంచా, మెంతులు - రెండు చెంచాలు, కరివేపాకు - పది రెబ్బలు, ఎండుమిర్చి - ఇరవై, ఆవాలు - రెండు చెంచాలు, మినప్పప్పు - చెంచా, శెనగపప్పు - చెంచా, పల్లీలు - నాలుగు చెంచాలు

తయారు చేసే విధానం : బియ్యం పొడిపొడిగా ఉడికించి పక్కకు పెట్టుకోవాలి. చింతపండుని ముందే నానబెట్టి గుజ్జు పిండి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో దనియాలు, నువ్వులు, మెంతులు, కరివేపాకు, పన్నెండు ఎండుమిర్చి ఒక్కొక్కటి వేసుకుంటూ సన్నటిమంట మీద వేయించుకోవాలి. చల్లారాక పొడి చేసి పెట్టుకోవాలి. మందపాటి గిన్నెలో నూనె వేసి వేడయ్యాక ఆవాలు, మినప్పప్పు, శెనగపప్పు వేసి వేయించుకోవాలి. అందులోనే పల్లీలు కూడా వేసి కొంచెం వేగాక చింతపండు గుజ్జు, ఉప్పు, పసుపు వేసి బాగా కలిపి సన్న మంట మీద ఉడికించాలి. ఈ గుజ్జు సగమయ్యాక పొడి చేసిపెట్టుకున్న మిశ్రమం, బెల్లం తురుము వేసి ఉడికించాలి. చిక్కబడిన తర్వాత దించుకోవాలి. అన్నాన్ని ఒక పళ్ళెంలోకి తీసుకుని పచ్చినూనె వేసి కలిపి కరివేపాకు పచ్చిగానే అందులో వేసేయాలి. ఈ అన్నంలో ఉడికించిన పులిహోర ముద్దను వేసి కలిపి, ఉప్పు చూసుకుంటే సరి..



కొబ్బరి డ్రైఫ్రూట్స్ బూరెలు

కావాల్సిన పదార్థాలు : కొబ్బరి తురుము - కప్పు, బెల్లం తురుము -. ఒకటిన్నర కప్పు, జీడిపప్పు, బాదం పొడి - పావుకప్పు, కిస్మిస్ - రెండు చెంచాలు, మినప్పప్పు - పావు గ్లాసు, బియ్యం - అరగ్లాసు, మెంతులు - కొద్దిగా, నూనె - వేయించేందుకు సరిపడా, యాలకులపొడి- అరచెంచా

తయారు చేసే విధానం : ముందురోజు రాత్రి బియ్యం, మినప్పప్పు, మెంతులూ ఓ గిన్నెలోకి తీసుకుని నానబెట్టుకోవాలి. తెల్లారి వాటిని కడిగి మిక్సీ జార్‌లో వేసి మెత్తగా దోశపిండిలా రుబ్బి పెట్టుకోవాలి. కడాయిలో బెల్లం తురుము వేసి అది మునిగేలా నీళ్లు పోసి పొయ్యి మీద పెట్టాలి. బెల్లం కరిగాక కొబ్బరి తురుము, యాలకులపొడి, జీడిపప్పు, బాదం పొడి, కిస్మిస్ పలుకులూ వేసి బాగా కలపాలి. కాసేపటికి ఈ మిశ్రమం చిక్కగా అయ్యాక దింపేసి చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్నే చిన్నచిన్న ఉండల్లా చేసుకుని, దోశపిండిలో ముంచి, కాగుతున్న నూనెలో వేయాలి. ఎర్రగా వేగాక తీసేయాలి.

సొజ్జప్పాలు

కావాల్సిన పదార్థాలు : కొబ్బరి - సగం చెక్క, బెల్లం తురుము - కప్పు, బొంబాయి రవ్వ - కప్పు, మైదా - కప్పు, నూనె - వేయించేందుకు సరిపడా, ఉప్పు - చిటికెడు, యాలకులపొడి - కొద్దిగా, ఉప్పు - చిటికెడు

తయారు చేసే విధానం : మైదాలో చిటికెడు ఉప్పు వేసి నీళ్లు పోస్తూ పూరీపిండిలా కలిపి పెట్టుకోవాలి. కడాయిలో నూనె లేకుండా బొంబాయిరవ్వను దోరగా వేయించి తీసి పెట్టుకోవాలి. అదే బాణలిలో బెల్లం తురుమూ, అది మునిగేలా నీళ్ల పోసి పొయ్యి మీద పెట్టాలి. బెల్లం తురుము కరిగాక, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేయాలి. నిమిషం తర్వాత వేయించిన బొంబాయి రవ్వను కూడా వేసి కలపాలి. కాసేపటికి ఇది హల్వాలా తయారవుతుంది. ఈ మిశ్రమాన్ని దించేసి చల్లారాక చిన్నచిన్న ఉండల్లా చేసుకోవాలి. ముందుగా కలిపి పెట్టుకున్న మైదాను కొద్దిగా తీసుకుని చిన్న పూరీలా వత్తాలి. అందులో కొబ్బరి ఉండను ఉంచి, అంచులు మూసేయాలి. తర్వాత జాగ్రత్తగా మళ్ళీ పూరిలా వత్తుకోవాలి. దీన్ని కాగుతున్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి. ఇలాగే మిగిలిన పిండిని చేసుకుంటే సొజ్జప్పాలు సిద్ధం.



పెసరపప్పు హల్వా



కావాల్సిన పదార్థాలు : పెసరపప్పు - కప్పు, నెయ్యి - కప్పు, పాలు - కప్పు, చక్కెర - కప్పు, జీడిపప్పు పలుకులు, కిస్మిస్‌లు - కొన్ని, యాలకుల పొడి- అరచెంచా

తయారు చేసే విధానం : పెసరపప్పును గంట ముందుగా నానబెట్టుకోవాలి. తర్వాత నీటిని వంపేసి మెత్తగా రుబ్బుకుని పక్కన పెట్టుకోవాలి. కడాయిలో చెంచా నెయ్యి కరిగించి జీడిపప్పు, కిస్మిస్ పలుకుల్ని వేయించుకుని పెట్టుకోవాలి. కడాయిలో మిగిలిన నెయ్యిని కరిగించాలి. అందులో పెసరపప్పు ముద్ద వేసి మంట తగ్గించాలి. మధ్య మధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి పచ్చివాసన పోయి వేగినట్లు అవుతుంది. అందులో చక్కెర వేయాలి. రెండు నిమిషాల తర్వాత పాలు కూడా పోసి.. అడుగు అంటకుండా మధ్యమధ్య కలుపుతూ ఉండాలి. కాసేపటికి గట్టిపడి హల్వాలా తయారైతుంది. అప్పుడు యాలకులపొడి, వేయించి పెట్టుకున్న జీడిపప్పు, కిస్మిస్ పలుకులూ వేసి దింపేయాలి. అంతే.. హల్వా సిద్ధం

తోటకూర గారెలు



కావాల్సిన పదార్థాలు : పొట్టు మినప్పప్పు - గ్లాసు, జీలకర్ర - చెంచా, అల్లం, పచ్చిమిర్చి పేస్టు - చెంచా, తోటకూర తరుగు - అరకప్పు, ఉప్పు- తగినంత, మిరియాలు- అరచెంచా, నూనె - వేయించేందుకు సరిపడా

తయారు చేసే విధానం : మినప్పప్పును మూడు గంటల ముందు నానబెట్టుకోవాలి. తర్వాత నీళ్లన్నీ వంపేసి గారెల పిండిలా గట్టిగా రుబ్బుకోవాలి. పిండి మెత్తగా అయ్యాక జీలకర్రా, అల్లం, పచ్చిమిర్చి పేస్టూ, మిరియాలూ, తోటకూర తరుగూ వేసి మరోసారి మిక్సీ పట్టి, తగినంత ఉప్పు కలపాలి. కడాయిలో నూనె వేసి వేడయ్యాక పిండిని గారెల్లా చేత్తో ఒత్తుకుంటూ వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి.

జొన్న రవ్వ పాయసం

కావాల్సిన పదార్థాలు : జొన్న రవ్వ - అరకప్పు, పాలు - లీటరు, చక్కెర- గ్లాసు, యాలకుల పొడి - అర చెంచా, నెయ్యి - రెండు చెంచాలు, జీడిపప్పు, బాదం - పది చొప్పున (పలుకులు చేసుకోవాలి)

తయారు చేసే విధానం : ముందుగా కడాయిలో నెయ్యి కరిగించి బాదం జీడిపప్పు పలుకుల్ని వేయించి, విడిగా తీసి పెట్టుకోవాలి. అదే కడాయిలో జొన్నరవ్వను కూడా వేసి దోరగా వేయించుకోవాలి. వేగిన తర్వాత అందులోనే పాలు పోస్తూ కలుపుకోవాలి. రవ్వ మూడు వంతులు ఉడికాక చక్కెర వేసేయాలి. తర్వాత మంట తగ్గించి, మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. పదిహేను నిమిషాలకు పాలు కూడా సగం అయి, చక్కెర కరిగి, పాయసం చిక్కగా అవుతుంది. అప్పుడు యాలకుల పొడి, వేయించిన బాదం, జీడిపప్పు పలుకులూ వేసి దింపేయాలి.



కారు దిగు..'చెయ్యి' ఎత్తు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వలేదని పార్టీ నేతలు చెప్పారు. కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ కూడా కారు దిగారు. మంత్రి గంగుల కమలాకర్‌పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అదే జిల్లాకు చెందిన మరో నేత, మైత్రి గ్రూప్ చైర్మెన్ కొత్త జైపాల్‌రెడ్డి కూడా బీఆర్ఎస్‌ను వీడారు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. వీరిద్దరూ కూడా కరీంనగర్ అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికిప్పుడు తేల్చలేమనీ, పార్టీలో చేరిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందామని రేవంత్ అన్నట్టు తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాలో బలహీనంగా ఉన్న కాంగ్రెస్‌కు ఈ పరిణామాలు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈనెల 24న జైపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు మూహూర్తం ఖరారు చేసుకున్నట్టు తెలిసింది. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం గత కొంత కాలంగా బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. బుధవారం తన అనుచరులతో చర్చించిన ఆయన పార్టీకి రాజీనామా చేస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఆయనతోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కూడా మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈక్రమంలో వేముల రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన బీజేపీ నేత వినయ్‌కుమార్‌రెడ్డి ఆపార్టీకి రాజీనామా చేశారు. ఎంపీ అర్వింద్‌కుమార్ ఏకపక్ష ధోరణికి వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన...కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత సీతా దయాకర్‌రెడ్డితో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి బుధవారం భేటీ అయ్యారు. ఆమెను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇటీవల ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి మరణించిన సంగతి తెలిసిందే.

విస్తరణ, మరింత సహకారంపై బ్రిక్స్ నేతల దృష్టి

జోహన్నస్‌బర్గ్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగింట ఒక వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ దేశాధినేతలు బుధవారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో సమావేశమై విస్తరణ, సహకారాన్ని మరింతగా పెంచుకోవడంపై దృష్టి సారించారు. అంతర్జాతీయ రంగంలో వర్ధమాన దేశాలు మరింత సందర్భోచితంగా మారుతున్నాయని, కొత్త ప్రపంచ ఆర్థిక, రాజకీయ క్రమాన్ని రూపొందించేందుకు ఈ శిఖరాగ్ర సమావేశం ఎంతగానో దోహదపడుతుందని చైనా అధ్యక్షులు జీ జిన్‌పింగ్ అన్నారు.

15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో బుధవారం జిన్‌పింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది కొన్ని దేశాల ప్రత్యేక హక్కు కాదని, అన్ని దేశాలకు విడదీయరాని హక్కు అని అన్నారు. 'బ్రిక్స్ దేశాలు అభివృద్ధి, పునరుజ్జీవన మార్గంలో సహచరులుగా ఉండాలి, పారిశ్రామిక- సరఫరా గొలుసులను విచ్ఛిన్నం చేసే చర్యలను వ్యతిరేకించాలి, అలాగే ఆర్థిక బలవంతం చేయాలి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, హరిత అభివృద్ధి, సరఫరా గొలుసు వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారంపై దృష్టి పెట్టాలి' అని చెప్పారు. అలాగే బ్రిక్స్ సత్వర విస్తరణతో పాటు మరింత న్యాయమైన- సహేతుకమైన ప్రపంచ పాలనను ప్రోత్సహించేందుకు కృ చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. 'ఒకరి స్వంత నియమాలు- నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణంగా ప్యాకేజ్ చేయడం ఆమోదయోగ్యం కాదు" అని చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షులు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, భారత ప్రధాని నరేంద్ర మోడీ, దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమఫోసా కూడా ప్రసంగించారు. రష్యా నుంచి ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వ్యక్తిగతంగా రష్యాకు ప్రాతినిధ్యం వహించగా, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేయాల్సిన అవశ్యకతను వివరించారు. 40కి పైగా దేశాలు బ్రిక్స్‌లో చేరేందుకు ఆసక్తిని వ్యక్తం చేయడంతో కొత్త సభ్యులను చేర్చుకునే నిబంధనలను నాయకులు పరిశీలించారు.

ఏకాభిప్రాయం ఆధారంగా బ్రిక్స్ కూటమిని మరింత విస్తరించేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. భాగస్వామ్య దేశాల పరస్పర సహకారంతో ముందుకు వెళ్లడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. దక్షిణాఫ్రికాలో జరిగిన 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగించిన మోడీ ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వాన్ని తాము ప్రతిపాదిస్తున్నామన్నారు.

సేవ చేస్తున్నా గుర్తించండి...

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని బుధవారం సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం చర్చి కంపౌండ్ మైదానంలో నిర్వహించిన 'ప్రగతి శంఖారావం' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెసోళ్లు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతుండటం విడ్డూరంగా ఉందని, 50 ఏండ్లు ఛాన్స్ ఇస్తే తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. ఎలక్షన్ సమయంలో ప్రజలు తమ ధీరత్వాన్ని ప్రదర్శించాలని, ఎవరు ప్రజా సేవకులో గుర్తించి ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాతనే కరువు ప్రాంతాలకు సైతం కృష్ణ, గోదావరి నీళ్లను పారించి పసిడి పంటలు పండించుకునేలా చేశామన్నారు. మెదక్ జిల్లాలో ఘనపురం కాలువకు నీళ్లు ఇవ్వాలంటే ఆందోళన చేయాల్సిన దుస్థితి ఉండేదని, తెలంగాణ వచ్చాకనే 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. 24 గంటల పాటు కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్.. మూడు గంటలు చాలని అంటున్నారని, మరోపక్క బీజేపీ మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నదన్నారు. దుర్మార్గులు, చేతకాని వారికి అధికారం అప్పచెప్పితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. భూముల మీద వీఆర్వోల నుంచి సీసీఎల్ అధికారుల వరకు పెత్తనం చెలాయించిన రోజులు పోయాయని, కాంగ్రెస్ వాళ్లు మళ్ళీ ఆ పెత్తనాన్ని తీసుకొచ్చేందుకు ధరణిని రద్దు చేస్తామని చెబుతున్నారన్నారు. ధరణిని రద్దు చేయడం అంటే భూములపై రైతులకున్న హక్కు, అధికారాన్ని లేకుండా చేయడమేనని స్పష్టం చేశారు. ధరణి ఉండాలా.. పోవాలా.. అనేది తెలంగాణ రైతాంగం నిర్ణయించుకోవాలన్నారు. వడ్ల పైసలు, రైతుబంధు



పైసలు, రైతు బీమా టకాటకామని అకౌంట్లో పడుతున్నాయి అంటే ధరణి సిస్టం ఉండటం వల్లనే సాధ్యమవుతున్నదని తెలిపారు. 37 వేల కోట్ల రుణమాఫీని చేయడం రైతులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. మహారాష్ట్ర రైతులు వీఆర్వో వ్యవస్థను తీసేయాలని బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుతుంటే.. ఇక్కడున్న కాంగ్రెస్ వాళ్లు మాత్రం ధరణిని రద్దు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

నూతన భవనాలు, పెంచిన పింఛన్ ప్రారంభం

రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు హోంమంత్రి మహమూద్ అలీ, ఆర్అండ్‌బీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. వికలాంగులకు రూ.3,016 నుంచి రూ.4016 పెంచిన పింఛన్‌ను కొందరు లబ్దిదారులకు పంపిణీ చేస్తూ పథకాన్ని ప్రారంభించారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం, నేతల ముందస్తు అరెస్ట్

సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశంను, వామపక్ష నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మల్లేశం, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు కె.ప్రవీణ్‌లను మంగళవారం రాత్రి 11 గంటలకు అరెస్టు చేసి మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి 2.30 గంటలకు అక్కడి నుంచి పాపన్నపేట్ మండలం లక్ష్మినగర్ గ్రామంలోని ప్రగతి సెంటర్ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. ఉదయం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్‌ను అరెస్ట్ చేశారు.

నేడు మంత్రివర్గ విస్తరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల వ్యూహంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నారు. తాండూరు అసెంబ్లీ టికెట్‌ను త్యాగం చేసిన పట్నం మహేందర్ రెడ్డిని సంతృప్తి పరిచేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాజ్‌భవన్‌లో పట్నం చేత గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత ఆయన స్థానంలో కేసీఆర్ ఇప్పటి వరకు ఎవ్వరినీ మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఇప్పుడు రాజకీయ అవసరాల రీత్యా మహేందర్ రెడ్డికి బెర్త్‌ను కేటాయించారు.

మీడియా స్వేచ్ఛపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

నిజ నిర్ధారణ విభాగాన్ని (ఎఫ్‌సీయూ) ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఎడిటర్స్ గిల్డ్, భారతీయ పత్రికల సంఘం సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై బాంబే హైకోర్టు విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే యూపీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఆసక్తిని కలిగిస్తున్నాయి. నూతన ఐటీ నిబంధనలు ఏం చెబుతున్నాయంటే...కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏ సమాచారాన్ని అయినా ప్రచురించాలని లేదా సవరించాలని ఎఫ్‌సీయూ సూచిస్తే మీడియా సంస్థలు ఆ పని చేయాల్సిందే. సెప్టెంబర్ 3వ తేదీ వరకూ ఎఫ్‌సీయూని నోటిఫై చేయబోనని కేంద్రం తాజాగా కోర్టుకు తెలిపింది.

అయినప్పటికీ ఈ వ్యవహారం ఇప్పుడు బాంబే హైకోర్టు పరిశీలనలో ఉంది. విచారణ సందర్భంగా గత నెల 6వ తేదీన న్యాయమూర్తి ఏమన్నారంటే... 'ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రచారంలో రాజకీయ నాయకుడు చేసే ప్రకటనను ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ప్రశ్నించాడనుకోండి. దానిని తొలగించాలని ఎఫ్‌సీయూ చెప్పిందనుకోండి.

అది ఎలా సాధ్యం? అది ప్రభుత్వం చేయాల్సిన పనేనా?' అని ప్రశ్నిం చారు. న్యాయస్థానాలు ఎన్ని మొట్టికాయలు మొట్టినా బీజేపీ నాయకులు మాత్రం మీడియా వార్తలపై కర్ర పెత్తనం చలాయించాలని చూస్తూనే ఉన్నారు.

కర్ర పెత్తనం కోసం...

పత్రికలలో ప్రచురిస్తున్న వార్తలు వాస్తవమేనా కాదా అనే విషయాన్ని పరిశీలించాల్సిందిగా రెండు సంవత్సరాల క్రితమే కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సంస్థ అయిన పీఐబీని కోరింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి.

ఇప్పుడు ఐటీ నిబంధనల వ్యవహారం కోర్టు పరిశీలనలో ఉండగానే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మీడియాపై పెత్తనం కోసం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి 2017 నుండే యూపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై దాడులు ప్రారంభించింది. న్యాయస్థానాలలో క్రిమినల్ కేసులు పెట్టింది. ఇప్పటి వరకూ 48 మంది పాత్రికేయులపై భౌతిక దాడులు చేసింది.

మరో 66 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది. పత్రికా స్వేచ్ఛకు వ్యతిరేకంగా అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం కూడా 1988లో పరువునష్టం బిల్లు తీసుకొచ్చింది. అయితే నిరసనల నేపథ్యంలో దానిని ఉపసంహరించుకుంది. పాత్రికేయులు, మీడియా సంస్థలపై నిర్బంధాలు జరుగుతున్నప్పటికీ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) మాత్రం కోరలు తీసిన పాము చందంగా వ్యవహరిస్తోంది. మరి ఇక నిష్పాక్షిక మీడియాకు దిక్కెవరు?

విజ్ఞాన చంద్రోదయం

(మొదటిపేజీ తరువాయి)

అధిగమిస్తూ లక్ష్యాన్ని చేరుకుంది. 10నిముషాలకు పైగా గల రఫ్ బ్రేకింగ్ దశలో ల్యాండర్ సమతల వేగం గంటకు 6వేల కిలోమీటర్ల నుండి గంటకు 500కిలోమీటర్ల వరకు తగ్గింది. ఆ తర్వాత అల్టిట్యూడ్ హోల్డింగ్ దశలో చంద్రుని ఉపరితలంపైన దాదాపు 7.43 కిలోమీటర్ల ఎత్తున వున్న ల్యాండర్ దాదాపు 3.48కిలోమీటర్లు దూరం కిందకు దిగి సమతులంగా చేస్తున్న ప్రయాణాన్ని నిట్టనిలువుకు పొజిషన్‌కు మార్చుకుంది. ఫైర్ బ్రేకింగ్ దశ 175 సెకన్లు వుంది. ఈ సమయంలో ఎత్తును ఒక కిలోమీటరు తగ్గించుకుంటూనే దిగాల్సిన ప్రదేశానికి 28.52 కిలోమీటర్లు సమతులంగా ప్రయాణించింది. ఇక చివరి దశలో నిట్టనిలువుగా వున్న ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై ముందుగా నిర్దేశించిన ప్రదేశంలో సురక్షితంగా దిగింది. **కొద్ది గంటల్లో బయటకు ప్రజ్ఞాన్ రోవర్**

ల్యాండర్ మిషన్‌లోని అన్ని వ్యవస్థల తీరుతెన్నులను ఇస్రో పర్యవేక్షిస్తోంది. రానున్న కొద్ది గంటల్లో ల్యాండర్ మాడ్యూల్ నుండి ప్రజ్ఞాన్ రోవర్ బయటకు వస్తుందని ఇస్రో చీఫ్ సోమనాథ్ ప్రకటించారు. ఊహించిన దానికన్నా ల్యాండర్ దిగిన వేగం చాలా తక్కువగా వుందని అన్నారు. సెకనుకు 2 మీటర్లు లక్ష్యంగా పెట్టుకోగా అంతకన్నా తక్కువగానే వుందని, దీంతో భవిష్యత్ మిషన్‌లపై మరింతగా ఆశలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. రాబోయే 14 రోజుల్లో ల్యాండర్, రోవర్లలోని పరికరాలు చేసే ప్రయోగాలు ఉద్వేగభరితంగా వుంటాయని అన్నారు. విజయ సాధనలో భాగస్వాములైన శాస్త్రవేత్తల బృందానికి సోమనాథ్ కృతజ్ఞతలు తెలియచేశారు.

చంద్రయాన్ 3 విజయం పట్ల సీఎం కేసీఆర్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సేఫ్ లాండింగ్ అనే చివరి ఘట్టాన్ని చేరుకోవడం ద్వారా చంద్రయాన్ 3 ప్రయోగం సంపూర్ణ విజయాన్ని సాధించడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. చంద్రుని దక్షిణ ధ్రువం మీదకు లాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా చేర్చిన మొట్ట మొదటి దేశంగా, ప్రపంచ అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత దేశం సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందనీ, అరుదైన చరిత్రను సృష్టించిందని సీఎం తెలిపారు. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ సందర్భం అని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో శాస్త్రవేత్తలకు, సిబ్బందికి.. ఈ ప్రయోగం విజయవంతం కావడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. చిరకాల ఆకాంక్ష నెరవేరిన సందర్భంలో యావత్ భారతదేశ ప్రజలకు ఇది పండుగ రోజని సీఎం అన్నారు. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టబోయే అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు చంద్రయాన్ 3 విజయం గొప్ప ప్రేరణినిస్తుందని సీఎం పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, దేశ కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచే దిశగా, అంతరిక్ష పరిశోధన రంగంలో ఇస్రో తన విజయపరంపరను కొనసాగించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

ద్వైపాక్షిక సంబంధాలను పరిపుష్టం చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి గల మార్గాలను కూడా వారు చర్చించారు. రక్షణ, వ్యవసాయం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, సంరక్షణ, ప్రజల మధ్య సంబంధాలుతో సహా వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని నేతలు సమీక్షించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పరస్పరం ప్రయోజనాలు కలిగిన అంశాలతో సహా బహుళ అంతర్జాతీయ వేదికలపై సమన్వయాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. జి-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్‌కు పూర్తి మద్దతును దక్షిణాఫ్రికా నేత ప్రకటించారు. జి-20లో ఆఫ్రికన్ యూనియన్‌కు పూర్తి స్థాయి సభ్యత్వానికి భారత్ చేపట్టిన చొరవను స్వాగతించారు. సెప్టెంబరు 8-10 తేదీల్లో భారత్‌లో మొదటిసారిగా జి-20 సదస్సు జరగనుంది.

భారత్-దక్షిణాఫ్రికా సంబంధాలను మరింత పరిపుష్టం చేసే విస్తృతాంశాలను చర్చించామని, వాణిజ్యం, రక్షణ, పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు సాగాయని మోడీ ట్వీట్ చేశారు. సమావేశానికి సంబంధించిన కొన్ని ఫోటోలను కూడా ఆయన పంచుకున్నారు.



ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు

టీమిండియాకు రెండు వార్మప్ మ్యాచ్‌లు

దుబాయ్: ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు భారతజట్టు రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఇంగ్లండ్, నెదర్లాండ్స్ జట్లతో ఈ రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతి, తిరువనంతపురం వేదికల్లో ఆ మ్యాచ్‌లు జరగనున్నాయి. రెండుసార్లు ప్రపంచకప్ విజేత భారత్.. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో తొలి వార్మప్ మ్యాచ్‌ను సెప్టెంబర్ 30న గౌహతిలోని బర్సపర క్రికెట్ స్టేడియంలో ఆడనుంది. ఇక అక్టోబర్ 3న నెదర్లాండ్స్‌తో తిరువనంతపురం వేదికగా మరో వార్మప్ మ్యాచ్‌ను ఆడనుంది. అనివార్య కారణాలవల్ల ఏదైనా వార్మప్ మ్యాచ్ ఆ వేదికలో ఆడని పక్షంలో హైదరాబాద్‌ను వార్మప్ మ్యాచ్ తటస్థ వేదికగా ఎంపిక చేసినట్లు ఐసిసి ఆ ప్రకటనలో పేర్కొంది. ఇక సెప్టెంబర్ 29న బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య గౌహతిలో, దక్షిణాఫ్రికా-ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య తిరువనంతపురం, న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్ల మధ్య హైదరాబాద్ వేదికగా వార్మప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ప్రి క్వార్టర్స్‌కు డబుల్స్ జోడీలు

బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్



కోపెన్‌హాగెన్(డెన్మార్క్): బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి భారత పురుషుల, మహిళల డబుల్స్ జోడీలు ప్రవేశించాయి. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట ప్రత్యర్థులపై సునాయాసంగా గెలిచారు. త్రీసా-గాయత్రి జంట 21-18, 21-10తో చైనీస్ తైపీకి జంటను, పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ 21-16, 21-9తో ఆస్ట్రేలియా జంటను చిత్తుచేశారు. ప్రి క్వార్టర్స్‌లో 2వ సీడ్ చిరాగ్-సాత్విక్ జంట మలేషియాకు చెందిన 6వ సీడ్ మార్టిన్-కర్నోండోతో, త్రీసా-గాయత్రి జంట టాప్‌సీడ్ చైనాకు చెందిన చెన్-యు-ఫిన్‌తో తలపడనున్నారు.



ప్రజ్ఞానంద-కార్ల్‌సన్ రెండో గేమ్ డ్రా

ప్రపంచకప్ చెస్ ఫైనల్ నేటినుంచి టై బ్రేక్ పోటీలు

బాకు: ప్రపంచకప్ చెస్ ఫైనల్లో 18ఏళ్ల రమేశ్‌బాబు ప్రజ్ఞానంద రెండోరౌండ్‌లోనూ టాప్‌సీడ్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను నిలువరించాడు. బుధవారం భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, నార్వేకు చెందిన మాగ్నస్ కార్ల్‌సన్‌ల మధ్య జరిగిన ఫిడే ప్రపంచకప్ చెస్ ఫైనల్ రెండోరౌండ్ పోటీ 30ఎత్తుల అనంతరం డ్రాకు ఇరువురు అంగీకరించారు. క్లార్‌సన్ తెల్లపావులతో, ప్రజ్ఞానంద నల్లపావులతో నేటి గేమ్‌లను ఆడారు. గురువారం నిర్వహించే టైబ్రేక్ పోటీలు జరగనున్నాయి. ఇక మంగళవారం జరిగిన తొలి గేమ్ డ్రా కావడంతో ఇరువురు 1-1పాయింట్లతో సమంగా నిలిచారు.

నేటినుంచి టైబ్రేక్ పోటీలు..

తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో విజేత ఎవరో నిర్ణయించేందుకు టైబ్రేక్(ర్యాపిడ్) పోటీలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. తొలి టై బ్రేక్ 25+10 నిమిషాలతో రెండుగేమ్‌లు ఆడడం జరుగుతుంది. అది కూడా డ్రా అయిన పక్షంలో 10+10 నిమిషాలతో మరో రెండు టైబ్రేక్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. ఒకవేళ ఆ రెండు గేమ్‌లు కూడా డ్రా అయిన పక్షంలో 5+3నిమిషాలతో బ్లిట్జ్ పద్ధతిపై మరో రెండు గేమ్‌లను, చివరాఖరుగా 3+2నిమిషాలతో బ్లిట్జ్ సడెన్ డెత్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.

చంద్రయాన్-3 సక్సెస్‌తో ఆనందంలో భారత క్రికెటర్లు



డంబ్లిన్: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కాడంతో ఐర్లాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా క్రికెటర్లు హర్షం వ్యక్తం చేశారు. ల్యాండర్ జాబిల్లిపై దిగే ఉత్కంఠ క్షణాలను చూసేందుకు టెలివిజన్‌ల ముందు నిల్చొని ఆసక్తిగా తిలకించారు. విజయవంతంగా ల్యాండర్ చంద్రునిపై దిగడంతో ఆటగాళ్ల కేరింతలు కొడుతూ ఆనందంలో మునిగితేలారు.



లాంగ్‌జంప్ ఫైనల్‌కు జాస్విన్

బుడాపెస్ట్(హంగరీ): ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పురుషుల లాంగ్‌జంప్ ఫైనల్లోకి భారత అథ్లెట్ జాస్విన్ అల్డ్రిన్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన పోటీల్లో జాస్విన్ 8మీటర్లు జంప్ చేసి 12వ స్థానంలో నిలిచాడు. దీంతో కటాఫ్ జంప్‌కు చేరి ఫైనల్లో చోటు దక్కించుకున్నాడు. ఈ అథ్లెటిక్స్ పోటీల్లో ఫైనల్లో చోటు దక్కించుకున్న తొలి అథ్లెట్ జాస్విన్ మాత్రమే. ఇక ఒలింపియన్ మురళీ శ్రీశంకరన్ లాంగ్‌జంప్ ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు.

నవచిత్రం



వరుణ్ తేజ్

అరుదుగా ఇలాంటి పాత్రలు వస్తాయి

'గాండీవధారి అర్జున'లో ఏదో సందేశం ఇచ్చి, మీరు మారాలని చెప్పటం లేదు. ఇప్పుడున్న సమస్య ఏంటి? అనే దాన్ని చూపిస్తున్నాం. దాని వల్ల ఎవరైన మారితే మంచిదే. నేను రీసెంట్‌గా సినిమాను చూశాను. నాకు బాగా నచ్చింది' అని చెప్పారు కథానాయకుడు వరుణ్‌తేజ్. ఆయన హీరోగా నటించిన యాక్షన్ అండ్ ఎమోషనల్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున'. ఈ సినిమాలో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన ఈ సినిమాని ఈనెల 25న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా హీరో వరుణ్ తేజ్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. 'ప్రవీణ్ సత్తారు కాన్సెప్ట్స్‌లో సెన్సిబిలిటీస్ ఉంటాయి. 'గని' సినిమా షూటింగ్ సమయంలో తను ఈ కథ చెప్పాడు. అయితే ఈ కథలో తను మాట్లాడాలనుకున్న ఇష్యూ ఏదైతే ఉందో అది చాలా పెద్దదని నాకు ఓ యంగ్‌స్టర్‌గా తెలుసు. కానీ ఇప్పుడున్న బిజీ లైఫ్ వల్ల ఆ సమస్యను ఎవరం పట్టించుకోం. అది వెంటనే మనపైన ప్రభావం చూపేది కాదు. దాని ఎఫెక్ట్ కొన్నేళ్ల తర్వాత ఉంటుంది. ప్రవీణ్ చెప్పినప్పుడు కథలోని మెయిన్ పాయింట్, ఎమోషన్స్ నచ్చాయి. నటుడికి ఓ సామాజిక బాధ్యతాయుతమైన పాత్రల్లో నటించే సినిమాలు తక్కువగానే వస్తుంటాయి. మంచి కథతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఉండే సినిమా చేయటం నాకు బావుంటుందని పించింది. నాయిక సాక్షి వైద్య చాలా బాగా నటించింది' అని చెప్పారు.

మంచి జాయ్ రైడ్ ఫిల్మ్

అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్ బస్టర్ 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'ను తెలుగులో 'బాయ్స్ హాస్టల్' పేరుతో విడుదల చేస్తున్నారు. నితిన్ కృష్ణమూర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఈ చిత్రం ఈనెల 26న విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత సుప్రియ యార్లగడ్డ విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

ట్రైలర్ చూడగానే నవ్వొచ్చింది. దీన్ని ఎలాగైనా తెలుగు ప్రేక్షకులకు అందించాలని అనుకున్నాం. అలాగని దీన్ని రీమేక్ చేయలేం. అందుకే డబ్బింగ్ చేశాం. ఇదొక జాయ్ రైడ్. ఆ ఎనర్జీ, మ్యాజిక్‌ని రీ క్రియేట్ చేయలేం. అలాగే చాయ్ బిస్కట్ ఫిలిమ్స్ మంచి వైబ్ తో వుంటారు. చాలా చక్కగా చేస్తున్నారు. ఓనర్షిప్ వుంటే రిజల్ట్ ఎలా వున్నా జర్నీ బావుంటుంది.



సుప్రియ

ఒరిజినల్ సినిమాలో రమ్య చేసిన పాత్రకు తెలుగులో రష్మి పర్ఫెక్ట్ ఛాయిస్. ఇందులో చాలా హాట్‌గా కనిపిస్తారు. తన పాత్రతో సినిమాకి మరింత నేటివిటీ వచ్చింది. మనదంటూ ఒక ఫ్లేవర్ యాడ్ అయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ విషయంలో, రైటింగ్ సైడ్ కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. తెలుగులోనూ ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. నాగార్జున 100 సినిమాకి స్పెషల్‌గా ప్లాన్ చేస్తున్నారా అని అందరూ అడుగుతున్నారు. అయితే ఈ ప్రశ్నని ఆయననే అడగాలి. నేను ఏదైన చెప్తే నాకు పడతాయి (నవ్వుతూ). అలాగే చైతు, అఖిల్‌తో ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నాయి. సెకండ్ ఇన్నింగ్‌లో నటన స్టార్ట్ చేయలేదు. యాక్టింగ్ వచ్చా రాదా? అని చెక్ చేసుకోవడానికి 'గూఢచారి' చేశాను. 'గూఢచారి 2' లో నా పాత్ర ఉంటే చేస్తా.



జి.మురళి

అలాంటి విజువల్ బ్యూటీ చూస్తారు

'నేను పనిచేసిన గత చిత్రాలు కాలా, సార్పట్ట వంటివి చూస్తే రా అండ్ రస్టిక్ గా ఉంటాయి. కానీ 'ఖుషి'లో బ్యూటిఫుల్ ఫీల్ గుడ్ విజువల్స్ తెరపైకి తీసుకొచ్చే అవకాశం కలిగింది. ఫుల్ లైఫ్ తెరపై చూపిస్తున్న ఫీలింగ్ కలిగింది. ఈ సినిమా చూడటం పూర్తయ్యాక మీకొక కొత్త అనుభూతి కలుగుతుంది. కెమెరా ద్వారా ఆ ఎమోషన్ తీసుకొచ్చేందుకు నా ప్రయత్నం చేశాను' అని సినిమాటోగ్రాఫర్ జి.మురళి అన్నారు.

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. సెప్టెంబర్ 1న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ అయ్యేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాటోగ్రాఫర్ జి.మురళి మీడియాతో మాట్లాడుతూ, 'ప్రేమ గురించి కొన్ని కలలు కనే యువకుడికి లవ్, లైఫ్ అంటే మన ఊహలకు అనుగుణంగా ఉండదని తెలిసిరావడమే ఈ సినిమా నేపథ్యం. మణిరత్నం సినిమాల్లో సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ చూపించే విజువల్ బ్యూటీ ఈ చిత్రంలో చూస్తారు. అయితే అలాంటి సీన్స్‌ను మేము కాపీ కొట్టలేదు(నవ్వుతూ). అలాంటి ఫీల్ కలిగించేలా విజువల్స్ ఉంటాయి. శివ నిర్వాణ సినిమా మేకింగ్ మీద ఇష్టం ఉన్న దర్శకుడు. ఆయన మ్యూజిక్ సెన్స్ సూపర్బ్. ఇవాళ 'ఖుషి'లో ఇంతమంచి మ్యూజిక్ వచ్చిందంటే దానికి ఆయన మ్యూజిక్ టేస్ట్ కారణం. ఇందులో విప్లవ్, ఆరాధ్య క్యారెక్టర్‌లలో విజయ్, సమంత నటన మిమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది' అని తెలిపారు.

పేరులోనే ఉజ్వలం!

లక్ష్యానికి దూరంగా పీఎంయూవై



- అడ్డంకులు, అపోహలతో దూరమవుతున్న ప్రజలు
- పడిపోతున్న గ్యాస్ సగటు వినియోగం
- ఇప్పటికీ కొన్ని చోట్ల వంట చెరకే ఆధారం

గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల ప్రజలకు వంటగదిలో సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఇంధనాన్ని అందించే ఉద్దేశంతో 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. వంట చెరకు వినియోగం వాయు కాలుష్యానికి కారణమవుతోందని, మహిళల ఆరోగ్యం దెబ్బతింటోందని భావించిన కేంద్ర ప్రభుత్వం వారి ఇబ్బందులను తొలగించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించింది. కట్టెలు, బొగ్గు, పిడకలతో వంట చేస్తూ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్న గృహిణులు ఈ పథకంపై గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ వాస్తవంలో ఈ పథకం వారికి పెద్దగా ప్రయోజనం చేకూర్చడం లేదు.

న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు పీఎంయూవై పథకంపై క్రమేపీ ఆసక్తిని కోల్పోతున్నారు. గ్యాస్ కనెక్షన్లు పొందేందుకు భగీరథ ప్రయత్నం చేయాల్సి రావడం, ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడం, అన్నింటికీ మించి ధరలు అందుబాటులో లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతోందని ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనం తెలిపింది. ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ఏఐడీ), అసర్ సోషల్ ఇంపాక్ట్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎస్ఏఆర్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించి, ఈ నెల 21న ప్రచురించాయి. రాజధాని ఢిల్లీలోని పట్టణ మురికివాడలలోనూ, జార్ఖండ్ రాష్ట్రంలోని ఐదు గ్రామాలలోనూ అధ్యయనం జరిపారు. మహిళలతో ముచ్చటించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. చర్చా గోష్టులు సైతం నిర్వహించారు. మహిళలు తమకు తేలికగా లభించే ఇంధనాన్నే వంటకు ఉపయోగిస్తున్నారని అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు వంట గ్యాస్ లభించే ప్రాంతాలలో మహిళలు దాని వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే జార్ఖండ్‌లోని గ్రామీణ ప్రాంతాలలో వంట చెరకు ఎక్కువగా దొరుకుతుంది. దీంతో అక్కడి గృహిణులు దానితోనే వంటలు చేస్తున్నారు. అయితే వారికి దాని వల్ల కలిగే దుష్ప్రభావాలు అర్థం కావడం లేదు. వంట చెరకు కారణంగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, తమ ఆరోగ్యం దెబ్బతింటుందని వారు గ్రహించలేకపోతున్నారు. వంట చెరకును కాలిస్తే వచ్చే పొగ అసౌకర్యంగా ఉంటుందని అనుకుంటున్నారే తప్ప అది కాలుష్య కారకమని తెలుసుకోవడం లేదు.

తగ్గుతున్న వినియోగం

పీఎంయూవై పథకం కింద జూలై 1వ తేదీ నాటికి 9.59 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని ఇటీవల ముగిసిన రాజ్యసభ సమావేశాలలో పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తెలి తెలిపారు. గ్యాస్ కనెక్షన్‌కు అవసరమైన సెక్యూరిటీ డిపాజిట్, రెగ్యులేటర్, సురక్ష పైపు, డీజీసీ బుక్‌లెట్, ఇన్‌స్టలేషన్ ఛార్జీలు...వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వమే రూ.1,600 చెల్లిస్తోందని వివరించారు. సిలిండర్ బరువును బట్టి వినియోగదారులు తమకు ఇష్టమైన దానిని ఎంచుకోవచ్చునని, 14.2 కిలోల బరువుండే ప్రతి సిలిండర్‌కు ప్రభుత్వం రూ.200 సబ్సిడీగా అందిస్తోందని, సంవత్సరానికి 12 సిలిండర్ల వరకూ సబ్సిడీ పొందవచ్చునని చెప్పారు. అయితే ధరలు పెరిగిపోవడం, అది కూడా సిలిండర్ ధరను ఒకేసారి చెల్లించాల్సి రావడంతో అల్పాదాయ వర్గాల వారు వీటిపై ఆసక్తి చూపడం లేదని అధ్యయనం తెలిపింది. 2019, 2020లో సగటును ఒక్కో కుటుంబం సంవత్సరానికి మూడు సిలిండర్లను మాత్రమే వినియోగించిందని, 2021లో వినియోగం 4.4 సిలిండర్లకు పెరిగినా 2022లో 3.7 సిలిండర్లకు తగ్గిపోయిందని ఓ వార్త పత్రిక నివేదిక చెబుతోంది. లబ్దిదారుల ఆదాయం పెరగకపోవడమే దీనికి కారణం. అయితే చిన్న చిన్న కుటుంబాలకు సంవత్సరానికి నాలుగు సిలిండర్లు సరిపోతాయని కూడా ఆ నివేదిక తెలిపింది. 2021-22లో 92 లక్షల మంది వినియోగదారులు ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదని సాక్షాత్తూ మంత్రివర్యులే చెప్పారు. ధరల పెరుగుదలే దీనికి కారణమని ప్రభుత్వం కూడా అంగీకరిస్తోంది.

ఇబ్బందులతో సతమతం

పీఎంయూవై పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందడంలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణ ప్రాంతాలలో చిరునామాకు సంబంధించిన ధృవపత్రాలు పొందడం చాలా కష్టం. గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయాలంటే నివాస ధృవపత్రం తప్పనిసరి. దరఖాస్తులను ప్రాసెస్ చేయడంలో కూడా విపరీతమైన జాప్యం జరుగుతోంది. మారుమూల ప్రాంతాలలోని నివాస గృహాలకు గ్యాస్ సరఫరా చేయకపోవడం మరో ఇబ్బందిగా మారింది. పైగా గ్యాస్ వినియోగంపై గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ అపోహలు తొలగిపోలేదు. ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగించి వంట చేస్తే గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయని, ఆహార పదార్థాలు రుచిగా ఉండవని, ఉపయోగానికి అది సురక్షితం కాదని మహిళలు విశ్వసిస్తున్నారు.

ఏం చేయాలి?

గ్రామీణ మహిళలలో వంట గ్యాస్ వినియోగంపై నెలకొన్న అపోహలు తొలగించాల్సిన అవసరం ఉన్నదని అధ్యయనం సూచించింది. మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటింటికీ నేరుగా వంట గ్యాస్‌ను అందజేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని, దరఖాస్తు చేసే సమయంలో సమర్పించాల్సిన పత్రాల ప్రక్రియను సులభతరం చేయాలని సిఫార్సు చేసింది.

గురుకుల పరీక్షలకు 75.68 శాతం హాజరు

- మాస్టర్ ప్రశ్నాపత్రం, ప్రాథమిక కీ విడుదల
- 26 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు
- ట్రిబ్ కన్వీనర్ మల్లయ్య బట్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల విద్యాసంస్థల్లో 9,210 పోస్టుల భర్తీ కోసం ఈనెల ఒకటి నుంచి 23 వరకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ట్రిబ్) కన్వీనర్ డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 75.68 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీతో కూడిన మాస్టర్ ప్రశ్నాపత్రాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. అభ్యర్థులు వారి లాగిన్ ద్వారా సమాధాన పత్రంతో కీ తీసుకొని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 26 వరకు తెలియ చేయాలని ఆయన కోరారు. ట్రిబ్ ఆధ్వర్యంలో 9,210 పోస్టుల భర్తీకి తొమ్మిది నోటిఫికేషన్లను విడుదల చేసి పరీక్షలను ఈనెల ఒకటి నుంచి 23 వరకు నిర్వహించామని గుర్తు చేశారు. అభ్యంతరాలను ఈమెయిల్, పిటిషన్లను స్వీకరించబోమని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా కలెక్టర్లు, అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



అంతరిక్ష రంగంలో దేశం ఎంతో అభివృద్ధి

సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొ.మోహన్‌రావు

- ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జేవీవీ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారం

నవతెలంగాణ-ఓయూ

అంతరిక్ష రంగంలో దేశం మరింత అభివృద్ధి సాధిస్తున్నదని సీసీఎంబీ మాజీ డైరెక్టర్, తెలంగాణ సైన్స్ అకాడమీ అధ్యక్షులు డా.మోహన్‌రావు అన్నారు. బుధవారం చంద్రయాన్ 3 విక్రమ్ ల్యాండర్ ప్రయోగాన్ని హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద డిజిటల్ తెరపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రునికి దక్షిణ భాగం వైపున మొదటిసారిగా శాటిలైట్‌ను సురక్షితంగా దింపడం భారతదేశానికి గొప్ప గర్వకారణం అన్నారు. సైన్స్, రీసెర్చ్, స్పేస్ రంగంలో భారతదేశం అద్భుతంగా ముందుకెళుతోందని, మరో మైలురాయిని అధిగమించామని తెలిపారు. అనేక విధాలుగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ కూడా స్పెస్ రంగంలో ముందుకు పోతుందన్నారు. అయితే, దేశంలో మరికొన్ని సెంటర్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

జేవీవీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. మన సైంటిస్టులు, ఇస్రో ఒక ఆధునిక దేవాలయం అన్నారు. ఒకప్పుడు "జాబిల్లి రావే చందమామ రావే" అని పాట పాడేవారు కానీ ఇప్పుడు "జాబిల్లి వస్తున్నాం.. చందమామ వస్తున్నాం" అని గర్వంగా పాడుకోవచ్చని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్ అండ్ టెక్నాలజీకి నిధులు కేటాయించాలని.. అప్పుడు దేశం ఇంకా ఎంతో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అతి చిన్న దేశం జపాన్ టెక్నాలజీని జోడించి ప్రపంచాన్ని శాసిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వరప్రసాద్, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి లింగస్వామి, ఆమెచ్యూర్ అస్ట్రానమర్ వెంకటసాయిలు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, నాయకులు రవి, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు. జై విజ్ఞాన్, జై ఇస్రో, జై కిసాన్.. అనే నినాదాలతో ఆర్ట్స్ కాలేజీ ముందు సంబురాలు, సంతోషాలు వెల్లివిరిసాయి.

ఇండియా మీటింగ్‌కు ఐదుగురు ముఖ్యమంత్రులు

- కూటమి పార్టీల నుంచి 80 మంది రాజకీయ నాయకులు
- 31న ముంబయిలో కూటమి మూడో సమావేశం
- ఏర్పాట్లపై చర్చలు జరుపుతున్న ఎంవీఏ

న్యూఢిల్లీ : ఈనెల 31న ముంబయిలో నిర్వహించనున్న 'ఇండియా' కూటమి మూడో సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈనెల 31, సెప్టెంబర్ 1న జరగనున్న ఈ సమావేశానికి ఐదుగురు ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. అలాగే, 26 రాజకీయ పార్టీలకు చెంది 80 మందికి పైగా నేతలు ఈ సమావేశానికి రానున్నారు. ఈ విషయాన్ని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) నాయకులు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఈ సమావేశం గ్రాండ్ హయత్ హెూటల్‌లో జరుగుతుందని వారువివరించారు.ఈ సమావేశానికి సంబంధించి శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో సహా ఎంవీఏ సీనియర్ నాయకులు, కొంతమంది కాంగ్రెస్ నాయకులు ముమ్మర కసరత్తును చేస్తున్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రముఖులకు విందు ఇచ్చేందుకు ఉద్ధవ్ సిద్ధమవుతు న్నారు. ఈ భేటీలో ప్రతిపక్ష ఇండియా కూటమి లోగోను ఆవిష్కరించే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు రోజు, ఎంపీలు సుప్రియా సూలే, అనిల్ దేశాయ్, ఎమ్మెల్యే వర్ష గైక్వాడ్, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు అంబాదాస్ దాన్వే మరియు సంజయ్ నిరుపమ్‌తో సహా ఎంవీఏ నాయకుల బృందం భద్రతా ఏర్పాట్లపై చర్చించడానికి పోలీసు కమిషనర్ వివేక్ ఫన్సాల్కర్‌ను కలిసింది.సమావేశానికి సంబంధించిన ఎజెండాను ఢిల్లీలో ఖరారు చేయనున్నట్టు ఎంవీఏ నేతలు తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆపరేషన్ చేసి పొట్టలో దూది వదిలేసిన వైద్యులు

- పరిస్థితి విషమించి బాలింత మృతి
- డాక్టర్ నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం
- మృతదేహంతో అంబేద్కర్ విగ్రహం ముందు రాస్తారోకో



నవతెలంగాణ-అచ్చంపేట రూరల్

ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ నిర్లక్ష్యం బాలింత ప్రాణం తీసింది. ఆపరేషన్ చేసిన వైద్యులు పొట్టలో దూది వదిలేయడంతో వారం రోజుల తర్వాత తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. ఈ విషాద ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్చంపేట మండలం దర్శన్‌గడ్డ తండాకు చెందిన గిరిజన లంబాడి మహిళ రోజా గర్భం దాల్చినప్పటి నుంచి అచ్చంపేట పట్టణంలోని సŒరాం (శ్రీరామ్) ఆస్పత్రి డాక్టర్ కృష్ణ వద్ద చూపించుకునేది. ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలోనూ విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 15న రోజాకు పురిటి నొప్పులు రావడంతో డాక్టర్ వద్దకెళ్లారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ బాలింత కడుపులో దూది మర్చిపోయి కుట్లు వేశారు. ఆ తర్వాత రోజాను డిశ్చార్జి చేశారు. కాగా రోజాకు తీవ్ర రక్తస్రావమవ్వడంతో మంగళవారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్తస్రావం తగ్గకపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ సూచించారు. అక్కడికెళ్తే.. పేషెంట్‌కు పూర్తిగా రక్తం లేదని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని డాక్టర్లు చెప్పారు. దాంతో వెంటనే హైదరాబాద్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడి డాక్టర్లు రోజాకు స్కానింగ్ చేస్తే.. కడుపులో సుమారు 12 సెంటీమీటర్ల పొడవు గల ఒక వస్తువు ఉందని, అందువల్లే రక్తస్రావం అవుతోందని చెప్పారు. వెంటనే ఆపరేషన్ చేస్తేనే ప్రాణం దక్కుతుందని చెప్పారు. కానీ అప్పటికే పేషెంట్ శరీరం పూర్తిగా తెల్లబడిపోయి.. మంగళవారం రాత్రి మృతిచెందింది. కుటుంబీకులు ఆగ్రహంతో అచ్చంపేటలో శ్రీరామ్ ఆస్పత్రిని ధ్వంసం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాన్ని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెట్టి ధర్నా చేశారు.

బీఆర్ఎస్‌కు యువత బుద్ధి చెప్పాలి

- కోదాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉత్తమ్ పద్మావతి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలు మావే : నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-కోదాడరూరల్

రాష్ట్రంలోని 25 లక్షల మంది నిరుద్యోగ యువత బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో అతిపెద్ద సామాజికమైన తరగతి అయిన ముదిరాజ్ కులానికి బీఆర్ఎస్ ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్ కులస్తులు బీఆర్ఎస్‌ను తరిమికొట్టాలని చెప్పారు. 12శాతం ఉన్న ముస్లిములకు మూడు టికెట్లు కేటాయించి.. ఆ తరగతి వారిని అవమానించారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 70 స్థానాలు తామే గెలుస్తామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలు గెలవడం ఖాయమని చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆగడాలకు అడ్డూఅదుపూ లేదన్నారు. మైనింగ్, వైన్స్, సాండ్, ల్యాండ్ లాంటి అనేక దందాలు చేస్తున్నారని ఆరోపించారు. గుడిబండ గ్రామంలో దళితబంధు పథకంలో 70 శాతం అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. వెంచర్ చేయాలంటే ఎకరానికి రూ.3 లక్షలు ఎమ్మెల్యేకు ఇవ్వాలని కండిషన్ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బొల్లం మల్లయ్య యాదవ్‌కు ట్యాక్స్ (బీఎంటీ) కట్టడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలందరి కోరిక మేరకు హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి తాను, కోదాడ నియోజకవర్గం నుంచి పద్మావతిరెడ్డి పోటీ చేస్తామని చెప్పారు. తమపై హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కరెంటు భారాలు, కోతలతో జనం విలవిల

- ట్రూ అప్ ఛార్జీల వడ్డన అక్రమం
- మోడీ విధానాలతో ప్రజలపై పెనుభారాలు
- 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి
- మెడికల్ సీట్ల అమ్మకం దుర్మార్గం
- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ఏలూరు : కరెంటు భారాలు, కోతలతో రాష్ట్ర ప్రజానీకం విలవిలలాడుతున్నారని సిపిఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు, మూడు నెలలుగా కరెంటు బిల్లులు రెండు, మూడు రెట్లు అదనంగా వస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజానీకం, బడ్డీకొట్టు వ్యాపారులు, చిన్నచిన్న పరిశ్రమలు నడిపేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో 2016 నుంచి 40 పైసల నుంచి రూపాయికిపైగా అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. దీంతో, గతంలో రూ.400 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.800 వస్తోందని చెప్పారు. గతంలో ఎవరో వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు అద్దెకు ఉంటున్నవారు చెల్లించాల్సి వస్తోందన్నారు. మరోపక్క రెండు నుంచి నాలుగు గంటలపాటు కరెంటు కోతలు విధిస్తున్నారన్నారు. దీంతో, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 230 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మోటార్లకు కరెంటు లేక ఖరీఫ్ పంటలకు ఇబ్బంది వస్తోందని తెలిపారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు అవసరమా? అని ప్రశ్నించారు. రూ.6 వేలు ఖరీదు చేసే మీటర్లను రూ.35 వేలకు కొనుగోలు చేసి ఆ భారం వినియోగదారులపై వేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. అదానీ, షిర్డీసాయి కంపెనీలకు లాభాలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, కరెంటు కోతలు నివారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు సామాన్య ప్రజానీకానికి దక్కనీయకుండా ఎన్ఆర్ఐ, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా పేరుతో ప్రభుత్వమే అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కాలేజీల ఏర్పాటును అంతా స్వాగతించామన్నారు. ఉన్న సీట్లలో 15 శాతం ఆలిండియా కోటాపోను మిగిలిన 85 శాతం సీట్లను మెరిట్ ప్రాతిపదికన ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సగం సీట్లను ఎన్ఆర్ఐ, సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలకు అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ జిఒలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారుమోడీ అధికారంలోకొచ్చాక 20 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా 11.50 శాతం ద్రవ్యోల్బణం పెరిగిందన్నారు. టమాటా, నూనె, పప్పుల ధరలు భారీగా పెరిగిపోయాయని చెప్పారు. రేషన్ కింద ఇచ్చే చక్కెర, నూనె, పప్పులు ఇవ్వడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ రూ.120కు చేరాయని తెలిపారు. తాము అధికారంలోకొస్తే పెట్రోల్ రూ.40కు, గ్యాస్ సిలిండర్ రూ.400కు ఇస్తామని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు సిపిఎం సమరభేరి యాత్ర సాగనుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు ఇవ్వనున్నామని, నాలుగో తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నాలు జరగనున్నాయని చెప్పారు. వీటిలో

ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారువచ్చే నెలలో వామపక్షాల జాతీయ సదస్సు జరగనుందని చెప్పారు. విశాఖ ఉక్కు ఉద్యోగుల ఉద్యమం తరహాలో ప్రజలు ప్రత్యక్ష పోరాటంలోకి దిగాలని కోరారు. . పాడేరు మెడికల్ కాలేజీలో సీట్లు 75 శాతం గిరిజనులకే ఇవ్వాలని కోరారు. మెడికల్ సీట్లు అమ్ముకోవడం ఏ మాత్రమూ చెల్లబోదని, న్యాయస్థానంలో సానుకూలమైన తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర హక్కులపై వైసిపి, టిడిపి నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. మోడీని చూసి ఎందుకు వణికిపోతూ మోకరిల్లుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడితే ఊరుకోబోమన్నారు. ఇప్పటికైనా బిజెపిని నిలదీయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలు సాధించడంలో విఫలమైన బిజెపి నాయకులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు డివిఎస్‌విడి.ప్రసాద్, పి.కిషోర్ పాల్గొన్నారు.

భద్రతా మండలి పరిమితులను వెల్లడించిన ఉక్రెయిన్ యుద్ధం

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా వ్యాఖ్యలు

బ్రసీలియా : ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న యుద్ధం, ప్రపంచ దేశాల్లో శాంతిని పెంపొందించడంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 'పరిమితులను' వెల్లడించిందని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా బుధవారం వ్యాఖ్యానించారు. తక్షణమే కాల్పుల విరమణ జరిగి, శాశ్వత శాంతి నెలకొల్పేందుకు సమర్ధవంతంగా దోహదపడేలా సంయుక్తంగా కృషి చేపట్టేందుకు తామంతా సిద్ధంగా వున్నామని చెప్పారు. బ్రిక్స్ 15వ సదస్సు ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర అనేక ఘర్షణలు, సంక్షోభాలపై ఇంతలా దృష్టి కేంద్రీకరించడం లేదని అన్నారు.

ఉక్రెయిన్ యుద్ధం వల్ల అంతర్జాతీయంగా అనేక ప్రభావాలు కనిపిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని, ముఖ్యంగా వర్ధమాన దేశాల్లోని ప్రజలు బాగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శాంతి కోసం అన్వేషణ అన్నది సమిష్టి బాధ్యతగా వుండాలని, సుస్థిరమైన అభివృద్ధి కోసం శాంతి అనివార్యమని లూలా పేర్కొన్నారు. ప్రపంచంలో అవగాహన, సహకారం కొరకు ఒక శక్తిగా వ్యవహరించాల్సిందిగా బ్రిక్స్ సభ్య దేశాలను లూలా కోరారు.

సుప్రీం కోర్టు ప్రజాకేంద్రీకృత న్యాయస్థానం

సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు దాని వైవిధ్యాన్ని బట్టి వాస్తవానికి ప్రజల కేంద్రీకృత న్యాయస్థానం అని ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు. సుప్రీంకోర్టులో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌కు చెందిన న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం హర్యానాకు సంబంధించిన అంశంపై నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ప్రజలు న్యాయవ్యవస్థను విశ్వసిస్తారని, న్యాయమూర్తులు నియామకాలు సుప్రీం కోర్టుకు వైవిధ్యాన్ని తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ భట్టిలకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) సన్మాన కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ మాట్లాడారు. భాష, కులం, మతం, గుర్తింపుతో సంబంధం లేకుండా బార్ సభ్యుల మధ్య సంఘీభావ ప్రాముఖ్యతను ప్రదర్శించడానికి బార్ నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు చాలా కీలకమని అన్నారు.

ఆఫ్రికన్ యూనియన్ నుండి నైగర్ సస్పెన్షన్

నియామె : ఆఫ్రికన్ యూనియన్‌కు సంబంధించిన అన్ని సంస్థలు, కార్యకలాపాల నుండి నైగర్‌ను సస్పెండ్ చేశారు. నైగర్‌లో రాజ్యాంగ వ్యవస్థను సమర్ధవంతమైన రీతిలో పునరుద్ధరించేవరకు ఈ సస్పెన్షన్ తప్పదని యూనియన్ హెచ్చరించింది. నైగర్ అధ్యక్షుడు మహ్మద్ బజూమ్‌ను పదవీచ్యుతుడిని చేసి, ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను మిలటరీ గ్రూపు రాజధానిలో గృహ నిర్బంధంలో వుంచింది. నైగర్‌లో పరిస్థితిని చర్చించేందుకు ఈ నెల ఆరంభంలో ఆఫ్రికన్ యూనియన్ సమావేశమైంది. రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో ప్రభుత్వ మార్పును తిరస్కరించాలని సభ్య దేశాలను, అంతర్జాతీయ సమాజాన్ని ఎయు కౌన్సిల్ కోరింది. ప్రస్తుతం నైగర్‌లో వున్న చట్టవిరుద్ధమైన ప్రభుత్వానికి చట్టబద్ధతను మంజూరు చేసే చర్యలకు దూరంగా వుండాలని కోరింది. మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన కొత్త మిలటరీ పాలకులు, వారి మద్దతుదారులపై ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది.

ఓట్ల తొలగింపుపై పునఃపరిశీలన

- 30 వ తేదికి తుది నివేదిక
- సిఇసి ఆదేశం

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల తొలగింపుపై పున:పరిశీలన చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మెమో జారీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారులకు జారీ చేసిన ఈ మెమోలో 2022 జనవరి ఆరవ తేది నుండి ఇప్పటి వరకు చేసిన తొలగింపులన్నింటిని పున:పరిశీలన చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 30 వ తేది నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేసి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపాలని తెలిపారు. బిఎల్‌ఓలు 100 శాతం క్షేత్ర పరిశీలన జరపాలని, ఆ తరువాత ఇఆర్‌ఓలు కనీసం వెయ్యి తొలగింపులను పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రతి శాసనసభ నియోజక వర్గంలో కనీసం 500 తొలగింపులను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమిం చాలన్నారు.ప్రతి నియోజకవర్గం లో కనీసం 100 తొలగింపులను జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పూర్తిచేసి సాధ్యమైనంత త్వరగా నివేదిక ను సిఇఓ కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు.

బోగస్ 'రియల్' కంపెనీతో బురిడీ

బట్టబయలు చేసిన పోలీసులు రూ.1.36 కోట్ల రికవరీ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

వెంచర్ లేదు.. భూమి లేదు.. కంపెనీనే లేదు.. కానీ రంగురంగుల బ్రోచర్లతో బోగస్ కంపెనీ పేరుతో ప్రచారం చేసి.. కార్పొరేట్ స్థాయిలో కార్యాలయం పెట్టుకుని.. పదుల సంఖ్యలో ఏజెంట్లు.. సింగిల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టండి. ఏడాదిలోనే డబుల్ ప్రాఫిట్ పొందండి అంటూ ఆశ చూపి.. జనం నుంచి రూ.కోట్లు నొక్కేసిన నిందితులను నల్లగొండ ఎస్పీ అపూర్వరావు నేతృత్వంలో జిల్లా పోలీసు టీమ్ పట్టుకుంది. రియల్ వ్యాపారం మాటున 144 మందిని మోసగించి రూ.4.50 కోట్లకు టోకరా పెట్టిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.1,36,38,000 రికవరీ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ అపూర్వరావు విలేకర్లకు వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని ఓంకార్‌నగర్‌కు చెందిన మామిళ్ల గిరిప్రసాద్(34), బైరామల్‌గూడ పిండి నారాయణరెడ్డి కాలనీకి చెందిన బొడ్డు వెంకటేశ్(23) స్నేహితులు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. ఇతరులు చేసిన వెంచర్లలో ప్లాట్లు అమ్మిస్తామని చెప్పి, యాజమానుల



దగ్గరి నుంచి సదరు లేఔట్ కాపీలను తీసుకున్నారు. ఏడాది కిందట బైరామాల్‌గూడలో గోల్డెన్ ఈగల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో బోగస్ రియల్ ఎస్టేట్ కంపెనీని ప్రారంభించారు. ఆ కంపెనీ పేరు మీద బ్రోచర్లు తయారు చేయించి సువర్ణావకాశం అంటూ కొత్త స్కీమ్‌కు ప్లాన్ చేశారు. రూ.10 లక్షలు పెట్టి ఒక ప్లాట్ కొనండి.. ఏడాది తర్వాత ప్లాట్ తిరిగిచ్చి రూ.20 లక్షలు తీసుకెళ్లండి అంటూ పెద్దఎత్తున ప్రచారం చేశారు. అలా కొందరి నుంచి సొమ్ము చేసుకున్నారు.

కంపెనీ పేరు.. మకాం మార్చి..

కొన్నాళ్లకు అదే పేరుతో అప్పటికే రియల్ ఎస్టేట్ కంపెనీ ఉందనే విషయం తెలుసుకుని సదరు వ్యాపారులు ఓంకార్‌నగర్‌కు మకాం మార్చారు. అక్కడ ఐదు దుకాణాలను అద్దెకు తీసుకుని కార్పొరేట్ కార్యాలయం తరహాలో 'గౌతమ్స్ ఈగల్ ఇన్‌ఫ్రా డెవెలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ పేరుతో ఆఫీసు ఓపెన్ చేశారు. ఈ కార్యాలయంలో నమ్మకంగా పనిచేసేందుకు నానక్‌నగర్‌కు చెందిన బర్ల శేఖర్‌ను నియమించుకున్నారు. ప్రతి కస్టమర్ నుంచి వచ్చే డబ్బులో 0.8 శాతం శేఖర్‌కు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆఫీసు వ్యవహారాలన్నింటినీ బర్ల శేఖర్, బొడ్డు వెంకటేశ్ చక్కబెట్టేవారు. గౌతమ్స్ ఈగల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ పేరుతో పాంప్లేట్స్, బ్రోచర్లు, బుక్‌లెట్స్, నోట్ బుక్స్ ప్రింట్ చేయించి పెద్దఎత్తున మార్కెటింగ్ చేశారు. "రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు మా వెంచర్‌లో ఇన్వెస్ట్ చేయండి. ఏడాదిలోనే డబుల్ అమౌంట్ తీసుకెళ్లండి" అంటూ ప్రచారం చేశారు.

దీన్ని నమ్మించేందుకు వీలుగా ముందుగానే ప్లాట్ అగ్రిమెంట్ కాగితాలతోపాటు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చి కస్టమర్లను బురిడీ కొట్టించారు. దీనికితోడు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో ఓంకార్ నగర్‌కు చెందిన మామిళ్ల గిరిప్రసాద్ పేరుతోపాటు సదరు కంపెనీ పేరుపై భూమి ఉన్నట్టు, వెంచర్ లేఔట్ కాపీలను చైతన్యపురిలో తయారు చేయించారు.

30 శాతం కమీషన్ పేరుతో ఎర..

మామిళ్ల గిరిప్రసాద్, బొడ్డు వెంకటేష్ కలిసి తమకు అప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పరిచయం ఉన్న బట్టపల్లి గ్రామానికి చెందిన మాదగోని వెంకటేశ్ గౌడ్‌ను కలిశారు. "మా గౌతమ్స్ ఈగల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో ఎవరైనా తెలిసిన వారు ఉంటే పెట్టుబడి పెట్టించండి. అందుకు ప్రతిఫలంగా 30 శాతం కమీషన్ ఇస్తామని" ఆయనకు ఆశ చూపారు.

అలా మాదగోని వెంకటేశ్‌గౌడ్‌ను వారి వద్దే ఏజెంటుగా నియమించుకున్నారు. అతనిపాటు బర్ల శేఖర్ సైతం తనకు తెలిసిన వారితో బోగస్ కంపెనీలో పెట్టుబడి పెట్టించి 30 శాతం కమీషన్ తీసుకున్నారు. కస్టమర్లను తీసుకొచ్చిన వారికి కూడా 30 శాతం కమీషన్ ఇస్తామని చెప్పడంతో మాదగోని వెంకటేశ్‌గౌడ్ తన కింద కొంతమందిని ఏజెంట్లుగా పెట్టుకున్నారు. అలా వెంకటేశ్‌గౌడ్ కస్టమర్లను పెద్దఎత్తున మోసం చేసి ప్లాట్లను కొనుగోలు చేయించారు. వీరితోపాటు మర్రిగూడకు చెందిన సుధాకర్, చెరుకు శ్రీరాములు, బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పచ్చిపాల గణేశ్, సురిగి రమేశ్ సైతం కస్టమర్లను మోసగించారు.

నమ్మించేందుకు బాండ్ పేపర్లు.. పోస్ట్ డెటెడ్ చెక్కులు..

తమ కంపెనీలో ప్లాట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన కస్టమర్లకు ఎలాంటి అనుమానం రాకుండా మామిళ్ల గిరిప్రసాద్, బొడ్డు వెంకటేశ్, గిరిప్రసాద్ కంపెనీ పేరు మీద ఇన్వెస్టర్లు అందరినీ పిలిచి పార్టీ పెట్టారు. 'మా కంపెనీ మంచి లాభాలు ఇస్తుంది..' అని చెప్పి కొంత మంది తమకు కావాల్సిన వాళ్ళకి డబ్బులు పంచినట్టు నమ్మించి బాండ్ పేపర్లు రాసివ్వడంతో పాటు ప్రామిసరీ నోట్లు, పోస్ట్ డెటెడ్ చెక్కులపై సంతకాలు పెట్టి ఇచ్చేవారు. అలావచ్చిన డబ్బులో 30 శాతం ఏజెంట్ కమీషన్ పోగా, మిగిలిన దాంట్లో 40 శాతం జల్సాలు, సినిమా షూటింగ్‌లకు మామిళ్ల గిరిప్రసాద్, బొడ్డు వెంకటేశ్ ఖర్చు చేసేవారు. మరో 30 శాతం డబ్బును మాత్రం ఎవరైనా కస్టమర్లు వచ్చి మా డబ్బు వెనక్కి ఇవ్వాలని గొడవ చేస్తే ఇచ్చేందుకు వీలుగా ఆఫీసులోనే దాచిపెట్టారు. ఇప్పటివరకు ఈ మాయగాళ్లు 144 మందిని మోసం చేసి రూ.4.50 కోట్లు స్వాహా చేశారు. ఇదిలావుంటే.. ఆగస్టు 6న అన్నపూర్ణ స్టూడియోలో గౌతమ్స్ ఈగల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ ప్రొడక్షన్ నంబర్ 1 పేరు మీద సినిమా షూటింగ్ ప్రారంభించారు. ఒకవేళ బాధితులంతా వచ్చి డబ్బులు ఇవ్వాలని బలవంతం చేస్తే ఐపీ పెట్టి పరారయ్యేందుకు నిందితులు మామిళ్ల గిరిప్రసాద్, బొడ్డు వెంకటేశ్ పథకం వేయగా.. పోలీసులు గుర్తించి పట్టుకున్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

అక్రమాలకు పాల్పడితే ఎవ్వరినీ విడిచిపెట్టబోం. సువర్ణావకాశమంటూ అమాయక ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా మా దృష్టికి తీసుకురావాలి. రియల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

కె.అపూర్వరావు (నల్లగొండ ఎస్పీ)

బిజినెస్

వచ్చే మూడేళ్లలో రూ.30వేల కోట్ల పెట్టుబడులు

15,600 కిలోమీటర్ల పైపులైన్ల ఏర్పాటు

జాతీయ గ్రిడ్ నిర్మాణం : గెయిల్ ఛైర్మన్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశీయ గ్యాస్ సరఫరా దిగ్గజం గెయిల్ (ఇండియా) వచ్చే మూడేళ్లలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. పెట్రోకెమికల్ సామర్థ్యం విస్తరణ, గ్లోబల్ ఎల్ఎన్‌జి సరఫరాలో భారీ పెట్టుబడులు పెట్టనున్నామని ఆ సంస్థ ఛైర్మన్ సందీప్ కుమార్ గుప్తా తెలిపారు. బుధవారం జరిగిన కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశంలో గుప్తా మాట్లాడుతూ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు.

"గెయిల్ క్రమంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను సృష్టిస్తోంది. ప్రధానంగా పైప్‌లైన్‌లు, కొనసాగుతున్న పెట్రోకెమికల్ ప్రాజెక్టులు, సిజిడి ప్రాజెక్టులు, ఆపరేషనల్ క్యాపెక్స్, గ్రూప్ కంపెనీల్లో ఈక్విటీ సహకారం తదితరాలపై వచ్చే మూడేళ్లలో రూ.30,000 కోట్లు వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. 15,600 కిలోమీటర్ల పైప్‌లైన్‌లు ఆపరేషన్‌లో ఉన్నాయి. దాదాపు 4,200 కిలోమీటర్ల పైప్‌లైన్‌లు నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే ఏడాదిలో దాదాపు 20,000 కిలోమీటర్ల జాతీయ గ్యాస్ గ్రిడ్‌ను పూర్తి చేయనున్నాము. 160 కి.మీ గురుదాస్‌పూర్-జమ్మూ మార్గంలో సహజ వాయువు పైప్‌లైన్ వేయడానికి, నిర్మించడానికి, నిర్వహించడానికి లైసెన్స్‌ను దక్కించుకున్నాము. జగదీష్‌పూర్-హల్దియా- బొకారోలో అంతర్భాగంగా బరౌని-గౌహతి పైప్‌లైన్ (బిజిపిఎల్) విభాగం ద్వారా 729 కిలోమీటర్ల మేర ఉత్తర, ఈశాన్య ప్రాంతాలకు సహజ వాయువును సరఫరా చేయనున్నాము." అని గుప్తా తెలిపారు. భారత్‌లో పెరుగుతున్న పెట్రోకెమికల్ డిమాండ్‌తో, వచ్చే దశాబ్దంలో పెట్రోకెమికల్స్‌లో పెరుగుతున్న ప్రపంచ వృద్ధిలో భారత్ 10 శాతానికి పైగా దోహదం చేస్తుందని గుప్తా పేర్కొన్నారు.

రిలయన్స్ రిటైల్‌లో క్యుఐఎ పెట్టుబడులు

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్‌లో ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యుఐఎ) రూ. 8278 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. దీంతో రిలయన్స్ రిటైల్‌లో 0.99 శాతం వాటాను క్యుఐఎ పొందనుంది. ఈ మేరకు రిలయన్స్ సంస్థ రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. రిలయన్స్ రిటైల్ చివరిసారిగా 2020లో అంతర్జాతీయంగా వేర్వేరు ఇన్వెస్టర్ల నుంచి సుమారుగా రూ.47 వేల కోట్లకుపైగా నిధులను సమీకరించింది. దేశంలో రిలయన్స్ రిటైల్‌కు 18,500 స్టోర్లున్నాయి.

రెన్యూబైకు రూ.330 కోట్ల నిధులు

న్యూఢిల్లీ : ఇన్సూర్ టెక్ అగ్రగామి సంస్థ రెన్యూబై సిరీస్ డి ఫండింగ్ రౌండ్‌లో రూ.330 కోట్లు (40 మిలియన్ డాలర్లు) నిధులు సమీకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. జపనీస్ ఇన్సూరెన్స్ సంస్థ దాయిఇచి లైఫ్ హోల్డింగ్స్ ఇన్ కార్పొరేషన్ నుంచి ఈ నిధులు పొందినట్లు వెల్లడించింది. ఈ మొత్తాన్ని వినియోగదారుల అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి, ఉత్పాదన, సాంకేతిక విధులను మెరుగుపరచడం కోసం ఉపయోగించనున్నట్లు రెన్యూబై సిఇఒ బాలచందర్ శేఖర్ తెలిపారు. తమ సంస్థ 40 కంటే ఎక్కువగా బీమా సంస్థలతో కలిసి పని చేస్తుందన్నారు.

లావీ స్పోర్ట్ బ్రాండ్ అంబాసీడర్‌గా రణవీర్ సింగ్



ముంబయి : భారతదేశపు అతిపెద్ద బ్యాగ్ కంపెనీ అయిన బ్యాగ్‌జోన్ లైఫ్‌స్టైల్ బ్రాండ్ అయినా లావీ స్పోర్ట్ బ్రాండ్ అంబాసీడర్‌గా బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. లావీ స్పోర్ట్ విస్తృత ఉత్పత్తులైన బ్యాక్‌ప్యాక్‌లు, డఫిల్ బ్యాగ్‌లు, బ్రీఫ్‌కేస్‌లు, వాలెట్‌లకు ప్రచారం కల్పించనున్నారు. డిజిటల్, సోషల్ మీడియాలో విస్తరించిన వాణిజ్య ప్రకటనల ద్వారా సరికొత్త సేకరణతో పాటు బ్రాండ్ ప్రస్తుత పోర్ట్‌ఫోలియోకు కూడా రణవీర్ ప్రచారం చేయనున్నారని లావీ స్పోర్ట్ సిఇఒ, వ్యవస్థాపకుడు ఆయుష్ తైన్‌వాలా తెలిపారు.

కీటో మోటార్స్, సైరా ఎలక్ట్రిక్ జట్టు

హైదరాబాద్ : మూడు చక్రాల విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ కీటో మోటార్స్ కొత్తగా సైరా ఎలక్ట్రిక్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు తెలిపింది. దీంతో ఎలక్ట్రిక్ 3 వీలర్ (ఇ3డబ్ల్యుటి) మార్కెట్‌లో కీలకమైన పాత్ర పోశించాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. తమ ఈ భాగస్వామ్యంతో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల (ఇ రిక్షా) రూపకల్పన, తయారీ, రిటైలింగ్‌లో సైరా ఎలక్ట్రిక్ నైపుణ్యాన్ని ఉపయోగించడం ద్వారా ఇవి మార్కెట్‌లో గణనీయమైన ప్రభావం చూపనుందని విశ్వాసం వ్యక్తం చేసింది.

చక్కెర ఎగుమతులపై నిషేధం..!

న్యూఢిల్లీ : చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం ప్రకటించే అవకాశం ఉందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వచ్చే సీజన్ అక్టోబర్‌లో చెరుకు దిగుబడి భారీగా పడిపోవచ్చని ప్రభుత్వ వర్గాల అంచనా. మహారాష్ట్ర, కర్నాటకలో సగటు కంటే 50 శాతం తక్కువ దిగుబడి చోటు చేసుకునే అవకాశాలు కనబడుతున్నాయి. దీంతో దేశంలో చక్కెర ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే గత ఏడేళ్లలో ఎప్పుడూ లేని విధంగా తొలిసారి చక్కెర ఎగుమతులపై ఆంక్షలు పెట్టాలని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.